# కథామంజరి


## పది కథల సమాహారం




ఏప్రిల్ 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**ఏప్రిల్ 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 4



# మా జట్టు


సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ /శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి




## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | iii |
| కథా మార్గదర్శి | v |
| కథా పరిచయం | vii |
| వినదగునెవ్వరు చెప్పిన .. | x |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| సాక్షి | డా. ఎం. సుగుణరావు | 1 |
| ఉత్తరాయణం | చొప్పదండి సుధాకర్ | 10 |
| మా రూటే సెపరేటు | డా. ఎం. కోటేశ్వరరావు | 16 |
| అంతా మన మంచికే | సిరిపురపు హనుమత్ ప్రసాద్ | 22 |
| మహర్దశ! | దినవహి సత్యవతి | 30 |
| సమ్మతమే! | తెలికచర్ల విజయలక్ష్మి | 37 |
| చిలుక పలుకులు | కోనే నాగ వెంకట ఆంజనేయులు | 42 |
| జలనిధి | లక్ష్మీ గాయత్రి | 44 |
| నరకకూపం | సలీం | 47 |
| గోమొన్న సాయ్ | కీ. శే. వాకాటి పాండురంగారావు | 54 |


Cover Page Credits : Shri P.S.N. Murty, Visakhapatnam

# కథాకీయం

'మా పిల్లలు పుస్తక పురుగులు.. క్లాసు పుస్తకాలు మాత్రం ముట్టుకోరు! అన్నీ వాళ్ళ నాన్న బుద్ధులే' అని తల్లులు, చాలా చిరాకుపడిన రోజుల్ని.. ఒకప్పుడు ప్రతి ఇంటా చూసే వాళ్ళం! నిజం కూడా అదే...! పిల్లలకి కాస్త చదవడం, అర్థం చేసుకునే వయసు వచ్చేసరికి.. కథలపుస్తకాలు పట్టుకుని చదువుకునేవారు. కొంచెం హైస్కూలు చదువుల్లోకి వచ్చేసరికి.. వారపత్రికలు.. అందులో ముఖ్యంగా సినిమా పేజీల మీద పడేవారు. ఆ స్థాయి నుంచి ఎదిగి.. ఇంట్లో తెలియకుండా డిటెక్టివ్ పుస్తకాలు చదివేవారు. ఇంట్లో కుదరకపోతే, స్కూల్లో చివరిబెంచిల్లో సర్దుకుని, క్లాసు పుస్తకాల్లో డిటెక్టివ్ నవలలు పెట్టుకుని దొంగతనంగా చదివే బాపతు చాలామంది ఉండేవారు.

ఇక ఆ స్థాయి నుంచి ఎదిగి.. నవలలు చదవడం మొదలెట్టేవారు. స్కూలు పుస్తకాలు, పరీక్షలు అంటూ ఇంట్లో చీవాట్లు పెడుతున్నా సరే.. పుస్తకాల్ని వదిలేవారు కాదు. పరీక్షలు లేని రోజుల్లో.. పిల్లలు పెద్దలు కూడా భోజనం చేస్తూ, రోడ్డు మీద నడుస్తూ కూడా, వారి పుస్తకపఠనం సాగిపోయేది. ఆ రోజుల్లో "పుస్తకం హస్తభూషణం" అని ఊరకే అనలేదు... చేతిలో పుస్తకం ఉంటే, ఓ గుర్తింపు ఉండేది! 'అదిగో.. క్లాసు పుస్తకాలు ముట్టుకుంటే చాలు, నిద్ర ఇట్టే ముంచుకొచ్చేస్తుంది. ఆ దిక్కుమాలిన పుస్తకాలు పట్టుకుంటే.. పగలూ రాత్రీ కూడా తెలియదు!' అంటూ చీవాట్లు పడుతున్నా సరే.. ఆ మాటల్ని సీరియస్‌గా తీసుకునేవారు కూడా కాదు! అలాగే.. కొంతమంది గుర్తింపు కోసం... బయట డాబు చేయడానికి చేతిలో ఇంగ్లీషు నవలలలో, పాపులర్ తెలుగుపుస్తకాలో చేత్తో పట్టుకుని తిరిగేవారు. వెరసి.. పుస్తకపఠనం అలా బాల్యం నుంచి అలవడేది. దీనికి తోడు.. ఆ రోజుల్లో హైస్కూలు స్థాయి నుంచి వ్యాసాలు తప్పనిసరిగా వ్రాయించేవారు. 'ఆవు వ్యాసం' తెలియని, రాయని తెలుగువారు లేరంటే అతిశయోక్తి కానే కాదు. పరీక్షల్లో తప్పకుండా ఓ వ్యాసం వ్రాయవలసి ఉండేది. దాని కోసం.. స్కూలు పుస్తకాలే కాకుండా, మిగతావి కూడా చదివి, అవగాహన చేసుకునే కసరత్తు చేసేవారు. ఈ 'వ్యసనమే' వారందరిని భవిష్యత్తులో మంచి పౌరులుగా నిలబెట్టింది. పెద్దచదువులు చదవకపోయినా సరే.. ఆ మాత్రం చదువుకున్న ప్రతివారు.. వారివారి బాటల్లో పెద్దవారిగా చేసిన ఘనత పుస్తకపఠనానిదే! ముఖ్యంగా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.. ఇలా పుస్తకాల వైపు పిల్లలు, పెద్దలు ఆకర్షితులవడానికి "చందమామ" పత్రిక పాత్ర చాలా వుందనే చెప్పాలి. పిల్లల దృష్టి పుస్తకపఠనం వైపు మళ్లించడానికి పునాది వేసిన పుస్తకం 'చందమామ' అని చెప్పాలి! చదవడం వచ్చిన ప్రతీ భారతీయుడు చందమామని చదివినవారే ఉంటారు.

వర్తమానంలో ఈ పరిస్థితి లేదు. మూడో ఏట నుంచి.. ఎదగడానికి తొందరపడతారు. స్కూలు, హోమ్‌వర్కులు, ప్రాజక్టులు అంటూ.. అన్నప్రాశన నాడే ఆవకాయ అన్నం పెట్టేస్తున్నారు. పుస్తకపఠనం అంటే అర్థం ఏమిటని ప్రశ్నించే పరిస్థితి ఈరోజు మనకి కనబడుతుంది! కంప్యూటర్ యుగం వచ్చి, చాలా అలవాట్లను, సాంప్రదాయాలను తుంగలోకి తొక్కేసింది. ఇప్పుడు పరిస్థితి ఎలావుందంటే.. అంతర్జాలంలో పుస్తకాలు లభ్యమవుతున్నా సరే.. వాటి పైకి ధ్యాస మళ్లడం లేదు. పక్కత్రోవ పడుతున్నారు. ఒకొక్కసారి ప్రభుత్వ విధానాలు చూస్తుంటే నవ్వొస్తుంది. ఒకరు తప్పితే ఇద్దరు పిల్లలు మాత్రమే అని అంక్షలు పెట్టి, జనాభా వృద్ధిరేటుని ఆపేసారు. ఈ పరిస్థితి కొనసాగితే.. రాబోయే కాలంలో ఏ దేశంలో చూసిన వృద్ధులే కనబడతారనే ప్రమాదాన్ని చూసి, ఇప్పుడు మళ్ళీ పిల్లలను కనమంటున్నారు. ముగ్గురు నలుగురైనా ఫర్వాలేదని

ప్రభుత్వమే పిలుపునిచ్చింది. వాళ్ళని మంచి పౌరులుగా, సమాజానికి పనికొచ్చేవారిగా తయారుచేయాలంటే.. ప్రాథమిక స్థాయి నుంచి పుస్తకపఠనం తిరిగి ఆరంభించాలి. వాళ్ళల్లో సృజనాత్మకతను కలగచేసే విద్యావ్యవస్థను ప్రవేశపెట్టాలి. ముఖ్యంగా, పిల్లల్లో పుస్తకపఠనం అలవడ్డానికి చర్యలు తీసుకుంటే.. భవిష్యత్తులో మనిషి బతికి బట్టడానికి ఊపిరి ఇస్తున్నట్లే అని చెప్పాలి! లేకపోతే.. మనిషిని మనిషి పీక్కు తినే రోజులు వస్తాయి!

**సంపాదకుడు**








# విశిష్ట అతిథి

**శ్రీ సలీం**

ఆకలి జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పుతుంది. నీతి నిజాయితీలను తెలియచేస్తుంది. కష్టపడటం నేర్పిస్తుంది. అన్యాయాల మీద తిరగబడటంతో బాటు, కొద్దిమందిని విచక్షణాజ్ఞానం కోల్పోయే స్థితికి దిగజారుస్తుంది కూడా! ఈ పాఠాల నేపథ్యంలో, మంచిమార్గాన్ని ఎన్నుకుని.. కష్టపడి మేధావులు అయినవాళ్ళు ఉంటారు. చదువులు చదవకపోయినా, జీవితంలో ఎదిగిన వారూ ఉంటారు. చెడుని మాత్రమే గ్రహించి నేరాలు చేసేవాళ్ళూ ఉంటారు. విప్లవకారులూ కూడా ఉంటారు. అలా ఆధునికయుగంలో కూడా.. కష్టాలు పడి ఎదిగినవారిలో మేధస్సుతో పాటు, ఉత్తమమైన వ్యక్తిత్వం ఉన్నవారు చాలామంది ఈ రోజుల్లో ఎదురవుతూ ఉంటారు. ఆ కోవలో, మిగతా రంగాలతో పాటు, తెలుగు సాహిత్యరంగంలో ఎందరో ఉత్తమోత్తములు మనకి సాక్ష్యాత్కరిస్తారు. అలాంటి వారిలో.. 'కష్టాలు పడేవాడి కలం పదునుగా ఉంటుంది' అనే మాటని ఓ పెద్దాయన ఎంత అనుభవంతో అన్నారో గాని.. ఇది అక్షరసత్యమని ఉదహరించుకోగలిగే రచయిత శ్రీ సయ్యద్ సలీం గారు! తెలుగు కథా, నవలా ప్రపంచానికి పరిచయం చేయక్కర్లేని, జగమెరిగిన రచయిత సలీంగారు!

పేదరికంలో ఓ సోయగం ఉందని నమ్మే సలీంగారి సాహితీప్రస్థానం.. హైస్కూలు చదువు నుంచే ఆరంభమైంది. ప్రతి చిన్న విషయానికి స్పందించి, విశ్లేషించుకోగలిగే ఆలోచనాశక్తి.. సలీంగారిని కవిత్వం వైపు నడిపిస్తే, మరోవైపు బాల్యం నుంచి తోడున్న ఆకలి, ఊరడించే కన్నీళ్ళు, చుట్టూ కలుషితమైన సమాజం, మానవమృగాలు... విప్లవకవిత్వం వైపు అడుగులు వేయించాయి! కవితలు, కథలు, నవలలు.. వ్రాస్తూ, మరోవైపు వయసు పెరిగిన కొలది.. ఆలోచనల్లోనూ, వ్రాసే కథల్లోనూ పరిపక్వత పెరిగింది. తొలి రోజుల్లో మానవ సంబంధాలు, స్త్రీ పురుష సంబంధాలు మీద కథలు వ్రాస్తే, తర్వాతి కాలంలో సమాజంలో రావలసిన సంస్కరణలు, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఉన్న ముస్లింసమాజంలో రావలసిన మార్పులు, కనుమరుగవుతున్న మానవతా విలువలు కథావస్తువులుగా కథలు వ్రాసారు.. వ్రాస్తున్నారు! చెప్పదల్చుకున్న విషయాన్ని సూటిగా హృదయాన్ని హత్తుకునేలా, మనసుని కుదిపేలా.. వీరి కథలు ఉంటాయి. 'మత కల్లోలాలు, మారణకాండలు, హింస.. ఇవన్నీ రాజకీయంగా జరుగుతున్నవే' అని నమ్మే సలీంగారు సృజించని అంశం లేదనే చెప్పాలి. సలీంగారు వ్రాసిన మూడువందలు పైగా కథల్లోని కథాంశాలు, ముప్పయ్ ఐదు నవలలు.. అన్నీ విలక్షణమైనవే! ప్రతీ కథా ఆణిముత్యమే! శ్రీశ్రీ, తిలక్, బుచ్చిబాబు, శరత్, చలం, రావిశాస్త్రి, మాక్సిం గోర్కి, టాల్‌స్టాయ్.. మొదలైన వారి రచనలు అంటే ఇష్టపడే సలీంగార్ని.. 'రచయితలూ, వారి రచనలు కాదు... సమాజం, సన్నిహితంగా మెలిగిన అభాగ్యులు, దారిద్ర్యం.. వంటివి కూడా నన్నో రచయితని చేసాయి' అంటారు. సలీంగారి రచనలలో మతాలు,

కులాలు కనబడవు, వాటిలో ఉండే మంచీ చెడులు కనబడతాయి. మంచిని గాని, చెడుని గాని నిర్భయంగా, నిర్మొహమాటంగా చెప్పగలిగే రచనలు చేస్తున్న సలీంగారు.. అవార్డులు గురించి ఓ మాట అంటారు. "అవార్డులు సృజనశీలతకు కొలబద్దలు కావు. నిబద్ధత ఉన్న రచయిత.. నిర్భయంగా, నిరాపేక్షగా వ్రాసుకుంటూ పోతాడు. అవార్డులు.. అతని సుదీర్ఘమైన సాహితీప్రయాణంలో నీటి చెలమల్లాంటివి. మరింత ఉత్సాహంగా ముందుకు సాగడానికి ప్రేరకాలుగా పనికొస్తాయి!"

ఒంగోలు నగరానికి దగ్గరలో ఉన్న త్రోవగుంటలో సలీంగారి జననం, ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది. హైస్కూలు, కాలేజీల విద్యాభ్యాసం ఒంగోలు, కర్నూలు.. ఆ తర్వాత పి.జి. చదవడానికి ముందు, ఓ రెండేళ్ళు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేసి, డబ్బులు దాచి పెట్టుకుని, అప్పుడు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో యం.యస్సి.(టెక్) చేసారు. చివరి సంవత్సరంలో ఉన్నప్పుడే ఇన్కంటాక్స్ డిపార్ట్‌మెంటులో ఇన్స్పెక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. అడిషనల్ కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌టాక్స్‌గా రిటైర్ అయ్యారు. భార్య వెంపటి గీత నాగరాణి, ఇద్దరమ్మాయిలు, ముగ్గురు మనుమలతో విశ్రాంత జీవితం హైదరాబాదులో!

1980లో ఆంధ్రభూమి వారపత్రికలో ప్రచురింపబడిన 'మనీషి' అనే కథ ద్వారా రచనారంగంలోకి అడుగుపెట్టిన సలీంగారివి.. మూడు కవితాసంపుటాలు, పన్నెండు కథాసంపుటాలు విడుదలయ్యాయి. వీరి చాలా కథలు, నవలలు.. ఇంగ్లీషు, హిందీ, మరాఠీ, కన్నడం, ఒరియా భాషలలోకి అనువదించబడ్డాయి. "రాణిగారి కథలు" "సలీం కథలు" టీవీ సీరియల్స్‌గా ప్రసారమయ్యాయి. సలీంగారి "కాలుతున్న పూలతోట" నవలకు 2010 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. ఇది కాకుండా.. మరో ఇరవైకి పైగా అవార్డులు వచ్చాయి. పదకొండు మంది సలీంగారి రచనల మీద పరిశోధనలు చేసారు. ఇలా ఎంత చెప్పుకున్నా తరగని సాహితీసంపదను, గొప్పతనాన్ని కలం ద్వారా సంపాదించిన సయ్యద్ సలీంగారికి, అభ్యర్థించిన వెంటనే స్పందించి, విశిష్ట అతిథిగా ఈ సంచికను అలరించినందుకు, కథామంజరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటూ.. వారి కలం నుండి మరిన్ని ఆణిముత్యాలు వచ్చి, తెలుగు సాహితీరంగానికి మణిహారంగా నిలవాలనీ అభిలషిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. వాకాటి పాండురంగారావు**

సాధారణంగా రచనలు చేసేవారిలో పుస్తకపఠనం అలవాటు ఉంటుంది. సాహిత్యానికి సంబంధించిన విషయాలు లేదా కథలు, నవలలు, వ్యాసాలు వగైరా చదువుతుంటారు. సైన్స్, చరిత్ర, ఇతిహాసం మొదలగు విషయాల మీద కథాంశం వ్రాసేటప్పుడు, విషయాలు తెలుసుకోడానికి ఆయా పుస్తకాలు చదువుతారు. కాని విజ్ఞానం కోసం కొంతమంది రచయితలు కనబడిన పుస్తకాలు అన్నీ చదువుతారు. కేవలం మనోవికాసం కోసమే కాదు, తెలుసుకున్న విజ్ఞానాన్ని పదిమందికి తన రచనల ద్వారా పంచడానికి కూడా పుస్తకపఠనం చేస్తారు. మన తెలుగురచయితలలో.. ఇలా అన్ని విషయాలను అధ్యయనం చేస్తూ, 'నడుస్తున్న విజ్ఞాన ఖని' అని పేరు తెచ్చుకున్న రచయితగా.. 'వాకాటి గారు' అంటే తెలుగువారికి స్ఫురించే ఒకే ఒక విజ్ఞాన, సాహితీవేత్త వాకాటి పాండురంగారావు గారు! తెలుగు, ఇంగ్లీషు, తమిళ భాషల్లో సమానమైన పాండిత్యం కలిగి, భావానికి తగ్గ భాషలో సూటిగా, వాడిగా, ధాటిగా మాటాడగలగడమే కాదు, రాయగల సవ్యసాచి వాకాటి గారు! అగాథాక్రిష్టి గురించి చెప్పినా, ఆదిశంకరుల తత్వభోధన గురించి చెప్పవలసి వచ్చినా తిరుగులేని సాధికారత ఉండేది. ఆయన కథ వ్రాసినా, వ్యాసం వ్రాసినా, సంపాదకీయం వ్రాసినా.. అదో విజ్ఞానవీక్షణమే అవుతుంది. రచయితగా, వ్యక్తిగా, బాధ్యత వహించి, సమాజంలో ప్రతి మనిషికి, ముఖ్యంగా యువతని ప్రభావితం చేసే రచనలు చేసారు. ముఖ్యంగా పత్రికా సంపాదకులుగా ఆయన వ్రాసిన సంపాదకీయాలు.. సువర్ణాక్షరాలుగా నిలిచిపోయాయి. అదే వాడీ వేడి ఆయన కథల్లో, మాటల్లో కూడా కనబడుతుంది.

తెలుగు జర్నలిజానికి గాని, కథకు గాని, వ్యాసానికి గాని చిరునామాగా చెప్పుకోదగ్గ ప్రముఖుల్లో ప్రథమవరుసలో ఉండే వాకాటిగారి కుటుంబ నేపథ్యం కూడా జర్నలిజమే. వీరి తండ్రి కృష్ణమూర్తి గారు.. ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి దగ్గర మేనేజరుగా వుండేవారు. ఆ రోజుల్లో నాగేశ్వరరావు పంతులుగారి దగ్గరకి అందరు వచ్చి, ఆయన ఆర్థికసహాయంతో వారి ప్రెస్‌లోనే పుస్తకాలు ప్రింటు చేయించుకునేవారుట. ఆ రచనల కాపీ ఒకటి కృష్ణమూర్తి గారికి ఇచ్చి వెళ్ళేవారుట. అలా ఆయనింటా పత్రికలు, పుస్తకాలు పుష్కలంగా చేరిపోగా, ఆ పుస్తకాలు మధ్య పెరిగిన పాండురంగారావు గారు, ఆ అక్షరాలకి అతుక్కుపోయారు. నిత్యజీవితంలో కనబడే సంఘటనలని, పేదరికాన్ని, ఆకలిని, అన్యాయాలనీ.. ఆఖరికి దాంపత్యాన్ని, కుటుంబ బంధాల్ని.. ఇలా నిత్యం కనబడే విషయాలని, ఎంతో కవితాత్మకంగా అక్షరాల్లో పొదిగి కథలుగా అందించారు. "నా కథల ద్వారా నన్ను నేను తెలుసుకోడానికి, ఎన్నటికి పూర్తి కాని జీవితం అనే పజిల్లో కొన్ని గడులైనా పూరించడానికి ప్రయత్నం చేసాను. ఓ పిట్ట.. భయం లేకుండా నీ భుజం మీద కూర్చుందంటే.. నువ్వు చెట్టంత వాడివయ్యేవన్నమాట!" అని ఆయన అనేవారుట! ఇది ఎంత మంచిమాటో! ఆయన

కథల్లో ఆయన అద్భుతమైన ఆలోచనాసరళి, భావుకత, నిజాయితీలు కనబడతాయి. అంతే కాదు.. ఆయన రచనలు ఏవి చూసినా శషభిషలు కనపడవు. 'మతాన్ని స్వార్థానికి వాడుకున్నారు. అలాగే సైన్సుని అనుక్షణం దుర్వినియోగం చేస్తూనే ఉన్నారు. ఆ తప్పు అటు మతానిదీ కాదు, ఇటు సైన్సుదీ కాదు, తప్పు మనిషిది!' అంటూ, నాలుగు దశాబ్దాల క్రిందటే ఓ వ్యాసంలో వ్రాసారంటే.. రచయితగా ఆయన నిజాయితీకి, నిర్భయానికి వేరే ఋజువులు, సాక్ష్యాలు అక్కర్లేదు! ఆయన కథల గురించి చెప్పుకుంటే.. శీర్షిక చదవగానే కథలోకి పాఠకుడు అడుగుపెట్టకుండా ఉండలేడు. 'అలీనుడా, అలైన్ డా. 'అబ్రహాం లింకన్,' 'అరిటాకులు,' 'ఆర్. చక్రారావ్', 'ఓంప్రపెట్టిన వార్దెను కథ', 'ఢిల్లీ దర్బార్ః కంస కథ', 'కథావశిష్టుడు', 'పాత కథ'.. మొదలగు ఎన్నో కథలని ఉదాహరణగా చెప్పుకోవచ్చు!

మూడువందలకు పైగా కథలు, నవలలు వ్రాసిన వాకాటి పాండురంగారావుగారు 1934 నవంబరు 15 న మద్రాసులో జన్మించారు. టంగుటూరి ప్రకాశంగారి సంపాదకత్వంలో వచ్చిన 'ప్రజాపత్రిక' విలేఖరిగా ఇరవయ్యొక్క ఏళ్ల వయసులో జర్నలిజం వైపు అడుగుపెట్టారు. అక్కడ ఉప సంపాదకత్వం నుంచి ఆంధ్రప్రభ వారపత్రిక వరకు.. చాలా పత్రికలలో పనిచేసారు. కేంద్రప్రభుత్వంలో వ్యవసాయ సంబంధిత పత్రికలో ఓ పది సంవత్సరాలు, తర్వాత విశాఖపట్నం పోర్టు ట్రస్టు వారి సమాచార ప్రచురణ విభాగాల బాధ్యత వహించిన అధికారిగా మరో పదేళ్ళు, తర్వాతి కాలంలో తిరిగి పత్రికలవైపు వెళ్ళారు. ఢిల్లీలో పనిచేసినప్పుడు.. విశ్వవిఖ్యాత పత్రికాధిపతి, జర్నలిజానికి ఆద్యుడు కీ.శే. ఎం.జి. కామత్ దగ్గర శిష్యరికం చేసారు. మనం మాట్లాడుతున్నట్టే రాసే శైలి జర్నలిజానికి అనువైనదనే ఆయన మాటని స్ఫూర్తిగా తీసుకుని, వందల్లో సంపాదకీయాలు వ్రాసారు. వాటిలో.. ముఖ్యంగా ఆంధ్రప్రభ వారపత్రికలో వచ్చిన సంపాదకీయాలతో "మిత్రవాక్యం" అనే సంకలనం.. చాలా ప్రాచుర్యం పొందింది. అటు జర్నలిజానికి.. ఇటు కథారచనలకి తన జీవితాన్ని అంకితం చేసి, చరితార్థులుగా పేరు తెచ్చుకున్న వాకాటి పాండురంగారావుగారు.. 17 ఏప్రిల్ 1999 తేదిన కన్నుమూసారు. అయితే ఆయన రచనలు చిరంజీవిగా తెలుగునాట వెలుగులో ఉంటాయి! వాకాటివారికి ఘన నివాళి అర్పించుకుంటూ.. స్వస్తి!

**కథామంజరి బృందం**

## మోపాసా కథ "అదంతా కలేనా?"

గై డి మోపాసా (Guy de Maupassant, 1850–1893) కథలగురించి చాలామంది పాఠకులకు చెప్పనక్కరలేదనే అనుకుంటాను. పంతొమ్మిదవ శతాబ్దపు ఫ్రెంచి కథకుడు, నవలాకారుడు, కవి. చిన్న కథలు రాయడంలో ఆయన ఒక మాస్టరు. చిన్న జీవితకాలంలోనే 300 పైచిలుకు కథలు, ఆరు నవలలు, ఒక కవితల సంకలనం, మూడు యాత్రా రచనలు చేశారు. తన సమాధి ఫలకం మీద చివరిమాటగా తనే రాసుకున్నాడు "నేనెంతో ఆకాంక్షించాను, కాని దేని నుంచీ ఆనందం పొందలేదు" అని. ఆయన రాసిన కథలు మానవ జీవితాన్ని చాలా విస్తృతంగాను, చాలా లోతుగాను, అయితే నిరాశా పూరితంగా, ఒక రకంగా చీకటి కోణాన్ని ప్రతిబింబిస్తాయి.

చాలామంది ప్రభావితులై ఆయన కథల్ని తెలుగులోకి అనువాదం చేసారు. 'కథాలేఖిని' అన్న అనువాద కథల పుస్తకంలోని (ఆర్. ఎస్. కృష్ణమూర్తి గారు, ఎస్. ఎస్. మూర్తి గారు) ఒక కథ ఇప్పుడు నేనెంచుకున్న 'అదంతా కలేనా'.

కథంతా ఉత్తమ పురుషలో స్వగతంగా చెప్పబడింది. తను ఆమెను విపరీతంగా ప్రేమించాడు. అసలు మనిషి ఎందుకు ప్రేమిస్తాడు? వ్యక్తిని చూసి ప్రేమించడం, ఆలోచనలన్నీ ఆ వ్యక్తే ఆక్రమించడం, ఇదంతా ఏమిటి? "పెదవి మీద ఎప్పుడూ ఒక్క పేరు... అగాధమైన హృదయపులోతుల్లోంచి, ఆ పేరే నిరంతరం పెదాలపైకి ఊటలాగా సదా ఉబుకుతూ, సమయం, సందర్భం మరచి ఏదో ప్రార్థన చేసుకుంటున్నట్టు ఆ నామాన్నే పదే పదే స్మరిస్తూ, జపించడం!!!" ఇలా మొదలవుతుంది అతను చెప్పే కథ.

తను ఆమెను ఎంతగా ప్రేమించాడో మాటల్లో చెప్పలేని అనుభవం. పగలూ రాత్రీ ఆమె లేక తను లేదు అన్నట్లుగా! అలాంటి ఆమె మరణించింది. ఆ రోజు వర్షంలో తడిసి ముద్దై ఇంటికి వచ్చింది. దగ్గు పట్టుకుని వారం రోజుల తరవాత మంచం పట్టింది. డాక్టర్లు, మందులు ఆ చివరి రోజుల్లో ఏవీ పని చేయలేదు. త్వరలోనే ఆమె చివరి శ్వాస విడిచింది. ఒక ఫాదర్ ఆమె గురించి న్యూనతా భావంతో మాట్లాడాడు. అతనికా హక్కు లేదనిపించింది. ఆమె శవపేటికను మేకులతో కొట్టి మూస్తున్నప్పుడు, ఆమెను గోతిలోకి దించుతున్నప్పుడు ఎంత బాధ వేసింది! ఇంక ఊరు వదిలి వెళ్ళి పోయాడు తను.

పారిస్ నుంచి తిరిగి వచ్చిన తరువాత తన గది, ఆమె వస్తువుల్ని చూసినప్పుడు ఎంత బాధ, ఉద్వేగం కలిగాయో! ఆమె అందాన్ని ఎన్నో సార్లు ప్రతిబింబించిన ఆ అద్దం చూసినప్పుడు ఇప్పుడు అది ఖాళీగా, గంభీరంగా, నిస్తేజంగా కనిపిస్తోంది. 'ఓహ్ ఎంత బాధాకరమైన జ్ఞాపకం! దుఃఖిస్తున్న అద్దం, ప్రేమతో రగిలిపోతున్న అద్దం, దారుణమైన అద్దం, మనుషుల్ని ఎలాంటి బాధలకు గురిచేస్తుంది!'

తనకు తెలియకుండానే ఆమె సమాధివైపు నడిచి వెళ్ళాడు. ఆమె సమాధి ఫలకం మీద రాసిన మాటలు – "ఆమె ప్రేమించింది, ప్రేమించబడింది, మరణించింది."

వెక్కి వెక్కి ఏడ్చాడు తను. ఎంత సేపు అక్కడ గడిపాడో కూడా తెలియలేదు. ఆ రాత్రి, తన చివరి రాత్రి ఎలాగైనా ఆమె సమాధి పక్కనే శోకిస్తూ గడపాలనుకున్నాడు. ఆ మృతనగరిలో సంచారం ప్రారంభించాడు. శ్మశానంలో తనొక్కడే. మెల్లగా నడవడం ప్రారంభించాడు. ఆ చీకట్లో అటూ ఇటూ తిరుగుతూ తిరిగి ఆమె సమాధిని గుర్తించడం కష్టమైపోతోంది. అక్కడా రాళ్లూ, శిలువలూ, ఇనుప కంచెలూ, లోహపు దండలూ, కొత్తగా ఉంచిన పూలమాలలే తగుల్తున్నాయి. ఏమి కాళ రాత్రి అది! గోరీల మధ్య సన్నని ఇరుకు తోవలో నడవడానికి భయంగా ఉంది. ఓ సమాధి మీద చతికిలబడ్డాడు తను!

ఇంతలో బయట ఏదో ఒళ్ళు గగుర్పొడిచే చప్పుడు వినిపించింది. భయంతో శరీరమంతా చెమటలు పట్టాయి. తను కూర్చున్న సమాధి పలకే కదులుతోంది. ఉలిక్కిపడి పక్కకెళ్ళాడు తను. క్రింద నుండి ఎవరో పైకి లేపుతున్నట్టు కనబడింది. చాలా స్పష్టంగా కనబడింది. సమాధి రాయి పైకి లేచి అందులోంచి ఒక అస్థిపంజరం బయటకి వచ్చి సమాధి పలకని మరికొంచెం పక్కకు తోసింది.

ఆ సమాధి స్మృతి ఫలకం మీద ఇలా రాసి ఉంది. “ఇది తన యాభై ఒకటవ ఏట మరణించిన జాక్ ఒలివెంట్ సమాధి. అతను కుటుంబాన్ని అమితంగా ప్రేమించాడు, చాలా కరుణాళువు, గౌరవప్రదమైన వ్యక్తీ, భగవంతుని అనుగ్రహంతో అతనిలో లీనమైనాడు.”

లేచిన ఆ అస్తిపంజరం కూడా అది చదివింది. అయితే పక్కనే ఉన్న ఒక సూది రాయిని తీసుకుని అక్కడి అక్షరాల్ని జాగ్రత్తగా చెరపడం ప్రారంభించింది. చెరిపి, ఏదో కుర్రాళ్ళు గోడల మీద రాసే రాతలా తిరిగి రాసింది.. ఈ విధంగా — “ఇది తన యాభై ఒకటవ ఏట మరణించిన జాక్ ఒలివెంట్ సమాధి. అతను తన వారసత్వపు ఆస్తి అనుభవించడం కోసం నిర్దాక్షిణ్యంగా పరావర్తించి తండ్రి తొందరగా మరణించడానికి కారకుడయ్యాడు! భార్యను చిత్రహింసలు పెట్టి, పిల్లలను హింసించేడు, అతని పొరుగువాళ్ళని మోసం చేసేడు, ఎంతమందిని దోచుకోగలడో అంతమందినీ దోచుకుని, చివరకు నీచమైన చావు చచ్చేడు.”

అది చదువుతూ చలనం లేకుండా ఉండిపోయాడు తను. చుట్టుపక్కల అన్ని సమాధులూ తెరువబడి ఉన్నాయి. ఆయా అస్తిపంజరాలు వాస్తవాన్ని తిరిగి రాయడం చూస్తున్నాడతను. ఆ మసక వెలుగులో తను చదువుతున్నది ఎంతో ఆశ్చర్యాన్ని కలుగజేస్తోంది. గొప్ప తండ్రులూ, విశ్వాసముగల భార్యలూ, భక్తిగల కొడుకులూ, ఇలా చెప్పబడ్డ ఎందరో నిజానికి ద్రోహులూ, కపటులూ, అబద్ధాలకోరులూ, దొంగలూ, ఇలా నీతి బాహ్యమైన పనులు చేసినవారేనా? భయంకరమైన సత్యాలు!

మరి ఆమె సమాధో? పరిగెత్తి వెతుకుతూ ఆమె అస్తిపంజరం గుర్తు పట్టాడు తను.

ఆమె స్మృతి ఫలకంపై ఇప్పుడు ఇలా రాసి ఉంది. “ఆమె తన ప్రియుణ్ణి మోసగించడానికి ఒకరోజు వర్షంలో బయటకు వెళ్ళి, జలుబు పట్టి చనిపోయింది.”

అదీ కథ.

మోపాసా రాసిన ఈ కథలో జీవితం తనని తను చూసుకుంటుంది. బాహ్య ప్రపంచానికి కనిపించే మనుష్యుల ప్రవర్తన నిజమా? మనుషుల్లోనూ, వారి జీవితాల్లోనూ ఎంత హిపోక్రసీ? తెలిసి చేస్తారా? తెలియక చేస్తారా?

అందరం అవతలి వ్యక్తి నుంచి మనకి ఏం కావాలో అది మాత్రమే తీసుకుంటాం. మనం, మనక్కావలసిన మనుషులు, పోయిన తరువాత ప్రపంచం మన గురించి, మన ఆత్మీయుల గురించి అంతా మంచిగానే చెప్పుకోవాలనుకుంటాం. మన ప్రేమల్లో, ఆప్యాయతలలో ఎంత నిజం ఉంది? ఎంత స్వార్ధముంది?

ఈ చిన్నకథలో కూడా సముద్రమంత నిజాన్ని చెప్పగలిగే సామర్థ్యం కనిపిస్తుంది. పాత్ర తన ప్రేమను గురించి చెప్తున్నప్పుడు పాఠకుడు తనే అనుభవిస్తున్నట్లుగా భావించేలా చేస్తుంది కథ. పాత్ర తను స్మశానంలో చూస్తున్న వాతావరణాన్ని గురించి చెప్తున్నప్పుడు, పాఠకుడు కూడా అక్కడే నిలబడి పాత్రలో నిమగ్నమైపోగలడు. జీవితపు చేదు నిజాలను చెప్పడానికి మొపాసా ఎంచుకున్న అధివాస్తవికత ఎబ్బెట్టుగా అనిపించదు. అస్తిపంజరాలు శవపేటికలలోంచి బయటకు వచ్చి స్మృతి ఫలకాలపై తిరిగి రాయడం, అదీ, ఏదో స్టూడెంటు రాయితో గోడమీద రాసే రాతల్లాగా అట!

ఈ కథ చదివినప్పుడు మాయాబజార్ సినిమాలో చూపించిన ఒక అందంగా అలంకరించబడ్డ ముక్కాలి పీట గుర్తొచ్చింది. దాని మీద నుంచుని ఉంటే అందరూ తమ మనసులలో జరిగే యదార్థ ఆలోచనలని చెప్పగలుగుతారు. అదే కదా బలరాముడికి కనువిప్పు కలిగించింది, శకుని చెప్పిన నిజం ద్వారా? సినిమాలో ఆ సీను కేవలం ప్రేక్షకుల ఆహ్లాదం కోసమైనా, చెప్పకుండానే చెప్పే నిజముంది.

మొపాసా లాంటి కథకులు అరుదు. తన జీవితాన్ని నిరాశలోనే గడిపినా ప్రపంచానికి తను అందిచ్చిన సాహిత్యం విలువ కట్టలేనిది. బహుసా ఆయనకు అది తెలియకపోవడం వల్ల మంచి కథలు వచ్చాయా ఆయన కలం నుండి? జీవితం విచిత్రమైంది.

**శాయి రాచకొండ, యు.ఎస్.ఏ.**

**సవరణ**

*గత ఫిబ్రవరి 2025 సంచిక, కథాపరిచయ శీర్షికలో 'డా. ఎం.వి. రమణారెడ్డి' కి బదులు 'డా. కె.వి. రమణారెడ్డి' అని..మొదటి పేరాలో 'ఎంవిఆర్' కీ బదులు 'ఎవిఆర్' అని పొరపాటుగా ముద్రించబడ్డాయి.*

*అలాగే.. మార్చి 2025 సంచికలో విశిష్ట అతిథిగా "డా. జె. భాగ్యలక్ష్మి" గారి ఫోటో, వారిది బదులు మరొకరి ఫోటో ముద్రణలో వచ్చింది. ఇది కూడ చాలా పెద్ద పొరపాటే! కొంతవరకు అంతర్జాల మహిమ అని అనుకున్నా.. సరైన సమాచారం మా దగ్గర కూడా లోపించడం కూడా తప్పే!*

*ఈ పొరపాటులకు కూడా చింతిస్తున్నాం.*

*ఈ తప్పిదాలను సంచిక విడుదలైన మరుక్షణమే మాకు తెలియచేసిన మా పాఠకమహాశయులకు అనేక ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాం!*

**సంపాదకుడు**

# వినదగునెవ్వరు చెప్పిన..

ఒక సూచన చేయదలిచాను!

తెలుగులో, ఇంగ్లీష్‌లో ఒకప్పుడు ఉపయోగించిన పదాలను, అవి అభ్యంతరకరంగా, అవమానకరంగా ఉన్నాయని, ఇంకా అనేక కారణాలతో వాటిని ఆ తర్వాతి కాలంలో సవరించిన దాఖలాలు చాలా ఉన్నాయి. ఉదా.. ఒకప్పుడు వికలాంగులు అనే వారు. తర్వాత దానిని దివ్యాంగులు అని సవరించారు. ఇంగ్లీష్‌లో Physically Handy capped పదాన్ని physically challenged అని మార్చారు. 'మేడమ్' పదం 'మామ్' అయ్యింది. ఇలా ఎన్నో! రాజ్యాంగంలోనే ఎన్నో సవరణలు. ఇంతకీ ఈ ఉపోద్ఘాతం ఎందుకంటే...

"…. కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపిక అయిన కథ" అనే వాక్యం ఎంత అవునన్నా, కాదన్నా కథను, రచయితను కొంత చిన్నబుచ్చినట్టే అవుతుంది. దాని బదులు "…. కథల పోటీలో ఎంపిక అయిన కథ" అని ప్రచురిస్తే, నొప్పించక తానొవ్వక అన్నట్టు ఉంటుంది కదా. దయచేసి పరిశీలించండి.

**డా. ఎం. కోటేశ్వర రావు**

**మంచి సూచన. అమలుచేస్తాం – సంపాదకుడు**

నేటి మహిళ … కథ చదివాక ఆ కథ గురించి నా అభిప్రాయాన్ని మీతో పంచుకోవడం ఒక మహిళగా నా బాధ్యత అనిపించింది. మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఈ కథలో కథానాయిక ప్రవర్తన ఉంది. సమాజంలో నేడు ఇటువంటి మహిళలు కనిపిస్తూనే ఉన్నారు. సాంఘిక మాధ్యమాలలో అటువంటి వారి గురించి చదువుతున్నాం, వింటున్నాం. వారి విపరీత పోకడలకు, స్వార్థబుద్ధికి అసహ్యించుకుంటున్నాం.

ప్రస్తుతం కథకు వస్తే, ఇందులో కథానాయిక, ఏ రకమైన పశ్చాత్తాపభావం లేకుండా, తన స్వార్థం కోసం ఇంకొకరి జీవితంతో ఆడుకొని… ఆ కుటుంబానికి మానసిక క్షోభను, ఆర్థిక నష్టాన్ని కలిగించి… చివరకు తనకలాగే జరిగితే… ప్రేమించిన వాడికోసం చెయ్యరాని తప్పుకు సాహసించానని చెప్పడం ద్వారా… మరియు నేటి మహిళ తన హక్కులను కాపాడుకోవడంలో దిట్ట అని చెప్పడం ద్వారా రచయిత ఏమి చెప్పాలని ప్రయత్నించారో నాకర్థం కాలేదు.

ఇంకొకరి జీవితంతో తాను ఆడుకున్నప్పుడు, అవతలివారికి హక్కులు వర్తించవా? అన్యాయంగా అతనిని కేసులో ఇరికించినప్పుడు ఒక మనిషిగా కనీస బాధ్యతలు గుర్తు రాలేదా? ఈ కథ ద్వారా రచయిత నేటి సమాజానికి ఏ సందేశాన్ని ఇవ్వాలనుకున్నారో నాకర్థం కాలేదు. అర్థం చేసుకోలేని నా అజ్ఞానానికి మన్నించాలి.

ఇటువంటి కథలను ప్రచురించడం ద్వారా కథామంజరి వారు కూడా చదువరులకు తప్పుడు సంకేతాన్ని ఇచ్చినట్టు అవుతుందని నా అభిప్రాయం. నా అభిప్రాయం తప్పయితే మన్నించాలి.

మిగిలిన కథలన్నీ చక్కని సందేశంతో వేటికవే అన్నట్లున్నాయి. రచయిత /రచయిత్రులకు అభినందనలు.

భవదీయ

**డా. మజ్జి భారతి**

# సాక్షి

**డా. ఎం. సుగుణరావు**

✆ 9704677930

*‘ఆ యోగా కేంద్రంలో గురువు మంచి మాటలే చెప్పి ఉండవచ్చు, తన దృష్టికోణం మారిందేమో... కాని తనను మార్చింది మాత్రం ఒక మహాతల్లి! తనలోని మనస్సాక్షిని గుర్తు చేసింది. అది ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. తనలా తప్పు చేసినవారు తప్పించుకోకుండా ఉండడానికి...’*

ధారావి!

ప్రపంచంలోని అతిపెద్ద మురికివాడ. బొంబాయి నగరంలోని రెండు సబర్బన్ రైల్వేలైన్ల మధ్యన విమానాశ్రయానికి ఆనుకునే ఉంది. కిక్కిరిసిన జనంతో, రెండున్నర చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. పదిలక్షల మందికి పైగా జనాభా ఉన్న ప్రాంతం. వలసలు ఎక్కువై, కాందిశీకులకు నిలయంగా మారింది. అక్కడ ప్రతీ సంవత్సరం ఒక బిలియన్ యు.ఎస్. డాలర్ల వ్యాపారం జరుగుతోందంటారు.

రాత్రి పన్నెండు దాటింది. ధారావికి వెళ్ళే ఆ సన్నని రోడ్డు పక్కనున్న డ్రైనేజీ కాలువదగ్గర పడి ఉన్నాడు విరాట్. కురుస్తున్న మంచుతో చలికి శరీరం కొంకర్లు తిరుగుతోంది.

సరిగ్గా పావుగంట క్రితం ఆ ప్రాంతానికి వచ్చి, ఫోటో తీసుకుంటున్నాడు విరాట్. హఠాత్తుగా ఇద్దరు ఆగంతకులు అతనిపై విరుచుకుపడ్డారు. వెనుకనుంచి వచ్చి కొట్టి, అతని సెల్‌ఫోను, చేతికున్న వాచీ, బంగారం బ్రాస్‌లెట్, ఇంకా జేబులోని పర్సు తీసుకెళ్ళిపోయారు. విరాట్‌కి చాలాసేపు ఏం జరుగుతోందో అర్థం కాలేదు. తల దిమ్ముగా అనిపించింది. పక్కన డ్రైనేజీలోంచి వచ్చే మురికివాసనతో ముక్కు బద్దలౌతోంది. తనకు ఆనుకునే పిల్లల్ని పెట్టిన కుక్క మూలుగు వినిపిస్తోంది. ఆ నిశ్శబ్దవాతావరణంలో అక్కడక్కడా గట్టిగా ఎవరో హిందీలో తిట్టుకుంటున్న మాటలు వినిపిస్తున్నాయి. ఏం జరిగిందో గుర్తుతెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. సరిగ్గా మూడుగంటల క్రితం జరిగిన విషయం కళ్ళముందు ప్రత్యక్షమైంది.

★★★

ఆ హాల్లో దాదాపు వందమంది కార్పెట్ వేసిన నేలమీద కూర్చున్నారు. చిన్న వేదికలాంటి ప్రదేశంలో, ఒక కుర్చీలో తెల్లటి బట్టల్లో, ఇంకా మరింత తెల్లగా ఉన్న గడ్డంతో ఋషిలా ఉన్న ఒక అరవైఏళ్ల పెద్దాయన... “మీరంతా ఈ పదిహేనురోజులుగా ఈ ‘నిత్యసమాధి యోగా’ కేంద్రంలో శిక్షణ పొందారు. ఇక ఆఖరి అంశంగా మిమ్మల్ని బయటకు పంపుతున్నాం. ఈ

పది హేనురోజులూ మీ కాలాన్ని మేం తీసుకున్నాం. మీకెవరికీ టైము ఎంతైందో తెలియదు. రాత్రి, పగలూ తేడా లేకుండా శిక్షణ పొందారు. మీ జేబులోని పర్సు, సెల్‌ఫోన్, వాచీలను మా దగ్గర సురక్షితంగా ఉంచాం. ఇప్పుడు మిమ్మల్ని బయటకు పంపుతున్నాం. ఇప్పుడు తొమ్మిది గంటలైంది. ఇప్పుడు కూడా ఈ పది హేనురోజులూ మీరెలా ఉన్నారో అలాగే బయటకు వెళ్ళాలి.’’




‘‘అంటే... మా సెల్‌ఫోను, పర్సు, వాచీ ఇవేవీ లేకుండానే బయటకు వెళ్లాలా? వెళ్ళి ఏం చేయాలి గురూజీ?’’ అని అన్నాడు ఒక సభ్యుడు లేచి నిలబడి.

ఆ మాటలకు ఆయన చిన్నగా నవ్వి ‘‘ఈ పది హేనురోజులూ అవి లేకుండా మీరు గడిపారు. మీదగ్గర పర్సు, చరవాణీ, వాచీ లేకుండానే ఇరవైనాలుగు గంటలసేపు మీరు ఈ ముంబాయ్ మహా నగరంలో బతకాలి. మీకున్న పలుకుబడి

ఉపయోగించకూడదు. మీ బంధువులను, స్నేహితులను అడిగి డబ్బు తెచ్చుకోకూడదు. ఏమీ లేకుండానే మీరు ఈ ఇరవైనాలుగు గంటలు గడపాలి. అప్పుడే అసలైన జీవితం అంటే ఏమిటో మీకు తెలుస్తుంది.''

''మీకెలా తెలుస్తుంది? మా పలుకుబడి ఉపయోగించకుండా బతికామని?'' అన్నాడు ఆ సభ్యుడే.

ఆ మాటలకు గురూజీ వెంటనే చెప్పాడు, ఆ గదిలోని సభ్యుల వంక పరిశీలనగా చూసి, ''మనల్ని ఎవరూ చూడడం లేదని, గమనించడం లేదని చాలా తప్పులు చేస్తాం. కానీ ఎవరూ చూడకపోయినా, మనల్ని నిరంతరం సిసి కెమేరాల్లా వీక్షించే సాక్షులు పద్దెనిమిది మంది ఉన్నారు'' అన్నాడాయన.

''ఎవరు సార్ వాళ్ళు?'' అనడిగాడు ఒక సభ్యుడు.

''నాలుగు వేదాలు, పంచభూతాలు, ధర్మం, యముడు, ఉదయ సంధ్య, సాయం సంధ్య, పగలు, రాత్రి, సూర్యుడు, చంద్రుడు. ఎన్ని అయినాయి?'' అన్నాడాయన, ఆ గదిలోని సమూహం కేసి దృష్టిసారించి.

''పదిహేడు గురూజీ'' అన్నాడు ఒక సభ్యుడు.

''అయితే ఇంకో సాక్షి మనలోనే ఉంటుంది. ఆ సాక్షి గురించి మనకు తెలియదు. అదేమిటో తెలుసా?''

గురూజీ ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేదు.

''ఆ సాక్షి పేరే మనసు. అంటే మనస్సాక్షి.''

ఆయన అలా చెప్పగానే, అందరూ గురూజీకి రెండు చేతులూ జోడించారు.

''అయ్యో! కష్టం సార్'' అన్నాడు దిగులుగా ఒక పాతికేళ్ళ కుర్రాడు లేచి నిలబడ్డాడు.

''విరాట్ ఇది మీకు ఇష్టమైతేనే! బలవంతం లేదు. ఇది ఆఖరి పరీక్ష. ఈ పరీక్షలో గెలుపొందితే మీరు జీవితంలో దేనికీ భయపడరు. ఇలా ఖాళీజేబులతో, సెల్‌ఫోన్ లేకుండా బయటకు వెళ్ళలేనివారు, వారి సామాన్లు తీసుకోవచ్చు. అందుకు మాకు అభ్యంతరం లేదు.'' అన్నాడు గురూజీ.

ఆ హాల్లో విరాట్ తప్ప ఎవరూ నుంచోలేదు. మిగతావారంతా ముక్తకంఠంతో "మీరు చెప్పినట్టే చేస్తాం గురూజీ" అన్నారు.

విరాట్ మాత్రం తన సెల్‌ఫోను, పర్సు, వాచీ, బ్రాస్‌లెట్‌లను తీసుకుని, ఆ యోగాకేంద్రం నుంచి బయటపడ్డాడు. 'ఏమీ లేకుండా ఎలా బతుకుతాను? ఈ పదిహేనురోజులూ నరకయాతన అనుభవించాను. నాన్న బలవంతం మీదే ఈ శిక్షణాకేంద్రంలో చేరాను. ఇక చాలు.' అనుకుంటూ బయటకొచ్చి, హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు.

ముంబాయ్ నగరం దేదీప్యమానంగా వెలుగుతోంది. కిక్కిరిసిన వాహనాల మధ్య నగరం సందడిగా కనిపిస్తోంది. 'శుభ్రంగా ఏదో ఒక ఐదు నక్షత్రాల హోటల్‌కో వెళ్ళి, హాయిగా భోంచేయాలి. దానికంటే ముందే ఈ పదిహేనురోజులుగా తనకు అందుబాటులో లేని ఆ ద్రవపదార్థాన్ని గొంతులో పోసుకోవాలి. మత్తుగా, గమ్మత్తుగా ఈ నగరమంతా తిరగాలి' అలా అనుకుంటూ, తమ యోగాకేంద్రానికి దగ్గరలో ఉన్న ధారావికి చేరుకున్నాడు విరాట్. ధారావి చూద్దామని!

ధారావి గురించి సినిమాల్లో చూడటము, పేపర్లలో చదవటం, ఎవరో చెప్పగా వినటమే జరిగింది. వరుసగా అగ్గిపెట్టెలు పేర్చినట్టుగా ఇళ్ళు! ముందుకు నడిచాడు. గుప్పుమంటూ మురికి వాసన. అక్కడున్న ఇళ్ళల్లోంచి మిణుకుమిణుకుమంటూ వెలుగుతున్న లైట్లు మాత్రమే ఉన్నాయి. ఆ చీకట్లో ఇంకొంచెం దూరం నడిచేసరికి, తనమీద ఎవరో టార్చ్‌లైట్ వేసినట్టు అనిపించింది. క్షణంలో తన మీద ఇద్దరువ్యక్తులు పడ్డారు. తన నోరుమూసి, గబగబా తన జేబులోని పర్సుతోపాటు సెల్‌ఫోన్, వాచీ, బ్రాస్‌లెట్ లాక్కున్నారు. తనను కిందకు తోసి అక్కడి నుండి పరుగెత్తారు. ఏం జరుగుతోందో ఆలోచించే క్షణంలోనే తనమీద దాడి జరిగిపోయింది.

★★★

నిస్తేజంగా పడుకున్న విరాట్ మనసులోని దుఃఖం కన్నీళ్ళ రూపంలో బయటకొస్తోంది.

విధిరాతంటే ఇదేనేమో... ఆ యోగా కేంద్రంలో వాచీ, సెల్‌ఫోన్, బ్రాస్‌లెట్, పర్సు ఉంచకుండా వాటిని తనతో తీసుకొచ్చి పెద్దతప్పే చేశాడు. అన్నీ పోగొట్టుకొని నిస్సహాయంగా మిగిలాడు. ఒళ్ళునొప్పులతో పాటు, నరాలు కొరికే చలి. ఆకలిబాధ. పేగులు లుంగ చుట్టుకుపోతున్నాయి. ఎవరో ఆ దారి వెంబడి వెళుతూ, ''తాగి పడిపోయినట్టున్నాడు వెధవ! ఇక్కడ ఇది మామూలే...'' హిందీలో గొణుక్కుంటూ వెళ్ళిపోయారు.

'అయ్యో నేను తాగి పడిపోలేదు.' గుండెలోని మాట గొంతు దాటి రాలేదు ఓపిక లేక.

అంతలో ఎవరో తనవైపు వస్తున్న అడుగుల చప్పుడు.

''ఎవరూ?'' అంటూ ఒకామె తన సెల్‌ఫోన్ లైటును విరాట్ మొహం మీద వేసి చూసింది.

''ప్లీజ్ హెల్ప్ అమ్మా'' అన్నాడు.

ఆవిడ చెయ్యి పట్టుకుని లేపింది. ''ఉఠో బేటా!'' అంటూ తన భుజాన్ని సాయంగా అందించింది.

లేచి నిలబడ్డాడు విరాట్. శరీరం సహకరించటం లేదు. ఎక్కువసేపు అలా రోడ్డుమీద ఉండిపోవడంతో ఒళ్ళంతా తిమ్మిరిగా అనిపించింది.

''ఏమైంది?'' అంది ఆమె కళ్ళల్లోకి చూసి.

''దాహంగా ఉంది. మంచినీళ్ళు కావాలి'' అన్నాడు, తెలుగులో.

''ఓహో... మీది ఆంధ్రానా? మా ఇంటికి వెళదాం'' అంటూ అతన్ని నడిపించుకుంటూ రెండడుగులు వేసింది.

అగ్గిపెట్టెల్లా ఉన్న ఆ ఇళ్ళ సముదాయంలోని ఒక ఇంటి తలుపు తాళంతో తీసింది. లోపలకు అడుగుపెట్టాడు. గదిలో లేటు వేయగానే, ఆమెవంక పరిశీలనగా చూశాడు. మధ్య వయస్కురాలు. తన తల్లి వయసుంటుందేమో. చుడీదార్, పైజామా, మెళ్ళో దుపట్టా, అక్కడక్కడా మెరిసిన జుట్టు ఉంది.

ఆ గదిలో బొంత పరిచి ''పడుకో'' అంటూ లోపలికి వెళ్ళింది.

ఐదు నిముషాల తర్వాత బయటకొచ్చిన ఆమె, ''ఏమైంది అక్కడ పడిపోయారు?'' అంది.

''నన్ను కొట్టి నా దగ్గరున్నవన్నీ ఎవరో లాక్కుపోయారు ఎవరో దుండగులు'' అంటూ ఆగిపోయాడు.

''అయ్యో ఎవరు ఆ దుర్మార్గులు? అంతపని చేశారా?'' అంది.

ఆ మాటలకు మౌనం వహించాడు.

''అమ్మా ఆకలేస్తుంది, ఏమైనా తినడానికి ఉందా?'' అనడిగాడు.

''అయ్యో బిడ్డా, మిమ్మల్ని చూస్తుంటే మంచి ఖాన్‌దాన్ నుంచి వచ్చిన డబ్బు గల ఆసామి కొడుకులా ఉన్నారు. మా ఇండ్లలో తింటారా అనే అనుమానంగా ఉంది.'' అంటూ లోపలికి వెళ్ళింది.

వంటగదిలోంచి పావుగంట తర్వాత బయటకొచ్చింది. ప్లేటులో రెండు చపాతీలు, గిన్నెలో కూర తీసుకొచ్చింది.

''మా అబ్బాయిలు ఇంకా రాలేదు. ఇద్దరూ డ్యూటీకెళ్ళారు. వారికోసం బయటకొచ్చి చూస్తుంటే, మీరు పడిపోయి కనిపించారు. ఇవి గంట క్రితం చేసినవి. వేడి చేసి పట్టుకొచ్చాను. ఇవి తిని ఈ టాబ్లెట్ వేసుకోబాబు. ఒళ్ళు వేడిగా ఉన్నట్టుంది. జ్వరమొచ్చిందేమో...'' అంది.

వాటిని చూడగానే అతనికి ఆనందం కలిగింది. ఆకలికి తట్టుకోలేక చనిపోతానేమో అనుకున్నాడు. ఆకలితో ఉన్నాడేమో ఆ రొట్టెలు, వేడి బంగాళదుంప కూర చాలా రుచికరంగా అనిపించాయి.

ఆమెచ్చిన టాబ్లెట్ వేసుకున్నాడు.

''పడుకోండి. మాది హైదరాబాద్. కొడుకులకి కొలువు దొరికిందని ముంబాయ్ వచ్చినాం. పొద్దున్నకల్లా నొప్పులు తగ్గిపోతాయి. ఈ రగ్గు కప్పుకో'' ఆ గదిలోని లైటు ఆర్పి, తలుపు దగ్గరకు వేసి పక్క గదిలోకి వెళ్ళిందామె.

ఎప్పుడూ తనకు అంత తొందరగా నిద్రపట్టదు. సెల్‌ఫోన్ చూస్తూ ఎప్పటికో నిద్రలోకి జారుకుంటాడు. కాని ఇప్పుడు పడుకున్న ఐదు నిముషాల్లోనే నిద్ర పట్టేసింది. కారణం ఆ ఆమెచ్చిన మందుల ప్రభావం కాబోలు.

★★★

మెలకువ వచ్చేసరికి లోపలి గదిలోంచి ఏవేవో మాటలు. మధ్య మధ్యలో ఒకామె ఏడుపు కూడా వినిపిస్తోంది.

''ఒరేయ్ తప్పు చేస్తున్నారురా... మనం పోగొట్టుకున్నది చాలదా? ఎంతకు తెగించారు? ఒక అమాయకుడిని దారికాసి కొట్టి, దొంగతనం చేశారు. పైగా దొరికాయని అబద్ధాలు చెపుతారా? అదృష్టవశాత్తూ అతను నాకంట పడ్డాడు.'' అంటూ ఆమె గట్టిగా అరుస్తోంది.

'ఆమె తనను కాపాడిన స్త్రీమూర్తి' అనుకున్నాడు విరాట్.

''ఏంటి 'మా' అన్యాయం? మా బాపుని ఎవరో కారువాడు గుద్దేసి వెళ్ళిపోయాడు. చనిపోయినా రోడ్డు మీద వదిలేశాడు. బాపుకి కోర్టువారు నష్టపరిహారం ఇస్తారు కాని, ఆయన్ని తేగలరా?'' అంటూ ఇంకో గొంతుక వినిపించింది.

''ఛస్... నోరు మూయండి... తప్పుడు పనులు, తప్పుడు మాటలు. ఇలా చేస్తే పోలీసులు పట్టుకుపోతారు. మీ బతుకు జైలుపాలే. భర్త లేదు, ఇప్పుడు మీరుకూడా లేకుండా పోతారా! అప్పుడు నేను ఏ నుయ్యో చూసుకుంటాను'' అంది ఏడుస్తూ.

''ఎవరూ మమ్మల్ని గమనించలేదు. అతను మమ్మల్ని గుర్తు పట్టలేదు.''

''అయ్యో! ఎవరూ ఎందుకు చూడరు? ఎవరూ చూడకపోయినా మనల్ని ఎల్లప్పుడూ గమనించే సాక్షి ఒకరుంటారు'' చెప్పిందామె.

''సాక్షి ఎవరు?'' ఇంకో గొంతు వినిపించింది.

''మనస్సాక్షి. దాన్నినుంచి ఎవరూ తప్పించుకోలేరు. నా మాట విని దొంగసొమ్మును ఎవరి దగ్గరనుంచి ఎత్తుకొచ్చారో, ఆయనకే ఇచ్చేయండి.''

''ఆయన ఎక్కడుంటాడో తెలీదమ్మా!'' అంది మరోగొంతు.

''మనింట్లోనే ఉన్నాడు. చూడలేదా మీరు?''

''ఎవరో బంధువనుకున్నాం.''

మాటలు ఆగిపోయాయి.

విరాట్ గుండెలో దడ మొదలైంది. వాస్తవానికి తన దగ్గర విలువైన వాటిని దొంగిలించినవారికి ఆ దడ ఉండాలి. తనెందుకు టెన్షన్ పడుతున్నట్టు? కళ్ళుమూసుకుని అటు తిరిగి పడుకున్నాడు. నిద్ర పట్టేసింది.

''సార్... సార్...'' అనే కేకకు కళ్ళు తెరిచాడు.

ఎదురుగా ఇద్దరు కుర్రవాళ్ళు. లేత ముఖాలు. ఇద్దరిదీ ఇరవై, ఇరవై రెండేళ్ళ వయసు ఉంటుందేమో.

''బాయ్‌జాన్ మాఫ్‌కీజియే'' అంటూ ఇద్దరూ కాళ్ళమీద పడ్డారు.

''మాఫ్‌కీజియే దోనోంఖో'' అంటూ వారి తల్లి కూడా చేతులు జోడిరచి నిలబడిరది.

తన దగ్గర నుంచి లాక్కున్న వాచీ, పర్సు, బ్రాస్‌లెట్, సెల్‌ఫోను తన దగ్గర పెట్టారు.

''అయ్యో! మీ నాన్నగారు చనిపోయారా... ఎలా?'' అన్నాడు విరాట్ వాళ్ళవైపు చూసి.

ఆవిడ చెప్పడం మొదలెట్టింది.

''వీరి తండ్రిగారికి అత్తరు, సెంట్లు అమ్మే చిన్న వ్యాపారం ఉండేది. హైదరాబాద్ పాతబస్తీలో అవి చవగ్గా దొరుకుతాయని ఆరునెలలకు ఒకసారి అక్కడికి వెళతాడు. పని ముగించుకుని ఒక శుక్రవారం ఉదయం పూట పురానాపూల్ దగ్గర నమాజుకు పోతున్నాడు. ఎవరిదో గుర్తుతెలియని వాహనం గుద్దేసి వెళ్ళిపోయింది. ఉదయం పూట ఎవరూ ఆయన్ని చూడలేదు. టైముకి ఆసుపత్రికి తీసుకెళితే బతికేవాడేమో! గుద్దేసిన మనిషి పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. ట్రాఫిక్

కానిస్టేబుల్ చూసి, అంబులెన్స్ పిలిపించేసరికి చనిపోయాడు.'' ఆమె కళ్ళల్లో నీరు నిలుస్తుండగా చెప్పడం ముగించింది.

విరాట్ ఒక్క నిమిషం ఆలోచనల్లో పడ్డాడు.

వెంటనే అన్నాడు ''ఆయన గట్టిగా కేకలు వేస్తే, ఆ గుద్దేసిన మనిషికి వినబడేదేమో... ఆ కేకలకు చుట్టుపక్కలవారు కూడా వచ్చి అతన్ని రక్షించేవారేమో...'' అన్నాడు.

ఆ మాటలకు ఆవిడ కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. ఏడవడం ప్రారంభించింది.

''అయ్యో ఏడవకండమ్మా...'' అన్నాడు విరాట్.

వెంటనే ఆమె కళ్ళు తుడుచుకుని ''ఆయన మాటలాడలేడు బాబూ...'' అంది.

విరాట్ ఆమెవంక ప్రశ్నార్థకంగా చూశాడు.

''మూగవాడు. కాని అల్లా ఇచ్చిన తెలివితేటలతో చిన్న వ్యాపారం చేసుకుంటూ మా కుటుంబాన్ని పోషించేవాడు. ఇప్పుడు నా బిడ్డలకు, నాకు ఆధారం లేకుండా పోయింది.''

ఆమె ఆ మాటలు పూర్తి చేయగానే విరాట్ మెదడు స్తబ్దుగా అయిపోయింది. కాసేపు మౌనంగా ఉండిపోయాడు.

''అయ్యో చాలా అన్యాయం. కుటుంబ యజమానిని కోల్పోవడం బాధాకరం.'' అంటూ వాటిని తీసుకుని జేబులో పెట్టుకున్నాడు.

''పడుకోండి బాబూ... ఇంకా తెల్లవారలేదు.'' అంటూ ఆమె తన కొడుకులను తీసుకుని ఇంటి లోపలకు వెళ్ళిపోయింది.

ఆ తర్వాత విరాట్‌కి నిద్ర పట్టలేదు. ఆ గది కిటికీలోంచి లోపలకు వెలుగు పరుచునేవరకూ ఆలోచనలతోనే గడిపాడు.

ఇంకా ఆ ఇంట్లోవాళ్ళు నిద్రలేచినట్టుగా అనిపించలేదు. ఇంటి గది తలుపు గడియ పెట్టి ఉంది. తన పడుకున్న బొంత మీదనుంచి లేచి, తన చేతికున్న బ్రాస్‌లెట్, వాచీ, తన పడుకున్న పరుపు కింద ఉంచి, వేగంగా ఆ ఇంటి నుంచి బయటపడ్డాడు. బయటకొచ్చేముందు ఆ గదిలో గోడమీద చనిపోయిన ఆ ఇంటి యజమాని ఫోటో క్షణం సేపు చూశాడు.

★★★

వారం రోజుల తర్వాత...

ఆ రోజు ఉదయం ఆలస్యంగా లేచిన విరాట్, ఇంట్లోంచి బయటకొచ్చి ఇంటిముందున్న లాన్‌లో నిలబడ్డాడు. అప్పటికి ఉదయం ఎనిమిది దాటింది. లాన్‌లో కూర్చున్న తల్లి, తండ్రి కాఫీ తాగుతూ కనిపించారు. అంతలో వారి కారు డ్రైవర్, ''సార్! మీ పుట్టినరోజున ఫామ్‌హౌస్‌కు వేసుకెళ్ళిన ఆ కొత్త కారు చక్రాలకు ఎర్రగా రక్తం పూసినట్టుగా ఉంది. ఏమైంది?'' అన్నాడు.

ఆ మాటలకు విరాట్ గుండెలు ఒక్కసారి అమిత వేగంతో కొట్టుకున్నట్టనిపించాయి.

''రక్తం ఏమిటి?'' అన్నారు అమ్మానాన్న ఆందోళనగా అతని వైపు చూసి.

''నేను వెళుతుంటే, ఒక దుర్ఘటన జరిగింది.'' అన్నాడు విరాట్

''ఏమైంది'' అన్నారు విరాట్ తల్లి తండ్రి కంగారుగా.

''ఆరోజు ఉదయం పూట కొంచెం వేగంగానే వెళుతున్నాను. రోడ్డుపక్కన ఓ మూగజీవి వెళుతోంది. ఉదయం పూట మంచువల్ల నాకు సరిగా కనబడలేదు. వేగంగా వెళ్లడంతో ఆ మూగజీవిని గుద్దేశాను. ఆ జీవి నుండి ఏ స్పందనా రాకపోవడంతో నాకసలు తెలియలేదు.''

ఆ మాటలు చెబుతున్న విరాట్ గుండె వేగంగా కొట్టుకుంది. తను నిజం దాచాడా? అబద్ధం చెప్పాడా? రెండూ ఒకటే కదా!

ఆ మాటలు విన్న అతని తల్లి, తండ్రి అతని చేయి వంక చూసి ''నీ వాచీ, బ్రాస్‌లెట్ ఏమయ్యాయి?'' అన్నారు.

''పోయాయి.'' తలొంచుకుని చెప్పాడు.

అతని మాటలకు తండ్రి ఆశ్చర్యపోతూ ''అంత తేలిగ్గా చెబుతున్నావ్... ఆ వాటి ఖరీదెంతో తెలుసా నీకు?'' అన్నాడు.

''తెలుసు... అవి దొరికిన వారి జీవితం సెటిలైపోతుంది'' అన్నాడు క్లుప్తంగా.

''నీ మాటలు కొత్తగా ఉన్నాయి. నీలో కొత్తమనిషిని చూస్తున్నాం. ముంబాయ్ వెళ్ళి ఆ యోగా కేంద్రంలో చేరిన తర్వాత నువ్వు బాగా మారిపోయావ్'' అంది తల్లి.

'ఆ యోగా కేంద్రంలో గురువు మంచిమాటలే చెప్పి ఉండవచ్చు, తన దృష్టికోణం మారిందేమో. కాని తనను మార్చింది మాత్రం ఒక మహాతల్లి! తనలోని మనస్సాక్షిని గుర్తు చేసింది. అది ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. తనలా తప్పు చేసినవారు తప్పించుకోకుండా ఉండడానికి...'

అలా మనసులో అనుకుంటున్న విరాట్‌కి ముంబాయ్‌లో తనకు ఆశ్రయం ఇచ్చిన ఆ కుటుంబ యజమాని ఇంట్లో గోడమీది ఉన్న ఫోటో గుర్తొచ్చి అతని కళ్ళు తడిశాయి.

'ఈ కథ ఇంతటితో ముగుస్తుందా'

ఏదో అపరాధ భావన ఇంకా వెంటాడుతూనే ఉంది విరాట్‌కి.

ఆ రాత్రి నిద్రపట్టలేదు. మంచం మీద అటూ ఇటూ దొర్లాడు. తెల్లవారుఝుము వరకూ ఆలోచనలతో గడిపి, నిద్ర లేచేసరికి ఉదయం ఎనిమిది గంటలైంది. తన గది పక్కన ఏవో మాటలు వినబడటంతో కిటికీలోంచి చూశాడు.

లాన్ దగ్గర తండ్రిగారు, యూనిఫాంలో ఉన్న ఎవరో పోలీస్ అధికారి కనిపించారు. వారితో పాటు తమ కారు డ్రైవర్. విరాట్ గుండెలు దడదడలాడాయి.

గబగబా బయటకొచ్చేసరికి, ''లేచావా...'' అంటూ తండ్రి తనవంక చూసి నవ్వి, ''ఇతనే మా అబ్బాయి విరాట్'' అంటూ ఆ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కి పరిచయం చేశాడు.

అతను విరాట్‌తో కరచాలనం చేసి ‘‘డోంట్ వర్రీ... ఐ విల్ టేక్ కేర్’’ అన్నాడు.

‘‘ఏమైంది?’’ అన్నాడు అర్థంకాక విరాట్ అయోమయంగా చూస్తూ.

తండ్రి విరాట్ భుజం మీద చెయ్యి వేసి ‘‘మాకు చెప్పడానికి భయపడ్డావ్. కారుతో ఎవరినో గుద్దేశావు కదా! ఆ వ్యక్తి చనిపోయాడు. ఈ విషయం మా దగ్గర దాచిపెట్టావ్. రోడ్డుమీద ఉన్న సిసి టివిలో రికార్డ్ అయ్యింది. ఆ విషయం ఈ ఇన్‌స్పెక్టర్ ద్వారానే తెలిసింది. అందుకే ఆరోజు నీకు బదులుగా మన డ్రైవర్‌ని మార్చేస్తున్నాం. నువ్వేం కంగారుపడకు.’’ అన్నాడు.

ఒక్కసారిగా విరాట్ బుర్ర పనిచేయడం మానేసింది. అయినా ఆలోచనలు చుట్టుముట్టాయి.

‘తను ఒక తప్పు చేశాడు. కారు వేగంగా నడిపి, ఒక నిండుప్రాణాన్ని బలి తీసుకున్నాడు. ఆ తప్పును కప్పి పుచ్చడానికి ఇప్పుడు చాలామంది రంగంలోకి దిగారు. నాన్న, ఇన్‌స్పెక్టరు, చేయని తప్పును భుజాన వేసుకున్న ఈ డ్రైవరు... తను ఆ క్షతగాత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేశాననుకుని, సరిపెట్టుకోబోయాడు. కాని చనిపోయిన మనిషిని తేగలడా?’

‘‘నో...’’ అంటూ గట్టిగా అరిచాడు, తండ్రి వంక చూసి.

తండ్రి, విరాట్ ముఖంలోకి చూసి ‘‘ఏమైంది నాన్నా?’’ అన్నాడు.

‘‘నా ఒక్కడి తప్పు సరిదిద్దడానికి, ఇంతమంది తప్పు చేయడం మరింత పెద్ద తప్పు అనిపిస్తుంది. నేను సరెండర్ అయిపోతాను. నేను చేసిన ఈ తప్పుకు నేనే శిక్ష భరిస్తాను. తప్పించుకు తిరుగుతూ, నన్ను నేను మోసం చేసుకుంటూ ఈ క్షోభ భరించలేను. అది నాకు పడబోయే శిక్షకన్నా ఎక్కువే.’’ అలా చెబుతూ విరాట్ గట్టిగా ఏడ్చేశాడు.

అతని మాటలకు అక్కడున్నవారంతా అతనివంక ఆశ్చర్యంగా, జాలిగా చూశారు.

అతని తండ్రి, వారి కారు డ్రైవరు, ఇన్‌స్పెక్టరు, ఆ ప్రకృతి, ఆ ప్రాంతానికంతటికీ గొప్పగా కనిపిస్తున్న వారి మూడంతస్తుల భవనం... స్తబ్దుగా అతని వంకే చూస్తుండగా, వేగంగా కదిలాడు. అక్కడ పార్క్ చేసిన తన స్కూటర్‌ను స్టార్ట్ చేశాడు.

తను చేసిన తప్పును లోకానికి తెలియజేయడానికి ఆ ఊళ్ళోని పోలీస్ స్టేషన్‌వైపుగా ముందుకు సాగాడు.

అంతవరకు కల్లోలంగా ఉన్న అతని మనసు నిర్మలంగా మారింది.

ఎడారిలోనో, సముద్రంలోనో చిక్కుకుపోయినప్పుడు దారిచూపే దిక్సూచిలా తన మనసే తనని ముందుకు ముందుకు నడిపిస్తోంది అనుకున్నాడు విరాట్.

# ఉత్తరాయణం

చొప్పదండి సుధాకర్
✆ 9177348349

***నీలాంటి, నా లాంటి వాళ్ళ ఆత్మహత్య ఫోబియా లేదా క్రేజ్‌ని చిత్రీకరించే శీర్షికతో, ఓ కథల పోటీ నిర్వహించాలని, అందులో చక్కటి ప్రత్యామ్నాయం మార్గాలు సూచించినవారికి... తలో అయిదు వందల రూపాయలు పారితోషికంతో, పది ఉత్తమ కథలను ఎన్నుకుని, కుదిరితే ఓ సంకలనంగా తీయాలనుకుంటున్నాను. ఖర్చు ఎంతో కాదులే... ఒక ఆగర్భ శ్రీమంతుడి దశదినకర్మ అంత కూడా ఉండదు. ఆ పని తప్పకుండా చేస్తాను. ఆలస్యమైనా సరే! ఎందుకంటే ఇవాళ్టి రోజుల్లో ఎవరు ఎక్కడ ఏ కథల పోటీ పెట్టినా, నెల రోజులు గడువిస్తే చాలు... సుమారు రెండొందల కథలు వచ్చి వాలుతున్నాయి.***

రెండు మూడు రోజులుగా మనసు మనసులో లేదు!

ఏదో చెయ్యాలి... ఎలాగైన విషయాన్ని వాడికి చేరవెయ్యాలి! కానీ చేయాల్సిన దాని మీదే ఒక స్పష్టత రావడం లేదు. ఉత్తరానికి బదులు ఉత్తరమే రాయాలా? లేక మిత్రుడి దగ్గరకు వెళ్ళి రావాలా? ఫోన్ చెయ్యాలా? అన్నీ సందేహాలే!

మొత్తానికి ఏదో ఒకటి చెయ్యాలి. ఇది మాత్రం తేలిగ్గా వదిలేసే అంశం కాదు. మురళి అంత లావు సైజు ఉత్తరం ఎంతో ఓపిగ్గా రాసాడంటే ఎంతటి సంఘర్షణకు లోనయి ఉంటాడో? అదీ పోనీ నా మీద ఎన్ని ఆశలు, ఎంతటి నమ్మకం పెంచుకోకపోతే అంతటి ఆర్తిని వెల్లగక్కి ఉంటాడు. హూ... మనసులో వేలాది ప్రశ్నలు, జవాబులు, పరిష్కారాలు రెండ్రోజులుగా వెంటాడుతుంటే, ఇక భరించే శక్తి లేక ఒక అర్ధరాత్రి పెన్నూ, కాగితం.. సారీ కాగితాలు ముందేసుకుని కూర్చున్నాను.

వాతావరణం ఆహ్లాదంగానే ఉంది. ఇంట్లో అందరూ నిద్ర పోయారు, గుయ్‌మనే శబ్దం తాలూకూ లయ తప్ప, ఏమీ వినిపించడం లేదు. నేను రాత్రి బాగా పొద్దుపోయేదాకా రాసుకోవడం, చదువుకోవడం ఇంటి వాళ్లకు ఇటీవల పరిచయమైన అంశమే, కాబట్టి దానివల్ల అభ్యంతరం ఉండే అవకాశమే లేదు.

గట్టిగా ఊపిరి తీసుకుని రాయడం మొదలు పెట్టాను.

ప్రియమైన ముర్లీ!

నీ ఉత్తరం నన్ను చాలారకాల వికారాలకు లోను చేసింది. వికారాలంటే ఏదో నెగటివ్‌గా తీసుకోకు. అందులో ప్రేమ, ఆప్యాయత, ఆపేక్ష, కోపం, ద్వేషం, చిరాకు... వంటి చాల అనుభూతులు ఉంటాయని ఎక్కడో చదివాను.

నీకు తెలుసో తెలియదో... ఆదికవి నన్నయ్య కాలంలో 'మల్లెల కంపు'అనే వారట. అంటే మల్లెల పరిమళం అన్న మాట.

కొన్ని కొన్ని పదాలు అలా రిజిస్టర్ అయిపోతాయంతే! పోతే, ఎకాఎకి అసలు విషయానికి వద్దాం. ఈ మధ్య నేను ఉత్తుత్తి ప్రేమలూ, పలకరింపులు మానేశాను. నువ్వు గమనించే ఉంటావు. ఎలాగంటే నేను ఉభయకుశలోపరి అనో, నమస్కారాలు అనో, కనీసం బాగున్నావా... అని కూడా అడగలేదు గమనించావా! అంతే కాదు, నీ పేరు మురళి అయినా ముర్లీ అని ఎందుకు సంబోధించానంటే, నేను నిన్ను చిన్నప్పుడు అలాగే పిలిచే వాడిని. గుర్తుందా... అఫ్‌కోర్స్ నువ్వూ నన్ను'సత్తీ' అని పిలిచేవాడివి అనుకో! సతీష్‌ని సత్తీ అని పిలవడం ఎలాగో మురళిని ముర్లీ అనడం అలాగే! ఇదంతా మన బాల్యాన్ని గుర్తు చేయడానికే... అలాంటి మనం 'ఇలాంటి' ఉత్తరం ఒకటి రాసుకొంటామని నేనైతే... కలలో కూడా ఊహించలేదు. మాటల్లో, ఆత్మీయతలో పరాయితనం పసిగట్టావనుకొంటాను!



అసలు ఉత్తరాలు రాసుకునే కాలమే అంతరిస్తున్న ఈ దశలో నువ్వు నాకు ఇంత భారమయిన (బరువులోనూ, బాధలోనూ) నాకు ఉత్తరం రాయడం చాలా, చాలా ఆశ్చర్యానికి గురిచేసింది... విస్మయం కూడా కొసరుగా!! ఆశ్చర్యం ఎందుకంటే మళ్ళీ ఉత్తరం ఉపయోగించినందుకు, విస్మయమేమో అందులోని విషయానికి! 'నవ్యత' అనే పెద్ద మాట వాడను గానీ, నా రాతలో విషయాన్ని వెలిబుచ్చడంలో ఎంతో కొంత భిన్నత్వాన్ని, కొత్తదనాన్ని గమనించావనుకొంటాను. అలాగే

రాయడంలో రవంత కవిత్వం పరిమళిస్తే, ఆఘ్రాణించు లేదా భరించు! కారణమేమిటంటే... నేనీ మధ్య బాగా పేరొందిన ప్రాచీనకవుల సాహిత్యం చదువుతున్నాలే! సాహిత్యం నాకు కొత్తలోకాన్ని పరిచయం చేసింది. శతాబ్దాల కింద కొందరు, దశాబ్దాల కింద కొందరు... మనకు తెలిసిన పదాలతోనే ఎన్ని కొత్తకొత్త భావనలు ప్రయోగాలూ, సాముగరిడీలు చేసారో పరిశీలిస్తే, తల తిరిగిపోతుంది. నిజంగా వాళ్లకి అంతటి ప్రతిభాపాటవాలు, ధారణాశక్తి, భాష మీద పట్టు. అదుపు ఎలా అబ్బాయో అస్సలు అర్థం కాదు. నాకయితే... ఆ కాలంలోనే వాళ్ళు అంతటి జ్ఞాన సంపద ఎలా ప్రోది చేసుకున్నారో తెలియక బుర్ర బద్దలు కొట్టుకోవాలో... లేక ప్రస్తుతతరం ఇంత తెలివి సంపాదించామని విర్రవీగే 'ఆధునిక యుగం'లో, అందులో మనకు లేశమైనా అబ్బనందుకు సిగ్గుతో తల దించుకోవాలో అర్థం కావడం లేదు! వందల ఏళ్ల కిందే ఎటువంటి రాత సామాగ్రి, కరెంటు, సమాచార వ్యవస్థ వంటి సౌకర్యాలు లేకుండానే అద్భుతమైన అంకితభావం, గ్రహణశక్తి వాళ్లకెట్లా సాధ్యమైనదంటావ్ మురళీ! నువ్వున్న మానసిక స్థితిలో నిన్ను ఇటువంటి ప్రశ్నలు అడగడం అసంగతమే కావొచ్చు, గానీ నాకైతే నిజంగా అగమ్యగోచరమే! మైండ్ బ్లాక్ అంటారే... అటువంటి మూడ్‌లో అడుగుతున్నా!

ఇదే విషయానికి సంబధించి ఇంకో రెండు ముక్కలు ప్రస్తావించి అసలు విషయానికి వస్తాను. వాళ్ళు సాహిత్యం సృష్టించేనాటికి కాగితం లేదు, పెన్నూ లేదూ... ఇక ప్రింటింగ్, బైండింగ్ అన్నవి కల్లో మాట! ఎవరికో... కొందరికి రాజుగారు లేదా జమిందారులాంటి వాళ్ళ ప్రాపు తప్ప, చాలామందికి అదొక ఆదాయం లేని వృధా ప్రక్రియ, వృత్తి కూడా! పోనీ అంతగా కష్టపడి... అంటే తాళపాత్ర సేకరణ, గంటంతో వ్రాయడం వంటి ఇబ్బందులు దాటుకుని రాస్తే దాంట్లో సాహితీ విలువలు చొప్పించడం, దానికి శాశ్వతత్వం ఆపాదించేలా రాయడం వంటివి లేకపోతే జనం మెచ్చుతారో లేదో తెలియదు. ఎందుకంటే ఆ కాలంలో ఆ స్థాయిలో చదువుకున్న వారు బహు స్వల్పం. అంతేనా... దాన్ని అర్థం చేసుకుని ఆస్వాదించేవారే కరువు కదా! ఇన్ని గండాలు దాటుకుని దాన్ని పదిలపరచడం పెద్ద సవాల్! అది భవిష్యత్తులో అచ్చవుతుందో... శిథిలమవుతుందో తెలియదు. అయినా ఇటువంటి అనుమానాలు ఏవీ మనసులోకి రానీయకుండా, పట్టుదలగా, మొండిగా సదరు సాహితీసృజన చేయడం ఎంత గొప్ప విషయం అంటావ్!

ఆ కోవలో రాసినవాటిలో ఇంకా ఎన్ని మట్టిగొట్టుకు పోయాయో... ఆచూకీ తెలియదు. తాళపత్రమైతే కాలగర్భంలో కలిసిపోతుందని, కొంతమంది రాగిరేకుల పైన గ్రంథాలు లిఖిస్తే, కొందరు మూర్ఖులు వొట్టి రాగి కోసం వాటిని నమ్మి తెగనమ్ముకోవడం ఎంతటి సిగ్గుచేటైన విషాదం! అయినా వాళ్ళు సాహిత్యానికి జీవితాలే అంకితం చేసారు. వాళ్ళు నిజంగా మనుషులేనా... లేక దేవతలా? అదీ ఇదీ కాక కారణజన్ములా? బహుశ ఆఖరిమాటే నిజం కావొచ్చును!

సర్లే... ఈ సోది అంత నీకు నచ్చుతుందనుకోను. ఇకపోతే అసలు విషయానికి వద్దాం!

"నీ మనసేమీ బాగోలేదా మురళీ? ఆర్థికంగా, మానసికంగా బాగా చితికిపోయావా?

ఆత్మహత్య చేసుకోవాలనుకొంటున్నావా? అందుకై నాకో ఉత్తరం రాసి నీ మానసిక వ్యధ అంతా చెప్పుకుని, తర్వాత నిశ్చింతగా చనిపోవాలనుకుంటున్నావా? ముర్లీ... ఇదే కదా నీ ఉత్తరంలో సారాంశం? నీ ఉత్తరం చదివాకా నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదురా... ఎందుకంటే నువ్వట్లా రాయడం ద్వారా నన్ను నువ్వు గౌరవిస్తున్నావో, అనుమానిస్తున్నావో అర్థం కాలేదు. పోనీలే నెగటివ్ ఎందుకు? ప్రేమతోనో, గౌరవంతోనో రాసావనుకొంటాను. కాకతాళీయమేమిటంటే సరిగ్గా నెల కింద... నేనూ నీలాగే డిప్రెషన్‌లో పడిపోయి, అదే పని చేద్దామనుకున్నాను. కానీ ఒక గురువు... అనగా ఉపాధ్యాయుడు

చాలా పుస్తకాలు చదివిన జిజ్ఞాసి, ఒక్కమాటలో చెప్పాలంటే స్థితప్రజ్ఞుడు... పేరు మారుతి! ఆయనగారు నా ఆలోచనావిధానాన్నే మార్చేసారు. 'మనుషులే ఆత్మహత్యలు చేసుకుంటారేమిటయ్యా? ఏ పక్షులో, జంతువో ఆరకంగా ఎందుకు ఆలోచించవు? ఎందుకంటే... నాకు తెలిసి, మనిషి అతిగా తెలివిడి ప్రదర్శించాలనుకుంటాడు. భారీ అంచనాలు, సాంఘిక ఆచారాలు, కట్టుబాట్లు అధిగమించాలనే దరిద్రపు ఊహలు, ఇతరులతో పోల్చుకోవడం, అవసరానికి మించిన ఆత్మవిశ్వాసం, తన పరిమితులేమిటో తెలుసుకోలేకపోవడం... వంటి చాలా చాలా అవలక్షణాలు పెంచుకొంటాడు. అటువంటి జీవనవిధానం వికటించినపుడు లేదా అనూహ్యమైన ప్రతికూల పరిస్థితులు ఎదురైనపుడు, వాటిని ఎదుర్కొనే ధైర్యం లేక పరువు పోతుందనే భయంతోనో, న్యూనతాభావంతోనో... ఆ నిర్ణయం తీసుకుంటాడు. కానీ ఇందులో నమ్మలేని నిజం ఏమిటంటే, వీళ్ళకు నిజంగా చావాలని ఉండదు. బతకాలన్న కోరిక కన్నా పలాయనవాదం ఎక్కువ అయిపోవడం వల్ల చావుకే మొగ్గు చూపుతారు. ఒక ఉన్మాద స్థితిలో అలా జరిగిపోతుంది అంతే!' అంటూ ఆయనగారు అటువంటి అత్యంత క్లిష్టపరిస్థితిని ఎట్లా గట్టెకాడో చెప్పుకొచ్చాడు.

ఆయనగారు... అంటే మారుతి మంచి అందగాడు. యవ్వనంలో మరింత తళుక్కుమనేవాడట. ఆ చరిష్మాకు బోర్లా పడిపోయిన ఓ గొప్పింటి అమ్మాయి, ఏరి కోరి ప్రేమించి, తీరా పెళ్లి విషయం వచ్చేసరికి తల్లితండ్రుల మాటవిని, బుద్ధిమంతురాలిగా మారి ఎవరినో చేసుకుని వెళ్ళిపోయిందట. ఇతడు ధైర్యంచేసి ప్రశ్నించేసరికి చితకతన్ని, పార్శిల్ చేసి పంపిచేరట! వాస్తవానికి అట్లా అవమానం బారిన పడ్డవారు, ఆత్మహత్య చేసుకుంటారు. కానీ మారుతిగారు మాత్రం తానేమీ తప్పు చేయలేదని నిరూపించడానికే బతకాలని దృఢనిర్ణయం తీసుకున్నాడట! పైపెచ్చు జీవితంలోంచి 'పెళ్ళి' అనే మాటే బహిష్కరించి తన ఆదాయంలో పావువంతు ఇప్పటికీ పేద బడిపిల్లలకు అందిస్తున్నాడట. నేను చెప్పేది నీకు అర్థం అవుతుందా?

న్యూటన్ తల్లకిందులుగా ఆలోచించడం వల్లే ప్రపంచం యొక్క ఆలోచనాధోరణిని మార్చగలిగాడు. అందరిలాగా తానూ... 'ఆ పడితే పడిందిలే ఆపిల్ కిందకు... ఇంకా నయం ఏ పుచ్చకాయో, పనసపండో అయితే చచ్చి ఊరుకునేవాడిని' అని అనుకోనట్టే, మారుతిగారు కూడా కాస్త భిన్నంగా ఆలోచించి, అవమానమే ఒక నష్టం, దాన్ని మరోనష్టంతో మరింత దిగజార్చకుండా, బతికి ఆ లోటు పూడ్చాలనుకున్నాడు. విజయవంతంగా పూడ్చాడు కూడా! ఆశ్చర్యంగా లేదూ!!

మారుతిగారితో ఆ సంభాషణ ముగించాక, నేనూ ఆ ధోరణిలో కొత్తగా ఆలోచించడం మొదలుపెట్టాను. 'అవునూ మనం మరీ శాస్త్రజ్ఞులం కాకున్నా కనీసం శాస్త్రీయంగా ఆలోచిస్తూ బతకలేమా?' అనిపించింది ప్రకృతిలో ప్రతి జీవికి, ప్రతి పదార్థానికి ఒక ధర్మం ఉంది. ఏ ధర్మం లేక అన్ని రకాలుగా ఉండగలగడం ఒక్క మనిషికే దేవుడు ఇచ్చిన వరం. కానీ ఆ వరాన్ని కూడా మనిషి శాపంగా మార్చుకోవడం ఎంత సిగ్గుచేటు! అది పోనీ... మనం ఈ భూమ్మీద పుట్టాం అంటే, ఈ ప్రపంచంలో మొట్టమొదటి జీవి పుట్టిన నాటి నుండి మన జీవధార కొనసాగుతున్నట్టే కదా! అంటే నాలుగు వందల కోట్లో, నలభై కోట్లో... ఆనాటి నుండి అవిచ్ఛిన్నంగా సాగివస్తున్న అపురూపమైన ఈ పరంపరను మనం చేజేతులా ధ్వంసం చేయబూనుకోవడం ఎంత మూర్ఖత్వం? మన పుట్టుకకు కారణమైన తాతో, తండ్రో, నాయనమ్మో ఇప్పటికే ఆత్మహత్య చేసుకుని ఉంటే మన పుట్టుకే సంభవించి ఉండేది కాదు కదా! కొత్తగా కనుక్కోవడం, సృష్టించేది ఎలాగూ చేతకాదు. నాశనం చేయడం మాత్రం బహు బాగా చేతనవును.

మన తాత, వాళ్ళ తాత, వాళ్ళ వాళ్ళ తాత తాత... వేలవేల తరాలు ఎన్ని కష్టాలుపడి, ఏటికి ఎదురీది, ఎన్నో యుద్ధాలు దాటి, రోగాలు, రొష్టులు అన్నిటినీ దిగమింగుకుని బతకడం ఒక పవిత్రకార్యంగా భావించడం వల్లే వాళ్ళ సంతతిగా మనం

పుట్టాం. అంతటి బృహత్తర యజ్ఞం చాలా తేలికగా మర్చిపోయి, వాళ్ళ బతకాలన్న బలీయమైన ఆకాంక్షని అవహేళన చేస్తున్నాం. ఇది ఎంతటి పిచ్చితనమో... ఇంకా ఏదైనా ముతకమాట తోస్తే బాగుండును! ఈ విషయం పట్ల నా మనసులో ఉన్న దుఃఖాన్ని, వేదనని ఇంకా శక్తిమంతంగా అభివ్యక్తీకరించాలంటే...

అదే తెలియపరచాలంటే ఇంకెన్ని పుస్తకాలు చదవాలో!

మనమేమి కష్టపడ్డామని... పడిపోతున్నామని చావాలి మురళీ? మనమేమైనా రాజుల కాలంలో పుట్టి వారివారి ప్రతాపాలు చూపించుకోడానికి చేసిన యుద్ధాల్లో సైనికులమా? ఎందుకంటే ఆ యుద్ధాల్లో పంతం ఒకరిదయితే, ప్రాణనష్టం వేలాది మందిది! అదీగాక... ప్రస్తుతకాలానికి వస్తే కాశ్మీర్ ఉగ్రమూకల దాడికి భయపడి పారిపోయి వచ్చిన పండిట్లమా? డొక్కల కరువు చూశామా, పిండారీల దొంగతనాలు ఎరుగుదుమా, అప్పట్లో మందులులేని మశూచి, మలేరియా, ప్లేగువంటి వ్యాధులను ఎదుర్కొన్నామా? ఏం చేసాం? ఏం కష్టపడ్డాం? ఒక్క మాటలో చెప్పాలంటే ఒకప్పుడు రాజులు, చక్రవర్తుల కూడా అనుభవించని ఏసీ, టీవీ, సెల్‌ఫోన్ వంటి సౌకర్యాలను, సామాన్యులుగా మనం చాల తేలిగ్గా పొందుతున్నాం. ఒకప్పుడు కిలోమీటర్ల దూరం నడిచి ఒక్క బిందె నీళ్ళు తెచ్చుకున్న ఆడవాళ్ళు, ఇవాళ కళ్ళు నెత్తికెక్కి కిచెన్‌లో నీళ్ళు రాకపోతే తల్లడిల్లిపోతున్నారు. మొగుళ్ళను వదిలేస్తున్నారు. పదుల కొద్దీ కిలోమీటర్లు నడిచి ఊళ్లకు వెళ్ళిన జనం, ఇపుడు బైక్ లేకపోతే హాస్పిటల్‌కి కూడా వెళ్ళడం లేదు!

సుఖం... సుఖం... సుఖం, గర్వం, పొగరు, ఇంకా ఎన్నో రకాల మానసిక వైకల్యాలు, నరనరాల్లో రక్తం రూపంలో ప్రవహిస్తున్నాయంటే అతిశయోక్తి ఏమీ కాదు. మురళీ... పదే పదే ముర్లీ అని రాయాలంటే పెన్నూ సహకరించడం లేదు. అది నా ప్రమేయం లేకుండానే నీపై చూపుతున్నఅవ్యాజమైన ప్రేమానురాగాలకి నిదర్శనం!

ఆ విషయం కాసేపు పక్కన పెడితే... నువ్వన్నట్టు ఒకసారి ఆలోచిద్దాం! నిజంగా మనం చనిపోతే ఏం జరుగుతుంది అంటావ్? ఏమీ జరగదు. ప్రపంచం ఏమీ ఆగిపోదు, భూమి తిరగడం మానదు. పెద్దపెద్ద సెలెబ్రిటీలు, ప్రధానులు, గొప్పగొప్ప శాస్త్రజ్ఞులు, మానవతావాదులు పోతేనే ఏమీకాలేదు. వాళ్ళతో పోలిస్తే మనమెంత? ఇంకా చెప్పుకోవాలంటే అప్పటికీ ఇప్పటికీ ఇంకా, ఇంకా అభివృద్ధే జరిగింది. కొత్తకొత్త ఆవిష్కరణలు పుట్టుకొచ్చాయి. మనుషులు మరింత సుఖంగా, సులభంగా బతికే మార్గాలు ఏర్పడ్డాయి. మనిషి పోయిన్నాడే సాయంత్రమే పక్షికి పెట్టడం, దశదినకర్మ సూతకం వంటివి ఎప్పుడు ముగించాలో, మిగతా కార్యక్రమాలు ఎట్లా నిర్వహించాలో ఖరారు చేసేస్తారు. అంతెందుకు? ఓ పక్క శవయాత్ర జరుగుతుంటే, ఇంకోపక్క ఫోన్లూ, వాట్సప్ మెస్సేజులు, జోకులూ, పలకరింపులూ యథేచ్ఛగా జరిగిపోతుంటాయి! రక్తసంబంధీకుల్లో సగం మంది కూడా ఏడవరు. అటు శవానికి నిప్పంటించగానే వెళ్ళిపోయేవారు మూడొంతుల మంది ఉంటారు! ఎందుకంటే మన చావు చూడడానికి వచ్చిన వాళ్ళలో చాలా మంది మొక్కుబడిగా వచ్చినవారే గనక! మిగిలేవాళ్ళు ఎవరంటే... మరీ దగ్గరి బంధువులు, వారసులు అంతే!

కావాలంటే నువ్వు ఈ మధ్య కాలంలో వెళ్ళిన చావు సంఘటన ఏదైనా ఉంటే గుర్తుతెచ్చుకో! నేను ఈ మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆక్సిడెంట్ అయి చనిపోతే వెళ్ళాను. అక్కడ ఆ వ్యక్తి తాలూకూ ఇన్సూరెన్సు డబ్బు వ్యవహారం తేలేవరకూ, అయనగారి భార్యే శవానికి నిప్పు పెట్టనీయలేదు. అదీ... మన చావు మనకు నేర్పే గుణపాఠం!

ఇక ముగిస్తాను మురళీ! మిత్రమా, ఇది కూడా పెన్ను చూపిన ప్రేమే! నాకు తెలిసి నువ్వు నాకు ఆత్మహత్య విషయంలో సలహా కోరుతూ ఉత్తరం రాసావంటే, ఇంకా బతికే ఉన్నావని నానుండి జవాబు వచ్చేదాకా గన్‌షాట్‌గా బతికే ఉంటావని

నొక్కి చెప్పగలను. ఒకవేల నా అంచనా తప్పు అయి ఉంటే ఇప్పటికే ఆ వార్త నాకు ఫోన్ ద్వారా అంది ఉండేది. సో... ఇంకా నువ్వు ఎటువంటి అఘాయిత్యానికి పాల్పడనందుకు అభినందిస్తున్నాను. ఒకవేళ నా ఉత్తరం అందేలోగా గనక నువ్వు ఆత్మహత్య చేసుకుని ఉంటే, నేను మాత్రం నిన్ను చూడడానికి రాను. ఎందుకంటే నా మీద నువ్వు ఉంచిన అభిమానానికి, బాధ్యతకు అది తీరని అవమానం అనే భావిస్తాను. ఇకపోతే... అంటే నువ్వు పోతే అని కాదు, తర్వాతి విషయం మాట్లాడే ముందు అందరు వాడే ఊతపదం ఈ 'పోతే' అనేది! నాకీ మధ్య ఓ కొత్త ఆలోచన మురళీ... నీలాంటి, నాలాంటి వాళ్ళ ఆత్మహత్య ఫోబియా లేదా క్రేజ్‌ని చిత్రీకరించే శీర్షికతో, ఓ కథల పోటీ నిర్వహించాలని, అందులో చక్కటి ప్రత్యామ్నాయం మార్గాలు సూచించినవారికి... తలో అయిదు వందల రూపాయలు పారితోషికంతో, పది ఉత్తమ కథలను ఎన్నుకుని, కుదిరితే ఓ సంకలనంగా తీయాలనుకుంటున్నాను. ఖర్చు ఎంతో కాదులే... ఒక ఆగర్భ శ్రీమంతుడి దశదినకర్మ అంత కూడా ఉండదు. ఆ పని తప్పకుండా చేస్తాను. ఆలస్యమైనా సరే! ఎందుకంటే ఇవాళ్టి రోజుల్లో ఎవరు, ఎక్కడ, ఏ కథలపోటీ పెట్టినా, నెలరోజులు గడువిస్తే చాలు... సుమారు రెండొందల కథలు వచ్చి వాలుతున్నాయి. సరే మనకు వందే వస్తాయి అనుకున్నా, ఆత్మహత్యల నివారణకు ఓ వంద పరిష్కారాలు దొరికినట్టే కద! అంతేనా... ఇంకొందరు జీవితంలో ఆనందాన్ని, అందులో అమృతసారాన్ని అద్భుతంగా వర్ణిస్తారు కూడా! వాళ్ళ కొత్తకొత్త ఆలోచనలన్నీ సంపుటిగా మారి, ప్రజల చేతుల్లోకి వెళ్లి, కనీసం నాలాంటి, నీలాంటి ఒకరిద్దరిని పునరాలోచించేలా చేసి, బతికించినా మన జీవితానికి సార్థకత లభించినట్టే కదా! ఈ పని ఎలాగైనా చేసి తీరుతాను. బతికుంటే నువ్వూ ఆవిష్కరణకు రావొచ్చును. ముందే చెప్పానుగా నేనీమధ్య సాహిత్యానికి బాగా అడిక్ట్ అయ్యానని! సర్లే... ఇంతకన్నా రాయలేను. సెలవు... ఉత్తరానికే సుమా... జీవితానికి కాదు!

నీ

పోయేవాడికి పేరుతో ఏం పని?

ఉత్తరం అంటించి (జిగురుతోనే సుమా) పోస్ట్ డబ్బాలో వేసిన నాకు వారం అయినా జవాబు రాలేదు!

తెల్లవారు రోజు ఆదివారం కావడంతో మురళే వచ్చాడు. ఇద్దరం కలిసి వేసవికాలం ఇంటిపైన రాత్రి దశమి చంద్రుణ్ణి చూస్తూ, తీతువు పిట్టల సంగీతం వింటూ, చుక్కలు లెక్కిస్తూ, తెల్లవారేదాకా చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుంటూ ఉండిపోయాం. మరుసటిరోజు మురళి మా పెరట్లో ఓ పారిజాతం మొక్కను నాటి వెళ్ళిపోయాడు. అది పూలు పూయకుండానే రాత్రిళ్ళు పరిమళిస్తోంది. నేను వీలైనంత తొందరగా కథాసంకలనం కోసం ఏర్పాట్లు ముమ్మరం చేశాను. అంటే తొలి అడుగు వేసాను. ఏడాదిలో కల నెరవేరింది. ఆవిష్కరణ వేదిక కూడా ఖరారు చేశాను. అదీ... మురళి ఇంట్లోనే! ఆవిష్కర్త ఎవరో చెప్పనవసరం లేదనుకుంటా!

# మా రూటే సెపరేటు

డా. ఎం. కోటేశ్వరరావు
✆ 8555881512

***"మేము ఓ అరగంట టాయ్లెట్స్ దగ్గర నిలబడటం అసౌకర్యమే కావచ్చు. కానీ ఇంత పెద్ద తుఫాను ముందు అది చిన్నదే కదా! ఎక్కువమంది అనుసరించే ఈ పద్ధతిలో సంబంధాలు దెబ్బతింటాయి. శత్రుత్వం పెరుగుతుంది. అరిచి గీపెట్టి, గోలచేసి ఆరోగ్యం పాడుచేసుకోవటం మాకు ఇష్టం ఉండదు. అందుకే మేము మా పద్ధతిలో డీల్ చేస్తాం. మొత్తానికి మా బెర్తులు మాకు దక్కాయి కదా.***

వేంకటరామయ్య, 50 సంవత్సరాలు, బెర్త్ నెంబర్ 6, జానకమ్మ, 48 సంవత్సరాలు, బెర్త్ నెంబర్ 9. ట్రైన్ కంపార్ట్‌మెంట్‌కి అతికించిన చార్ట్‌లో ఇద్దరి పేర్లు, బెర్త్ నెంబర్లు, చూసుకున్న తర్వాత లోపలికి అడుగుపెట్టారు వేంకటరామయ్య, జానకమ్మ దంపతులు! తమ బెర్తుల దగ్గరికి వెళ్ళి, బ్యాగులు బెర్త్ క్రింద సర్దుకున్నారు. రైల్వే వాళ్ళు బెర్త్ పైన సిద్ధంగా ఉంచిన కవర్స్ విప్పి, బెడ్‌షీట్, రగ్గు బయటకు తీశారు. బెడ్‌షీట్‌లను బెర్తుల పైన పరుచుకున్నారు. నడుము వాల్చటానికి సిద్ధం అయ్యారు. అప్పుడు... ముప్ఫై ఐదేళ్ల వయసుండే మూర్తి, మంగ దంపతులు అక్కడికి వచ్చారు.

"ఇవి మా బెర్తులు. మీరు కూర్చున్నారేంటి?" మొహం చిట్లించి అడిగాడు మూర్తి.

"అరె... బెడ్‌షీట్స్ కూడా విప్పేశారు. ఇప్పుడు మనం వీటినే వాడుకోవాలా?" చిరాకు, కోపం కలిపి అన్నది మంగ.

వేంకటరామయ్య, జానకమ్మ దంపతులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు అయోమయంగా! కోచ్ నెంబర్, బెర్త్ నెంబర్లు, పక్కాగా చూసుకుని, రైలు ఎక్కే ముందు చార్ట్‌లో పేర్లు సరిచూసుకుని మరీ ఎక్కారు. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలీలేదు ఇద్దరికీ.

"ఈ బెర్తులు మీవా?" మూర్తి దంపతులను అనుమానంగా అడిగాడు వేంకటరామయ్య.

"రెండేసి సార్లు చెప్తే కానీ అర్థం కాదా తమరికి? ఈ బెర్తులు మావి!" కాస్త కటువుగా అన్నాడు మూర్తి.

"చెవిటిమాలోకం అనుకుంటా" వినిపించీ వినిపించనట్టు గొణిగింది మంగ.

"సారీ సర్. మా బెర్తులు అనుకున్నాం" అంటూ, బ్యాగులు తీసుకుని అక్కడినుండి బయలుదేరారు వేంకటరామయ్య, జానకమ్మ.

బోగీ అంతా రద్దీగా ఉంది. ఎక్కడా స్థలం లేక, టాయ్లెట్స్ దగ్గర నిలబడ్డారు ఇద్దరూ. ట్రైన్ అప్పుడే బయలుదేరింది. అరగంట గడిచింది. టీసీగా పిలువబడే టీటీఈ వచ్చాడు. "ఇక్కడ నిలబడ్డారేంటి? మీ టికెట్ చూపించండి" అడిగాడతను.

ఆ దంపతులు జరిగింది చెప్పి, టిక్కెట్ చూపించారు. టీసీ ఆ టిక్కెట్‌ని, తన దగ్గర ఉన్న చార్ట్‌లో సరిచూసుకున్నాడు. "అవి మీ బెర్తులే. అసలు అక్కడికి వచ్చిన వాళ్ళెవరు? పదండి చూద్దాం" అంటూ ముందుకి కదిలాడు టీసీ. వేంకటరామయ్య, జానకమ్మ అతన్ని అనుసరించారు.



"మీ టిక్కెట్ ఇవ్వండి" మూర్తి దంపతులను అడిగాడు టీసీ.

టీసీతో పాటు మళ్ళీ వచ్చిన వేంకటరామయ్య దంపతులను అసహనంగా చూశారు మూర్తి దంపతులు. మూర్తి తన పర్స్‌లోంచి టిక్కెట్ తీసి చూపించాడు. టీసీ ఆ టిక్కెట్‌ను చూశాడు. "ట్రైన్ ఎక్కే ముందు కోచ్ నెంబర్ చూసుకోకుండా, ఏది పడితే అది ఎక్కటమేనా?" గట్టిగా అడిగాడు టీసీ.

ఈసారి మూర్తి దంపతులు ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

"ఏమయ్యింది?" కాస్త గొంతు తగ్గించి అనుమానంగా అడిగాడు మూర్తి.

"ఇది సెకండ్ ఏసీ కోచ్. మీది థర్డ్ ఏసీ టిక్కెట్. బెర్తు నెంబర్లు ఒక్కటే గుర్తు పెట్టుకుని ఎక్కేస్తే సరిపోదు. కోచ్ నెంబర్ కూడా చూసుకుని ఎక్కాలి." మందలింపు ధోరణిలో అన్నాడు టీసీ.

చుట్టుపక్కల ఉన్న ప్రయాణీకులు చూస్తూ ఉండటంతో మూర్తి, మంగ కాస్త ఇబ్బంది పడ్డారు. టీసీ దగ్గర నుంచి టికెట్ తీసుకుని చూశారు. పొరపాటున సెకండ్ ఏసీలోకి వచ్చినట్టు గుర్తించారు ఇద్దరూ.

"నడవండి నడవండి. సెకండ్ ఏసీకి, థర్డ్ ఏసీకి మధ్య ఇంటర్ కనెక్షన్ లేదు. గంట తర్వాత స్టేషన్ వస్తుంది. అప్పటి వరకు మీరు కూడా టాయ్‌లెట్స్ పక్కన నిలబడండి. మీ పొరపాటుకి వయసులో పెద్దవారిద్దరూ ఇప్పటివరకూ ఆ టాయ్‌లెట్స్ పక్కనే నిలబడి ప్రయాణించారు." టీసీ తొందర పెట్టాడు.

మూర్తికి, మంగకి మొహాలు మాడిపోయాయి. అవమానంగా అనిపించింది. మారు మాట్లాడకుండా, కనీసం 'సారీ' కూడా చెప్పకుండా, బ్యాగులు ఈడ్చుకుంటూ టాయ్‌లెట్స్ వైపు వెళ్ళిపోయారు.

వేంకటరామయ్య, జానకమ్మ మళ్ళీ సామాను బెర్తుల క్రింద సర్దుకున్నారు. టీసీ ఇంకా అక్కడి నుండి వెళ్ళలేదు. ఆ దంపతుల వైపు చిరునవ్వుతో చూస్తూ నిలబడ్డాడు. వేంకటరామయ్య, జానకమ్మ ఆశ్చర్యంగా చూశారు టీసీ వైపు. "ఇంత అమాయకంగా ఉంటే ఎలా సర్? వాళ్ళంటే కోచ్ చూసుకోకుండా ఎక్కారు. మీరు కూడా చూసుకోలేదా? వాళ్ళు మిమ్మల్ని వెళ్లిపోమంటే వెళ్లిపోవటమేనా?" నవ్వుతూ అడిగాడు టీసీ.

"అదేం లేదు సర్. ఇవి మా బెర్తులే అని మాకు పక్కాగా తెలుసు! వాళ్ళే పొరపాటు పడ్డారని కూడా తెలుసు! అయినా మేము మారు మాట్లాడకుండా ఇక్కడినుంచి వెళ్లిపోయాం" అన్నాడు వేంకటరామయ్య. ఇప్పుడు దంపతుల మొహాల్లో చిరునవ్వు. టీసీ మొహంలో ఆశ్చర్యం.

"వ్వాట్... మీకు తెలిసే వెళ్లిపోయారా? ఇదేదో కొత్తగా ఉంది. కాస్త వివరంగా చెప్తారా?" ఎదురు బెర్తు మీద కూర్చొని ఆసక్తిగా అడిగాడు టీసీ.

"ప్రతి సందర్భానికి మనం స్పందించటానికి రెండు రకాల అవకాశాలు ఉంటాయి. సాధారణంగా అందరూ మొదటి రకాన్ని ఎంచుకుంటారు. మేము మాత్రం రెండో విధానాన్ని ఇష్టపడతాం" నవ్వుతూ చెప్పాడు వేంకటరామయ్య.

"మీరు ఇంతకు ముందు చూసింది మేము ఇష్టపడే మా రెండో విధానం" జానకమ్మ చెప్పింది.

"మరి అందరూ పాటించే ఆ మొదటి పద్ధతి ఏంటి?" కుతూహలంగా అడిగాడు టీసీ.

"అది చెప్తే అర్థం కాదు. చూడాల్సిందే. మీరు ఒకసారి కళ్ళు మూసుకోండి" అన్నాడు వేంకటరామయ్య.

టీసీ కళ్ళు మూసుకున్నాడు.

"మేము చెప్తూ ఉంటాం. మీరు సినిమా చూడండి" వేంకటరామయ్య. టీసీ కళ్ళ ముందు సినిమా మొదలయ్యింది.

★★★

వేంకటరామయ్య, జానకమ్మ బెర్తుల మీద బెడ్‌షీట్స్ పరుచుకుని నడుం వాల్చటానికి సిద్ధం అయ్యారు.

"ఇవి మా బెర్తులు. మీరు ఆక్యుపై చేశారేంటి?" అక్కడికి వచ్చిన దంపతులలో మూర్తి మొహం చిట్లించి అడిగాడు.

"అరె... బెడ్‌షీట్స్ కూడా విప్పేశారు. ఇప్పుడు మనం వీటినే వాడుకోవాలా?" చిరాకు, కోపం కలిపి అన్నది మూర్తి భార్య మంగ.

"ఇవి మా బెర్తులు కాబట్టి మేము కూర్చున్నాం. మా బెర్తులు కాబట్టి బెడ్‌షీట్స్ వేసుకున్నాం. మీ బెర్తులు అంటారేంటి?" వేంకటరామయ్య అడిగాడు. "అదే నేనూ అడుగుతున్నాను. ఇవి మా బెర్తులు. మీవి అంటారేంటి? మీవి ఎక్కడ ఉన్నాయో సరిగా చూసుకోండి" మూర్తిలో చిరాకు.

"ఆ పని చెయ్యాల్సింది మీరు. మేము కాదు!"

"మేము ఒకటికి రెండుసార్లు అన్నీ చూసుకున్న తర్వాతే మా బెర్తుల దగ్గరికి వచ్చాం!"

"ఊరికే ఇరిటేట్ చెయ్యకుండా, ఖాళీచేసి మా బెర్తులు మాకివ్వండి. ఎంతసేపు నిలబడాలి మేము?" మంగ కస్సు మంది.

"ఇరిటేట్ చేస్తున్నది మీరు. మిమ్మల్ని ఇక్కడ ఎవరు నిలబడమన్నారు? మాకు డిస్ట్రబెన్స్‌గా ఉంది. ముందు మీరు ఇక్కడి నుండి వెళ్ళండి" జానకమ్మ ఏమీ తగ్గలేదు.

"చూడండి. నేను ఇప్పటివరకూ మర్యాదగా మాట్లాడాను. నాకు కోపం తెప్పించకుండా ముందు లేవండి మా బెర్తుల మీద నుంచి" మూర్తి కోపంగా అన్నాడు.

"సరే. ఇవి మీ బెర్తులు అంటున్నారు కదా. ఒకసారి మీ టికెట్ చూపించండి. చెక్ చేద్దాం" అన్నాడు వేంకటరామయ్య.

"మర్యాదగా మాట్లాడండి. మా టికెట్ మీకెందుకు చూపించాలి? మీరేమైనా టీసీనా? ట్రైన్ మీదా? మీకు చూపించాల్సిన అవసరం లేదు. కావాలంటే ముందు మీ టిక్కెట్ చూపించండి" మూర్తి స్వరం పెంచి వాదులాటగా అన్నాడు.

"మీరు మీ టిక్కెట్ చూపించనప్పుడు మేము మాత్రం మా టికెట్ మీకెందుకు చూపించాలి? మీరు టీసీలా? లేక మేమేమైనా మీ దగ్గర పనిచేసే వాళ్ళమా?" వేంకటరామయ్య అదే స్థాయిలో ధీటుగా జవాబిచ్చాడు.

"ఇంతకీ మీరనేదేమిటి? ఇవి మీ బెర్తులా? ఇవి మీవయితే మరి మేమెవరం? టికెట్ లేకుండా ప్రయాణించే దొంగలమా?" గయ్యాళిలా విరుచుకుపడింది మంగ.

"మీరు దొంగలైతే మాకెందుకు? దొరలైతే మాకెందుకు? అవన్నీ మేము అడిగామా? మీ సోది మాకెందుకు చెప్తున్నారు? ముందు ఇక్కడి నుండి వెళ్తారా, లేదా?" జానకమ్మ హెచ్చరికగా అన్నది.

"ఏంటండీ? ఊరుకునే కొద్దీ తెగ రెచ్చిపోతున్నారు? నాకు ఒళ్ళు మండితే, మీ లగేజ్ తీసి అవతలకి విసిరేస్తాను... ఏమనుకుంటున్నారో! ముందు బెర్తులు ఖాళీ చేయండి" మూర్తిలో ఉగ్రరూపం కనబడింది.

"మరే! మీరు ఎప్పుడు వచ్చి అడుగుతారా? ఎప్పుడు ఖాళీ చేద్దామా అని ఎదురు చూస్తున్నాం ఇక్కడ! లగేజీ విసిరిపారేస్తే చూస్తూ ఉండటానికి ఇక్కడ ఎవరూ గాజులు తొడిగించుకుని లేరు. లగేజీ మీద చెయ్యి వేస్తే అప్పుడు తెలుస్తుంది నా తడాఖా ఏంటో?" వేంకటరామయ్య కూడా ఉగ్రుడయ్యాడు.

“అంటే ఏంటి? కొడతావా? కొడతావా చెప్పు! రా... కొట్టు చూద్దాం. కొట్టరా...” ఏక వచనంలోకి మారి వేంకటరామయ్య పైపైకి విసురుగా వచ్చాడు మూర్తి.

“నువ్వు అన్నదానికి నేను అన్నాను. లగేజీ పడేస్తానని ఎందుకు అన్నావ్? నీకేం అధికారం ఉంది? రా, లగేజీ ముట్టుకో చూద్దాం. నువ్వేమైనా పెద్ద రౌడీవా? రౌడీవైతే బయట చూపించుకో... మా దగ్గర కాదు! నీలాంటి వాళ్ళని చాలామందిని చూశాను!” వేంకటరామయ్య బెర్తులోంచి అంతే విసురుగా లేచి మూర్తి పైపైకి వచ్చాడు.

కోచ్‌లోని మిగిలిన ప్రయాణీకులు వారించినా ఫలితం లేకపోయింది. అడ్డొచ్చిన వారిని పక్కకి నెట్టి పడేస్తున్నారు. పెద్ద పెద్ద అరుపులు... కేకలు. ఏకవచనంలోంచి బూతుల్లోకి మారిపోయారు రెండు జంటలు! అరుచుకుని, అరుచుకుని గొంతులు బొంగురుపోయాయి. మాటలు తడబడుతున్నాయి. ఆయాసంతో రొప్పుతున్నారు. మాటకి మాట! ఇంక ఏ క్షణంలో అయినా కొట్టుకోవటం మొదలు కావొచ్చు అనే సమయంలో, కొందరు ప్రయాణీకులు పక్క కోచ్‌లో ఉన్న టీసీని తీసుకు వచ్చారు. మూర్తి, మంగ టీసీకి ఫిర్యాదు చేశారు. వేంకటరామయ్య, జానకమ్మ కూడా ఫిర్యాదు చేశారు. అన్ని బెర్తుల వాళ్ళు అక్కడికొచ్చి జరుగుతున్నదంతా వినోదంగా చూస్తున్నారు.

“మీ టిక్కెట్ ఇవ్వండి” టీసీ మూర్తి దంపతులను అడిగాడు.

“ముందు వాళ్ళని చూపించమనండి. మేమేదో టిక్కెట్ లేని ప్రయాణీకుల్లా మమ్మల్ని అవమానిస్తారేంటి! వాళ్ళని అడగండి” మంగ అందుకుంది.

“ఇక్కడికి ముందు వచ్చింది మేము! ఇవి మా బెర్తులు. మేమెందుకు చూపించాలి? మీరే చూపించుకోండి” అంది జానకమ్మ.

“మరీ చిన్నపిల్లలలాగా ఈ పట్టుదలలు ఏంటండీ? ఓ పని చేయండి. ఒకేసారి మీ ఇద్దరి టిక్కెట్లు నా రెండు చేతుల్లో పెట్టండి” అన్నాడు టీసీ.

మూర్తి, వేంకటరామయ్య వాళ్ళ టిక్కెట్ టీసీ చేతుల్లో ఒకేసారి పెట్టారు.

టీసీ చార్ట్ తీశాడు. ఇద్దరి టిక్కెట్లని చార్ట్‌లో పోల్చి చూస్తున్నాడు. కోచ్‌లోని ప్రయాణీకులందరూ, థర్డ్ ఎంపైర్ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నట్టు ఉత్కంఠతతో చూస్తున్నారు. టీసీ చార్ట్ వైపు, రెండు టిక్కెట్ల వైపు, రెండు జంటల వైపు మార్చి మార్చి చూస్తున్నాడు. “నీ బోడి బిల్డప్‌లు పాడుగాను. ముందు బెర్తులు ఎవరివో తేల్చరా” విసిగిపోయిన కొందరు ప్రయాణీకులు మనసులో తిట్టుకున్నారు టీసీని.

టీసీ నోరు విప్పాడు. “చూడండి. మీ ఇద్దరి బెర్తు నెంబర్లు ఒక్కటే. కోచ్‌లే వేరు. క్లాసులు కూడా వేరే. ఈ రెండు బెర్తులు వేంకటరామయ్య, జానకమ్మ గారివి. మూర్తి, మంగ గారివి థర్డ్ ఏసీ. మీరు తర్వాత వచ్చే స్టేషన్లో దిగి, మీ కోచ్‌లోకి వెళ్ళిపొండి. నేను మంచోణ్ణి కాబట్టి ఇక్కడితో వదిలేస్తున్నాను. లేకపోతే, సెకండ్ ఏసీలో ఇంతసేపు ఉన్నందుకు, ఇంత న్యూసెన్స్ చేసినందుకు మీకు ఫైన్ వెయ్యాలి. వెళ్ళండి.” టీసీ జడ్జిమెంట్ పూర్తిచేశాడు.

మంగ, మూర్తి వాళ్ళ టికెట్ చూసుకుని గతుక్కుమన్నారు. నోట మాట రాలేదు. ఆయాస పడుతూ, రొప్పుతూ, బ్యాగులు

తీసుకుని టాయ్‌లెట్స్ వైపు అడుగులు వేశారు. అక్కడే కూర్చున్న వేంకటరామయ్య, జానకమ్మ కూడా ఆయాసంతో రొప్పుతున్నారు.

అక్కడితో ఆగలేదు. "ఫైన్ వేస్తాడంట... ఫైను! ట్రైన్ వీడి బాబుది అయినట్టు! ఆఫ్ట్రాల్ సెంట్రల్ గవర్నమెంట్‌కి పాలేరుగాడు... వీడేదో పెద్ద సత్య హరిశ్చంద్రుడు అయినట్టు! ఖాళీ బెర్తులు అమ్ముకుతినే వాళ్ళు కూడా నీతులు చెప్పటమే" గొణుక్కుంటూ వెళ్ళారు మూర్తి, మంగ. టీసీకి ఆ మాటలు వినిపించాయి. అతని మొహం కంద గడ్డలా అయ్యింది. కోచ్‌లోని ప్రయాణీకులు అందరూ ఎవరి స్థానాల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు. గొడవ సద్దుమణిగింది.

★★★

వేంకటరామయ్య టీసీ ముఖం దగ్గర చిటికెలు వేశాడు. టీసీ కళ్ళు తెరిచాడు. "ఎలా ఉంది సర్ సినిమా?" చిరునవ్వుతో అడిగాడు వేంకటరామయ్య. "చాలా ఛండాలంగా ఉంది. వైల్డ్‌గా, వయొలెంట్‌గా ఉంది. ఓహ్ గాడ్. మధ్యలో నా మీద పడ్డారేంటి వాళ్ళు ?" బిక్కమొహంతో అన్నాడు టీసీ.

"అదన్నమాట సంగతి! మనిషికి సహనం, సంస్కారం ఉండాలి సర్. ఒకరికి లేకపోయినా, మరొకరికి ఉండి, కాస్త తగ్గి, సర్దుకు పోతే, ప్రయాణమైనా, జీవితమైనా సాఫీగా, ప్రశాంతంగా సాగిపోతుంది సర్. 'ఇగో' వల్ల నష్టమే తప్ప లాభం జరగదు" అన్నాడు వేంకటరామయ్య.

'నిజమే సుమా!' అన్నట్టు చూశాడు టీసీ.

"ఇప్పటి ఉదాహరణే చూద్దాం. అవి మా బెర్తులు అని తెలిసినా మేము వాదనకి దిగలేదు. గొడవ పెంచుకోలేదు. ఆ రెండూ ఉంటే ఏమవుతుందో సినిమాలో చూశారు కదా. బీపీ పెరుగుతుంది. ఆవేశం కలుగుతుంది. ఆయాసం వస్తుంది. మాట అదుపు తప్పుతుంది. అశాంతి, అవమానం. హార్మోన్స్ విడుదలవుతాయి. తిట్లు, కొట్టుకోవటం!" వేంకటరామయ్య చెప్పేది ఆసక్తిగా వింటున్నాడు టీసీ.

"మేము ఓ అరగంట టాయ్‌లెట్స్ దగ్గర నిలబడటం అసౌకర్యమే కావచ్చు. కానీ ఇంత పెద్ద తుఫాను ముందు అది చిన్నదే కదా! ఎక్కువ మంది అనుసరించే ఈ పద్ధతిలో సంబంధాలు దెబ్బతింటాయి. శత్రుత్వం పెరుగుతుంది. అరిచి గీపెట్టి, గోలచేసి ఆరోగ్యం పాడు చేసుకోవటం మాకు ఇష్టం ఉండదు. అందుకే మేము మా పద్ధతిలో డీల్ చేస్తాం. మొత్తానికి మా బెర్తులు మాకు దక్కాయి కదా. ఇప్పుడు చెప్పండి టీసీ గారు... మేము అనుసరించే విధానం మంచిదా? అందరూ అనుసరించేది మంచిదా?" నవ్వుతూ అడిగాడు వేంకటరామయ్య. "సర్... మీరు అనుసరించే పద్ధతే గొప్పది. రక్తం చుక్క రాలకుండా యుద్ధం గెలవటంలాంటిది. ఈ రోజు నేనొక మంచి విషయం గుర్తించాను. ఎక్కడ తగ్గాలో తెలుసుకున్నాను. ఎలా నెగ్గాలో అర్థం చేసుకున్నాను. చాలా థాంక్స్ సర్" కృతజ్ఞత నిండిన కళ్ళతో వెళ్లిపోతున్న టీసీ వైపు చూస్తూ, తమ బెర్తులపై నడుం వాల్చారు వేంకటరామయ్య, జానకమ్మ.

# అంతా మన మంచికే

సిరిపురపు హనుమత్ ప్రసాద్
✆ 9290057768

***ఆఫీస్ అందరూ లక్ష్మిని అభినందించారు. శ్యాంబాబు మంచి ఛాయిస్ అన్నారు. వయోభేదం లెక్క లోకి రాదన్నారు. ఇద్దరి మనసులు కలవడమే ముఖ్యం అన్నారు. ఒకరికొకరు అపరిచితులు కాదు కూడా! బలాలూ, బలహీనతలూ తెలిసినవారు. క్లుప్తంగా చెప్పాలంటే వాళ్ళిద్దరినీ క్షణాల్లో దేవుడే కలిపాడని ఎవరికైనా అనిపిస్తుంది.***

అద్దం ముందు నిలబడ్డాడు శ్యాంబాబు!

తలమీద నెరిసిన జుట్టు. ముఖంమీద ఇప్పుడిప్పుడే పడుతున్న ముడతలు. కొద్దిగా చిక్కిన శరీరం. వణక్కపోయినా, వణుకుతున్న భావనలో చేతులు. గోళ్లు ఆరోగ్యానికి సంకేతాలంటారు... అవి కొద్దిగా రంగు తగ్గినట్టనిపిస్తున్నాయి. టీ షర్ట్... ఛాతీ డొల్లతనాన్ని ఎత్తి చూపిస్తోంది. డ్రెస్సింగ్ టేబుల్ కావడంతో, పైజామాలో దాక్కున్నకాళ్ళు చిక్కినట్టు అనిపిస్తోంది.

అరవై ఏళ్ళు నిండాయని ఆఫీసు వాళ్ళు పదవీవిరమణ చేయించారు. 'మానసికంగా నేను ఇంకా యాభైల్లోనే ఉన్నానన్నా వినిపించుకోలేదు.

"మీరు విరమిస్తే కదా... మాకు ప్రమోషన్లు వస్తాయి, ఒక నిరుద్యోగికి ఉద్యోగం వస్తుంది" అన్నారు.

'నిజమే, పాత నీరు పోతేనే కదా కొత్తనీరు వచ్చేది! పాతనీరు పోనంటే కొత్తనీరు తోసేసెయ్యదా తనకోసం? ఈ చిన్నసత్యాన్ని మర్చిపోయి, ఆఫీసులో మొండికేసాడు, తననింకా పనిచేయనిమ్మని! వాళ్ళెందుకు ఒప్పుకుంటారు? రిటైర్ అయితే తనని ఒంటరితనం పీడిస్తుందని, తనవాళ్లంటూ ఎవరూ దగ్గర లేరని, తన క్షేమాన్ని చూసుకునేందుకు తనకెవరూ లేరని చెప్తే మాత్రం వింటారా? తనకింద పనిచేసిన రామారావే ఏదైనా వృద్ధాశ్రమంలో చేరమని సలహా ఇచ్చాడు. అక్కడైతే సేవల్ని కొనుక్కోవచ్చు, తనలాంటి వయోవృద్ధుల సహవాసంలో కాలక్షేపం చేయవచ్చు, అనారోగ్యం చేస్తే చూసే వాళ్ళుంటారు అని కూడా చెప్పాడు. నిజమే. ఉద్యోగంలో ఉన్నప్పుడు మనిషికి విలువ ఉంటుంది. రిటైర్ కాగానే ఆ విలువ హఠాత్తుగా మాయమై పోతుంది. నిన్నని ఇవ్వాళతో పోల్చలేము. ఈ జీవితసత్యాన్ని తనకో కుటుంబం ఉంటే ఎప్పుడోనే ఆకళింపు చేసుకునేవాడు. రిటైర్మెంట్ ఒక హఠాత్పరిణామంలా కనిపించేది కాదు.'

అద్దం ముందునుంచీ కదులుతూ అనుకున్నాడు, 'నిన్నటి వరకూ అద్దం తనకి చూపించిందేమిటి, ఇవ్వాళ చూపిస్తున్నదేమిటి? అద్దమే మోసం చేస్తుంటే, మనుషులు చేయరా?'

రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ని తీసుకోడానికి ఆఫీస్‌కి వెళ్ళాడు శ్యాంబాబు. రామారావుని సాదరంగా ఆహ్వానించి తన ముందుకుర్చీలో కూర్చోమన్నాడు. నిన్నటిదాకా కూర్చున్న కుర్చీకి తను పరాయివాడైపోయాడు. తన సీటు ఖాళీగానే ఉన్నా, రోజులా కూర్చోలేకపోయాడు. తోటి ఉద్యోగులు "హలో సార్, ఎలా ఉన్నారు?" అని అడుగుతూ తమ పని చూసుకుంటున్నారు. తనతో ఇంకొంచెంసేపు మాట్లాడడం వృథా అనుకుంటున్నారు. ఇంతలోనే ఎంత మార్పు!

"శ్యాంబాబు గారూ, మీకు అన్ని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కలిపి నలభై లక్షలు వచ్చాయి. నెల నెలా కొద్దిగా పెన్షన్ వస్తుంది!" అన్నాడు రామారావు.

"కొద్దిగా అంటే?"


"పదివేలు వస్తుంది... మీరొక్కరే కదా?" అన్నాడు హేళనగా నవ్వుతూ.

కోపం వచ్చింది శ్యాంబాబుకి. తమాయించుకున్నాడు.

"అంటే ఈ ప్రపంచంలో నాకెవ్వరూ లేరంటారా?"

"అలా అని కాదు. మీమీద ఆధారపడేవాళ్ళు మరెవ్వరూ లేరు కదా, అంటే భార్య అని అర్థం చేసుకోండి..."

"భార్య లేకపోవచ్చు, పిల్లలు లేకపోవచ్చు, నా చుట్టూ ఒక లోకం ఉంది. నన్ను రమ్మని పిలిచే పుణ్యక్షేత్రాలున్నాయి, నేను డొనేట్ చేస్తున్న అనాథాశ్రమాలున్నాయి..."



"వాటికోసం కంపెనీ ఇవ్వదుగా! మీకైతే సరిపోతుంది. ఉండడానికి ఒక సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ సొంతదే ఉంది. ఆరోగ్యావసరాల కోసం కంపెనీ ఇన్సూరెన్సు ఉండనే ఉంది. మీరే మనసుని దృఢపర్చుకుని శేషజీవితాన్ని అందంగా మలుచుకోవాలి. మారిన పరిస్థితుల గురించి విచారించి ఉపయోగం లేదు. మీకు రిటైర్మెంట్ ఇష్టం లేకుంటే, మరో కంపెనీలో పార్ట్‌టైమ్ జాబ్ చూసుకోండి. కాలక్షేపమౌతుంది!"

అలాగేనన్నట్టు తలూపాడు శ్యాంబాబు. రిసీప్ట్స్ మీద సంతకం చేసి ఆఫీసులో అందరికీ 'హలో' చెప్పి వెళ్లాలని లోపలికి నడిచాడు.

లోపల హాల్లో ఒకమూల కూర్చుని ఉంది లక్ష్మి. ఆమె వయస్సు నలభై ఉండచ్చు. భర్త వదిలేసి ఎటో వెళ్ళిపోయాడు. ఒకబాబు, ఒకపాప. పాపకి పెళ్ళి చేసి పంపించేసింది. బాబు గ్రాడ్యుయేషన్ చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు.

"నమస్తే సార్" అన్నది లక్ష్మి.

"బాగున్నావా లక్ష్మీ?"

తలా ఊపింది. నిన్నటికీ, ఇవ్వాళ్టికి తేడా ఏముంటుంది?

"కూర్చోండి"

ఆమె ఎదురుగా ఉన్నకుర్చీలో కూర్చున్నాడు. కాఫీకి ఆర్డర్ ఇచ్చింది.

"మీరు ఒంటరివారా? అందరూ అనుకుంటుంటే విన్నాను. అప్పు పేరున మీ దగ్గిర పది లక్షలు కొట్టేయాలని అనుకుంటున్నాడు శంకర్రావు..."

"అది అయ్యే పని కాదులే!" అన్నాడు. అయినా కొంచెం భయం వేసింది. తన వృద్ధాప్యాన్ని, ఒంటరితనాన్ని ఆసరా చేసుకుని, అందరూ మోసం చేయడానికి చూస్తుంటారనే ఆలోచనే కొంచెం భయం కలిగించింది. నిన్నటివరకూ లేని భయం ఈరోజు మొదలైంది.

"నన్ను పెళ్ళి చేసుకుంటారా?" అడిగింది లక్ష్మి, బట్టీకొట్టి అప్పచెప్పినట్టు.

ఒక్కక్షణం నోటమాట రాలేదు శ్యాంబాబుకి. ఆ ప్రశ్న కలలో కూడా ఊహించనిది. లక్ష్మి చూడడానికి బాగానే ఉన్నా వయసు కంటే ఎక్కువగా కనిపిస్తుంది.

"మీకు పెళ్ళి అయ్యింది, విడాకులు తీసుకోలేదు. మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చా?

"ఆయన ఇంట్లోంచి వెళ్ళిపోయి పదేళ్ళయింది. బతికున్నా లేనట్టే... నా కూతురుకి పెళ్లయింది, భర్త దగ్గరకు వెళ్ళిపోయింది. కొడుకు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ఉద్యోగం దొరికితే వాడికీ రెక్కలొచ్చేస్తాయి!"

"కొడుక్కి ఇప్పుడైతే అభ్యంతరం ఉంటుంది కదా?"

"అవన్నీ నేను చూసుకుంటాను. మీకు ఇష్టమైతే చెప్పండి... ఒకరికి ఒకరం తోడు! తప్పుగా మాత్రం భావించకండి!"

"మీరు ఇంతకాలం ఊరుకుని, ఇప్పుడే ఎందుకడిగారు?"

"అడగాలనిపించేది... అది ప్రేమో, గౌరవమో, మీ ఒంటరితనం పట్ల సానుభూతో తెలియదు. ఇప్పుడు కూడా అడక్కపోతే, ఇక ఎప్పటికీ అడగలేనేమో అనిపించింది!"

"అర్థం చేసుకోగలను."

"మీకు ఎప్పుడూ అనిపించలేదా?"

ఒక్కక్షణం ఆగి, అన్నాడు శ్యాంబాబు, "మిమ్మల్ని చూసినప్పుడల్లా నా గుండె ఆర్ద్రతతో నిండిపోయేది. 'మీకు అవసరాలేమైనా ఉన్నాయా?' అని అడగాలనిపించేది. కానీ అది తప్పుగా అర్థం చేసుకుంటారేమోనని అడగలేక పోయేవాడిని. అసలు లేనిదాని కంటే ఆలస్యం మేలు కదా! నాకు ఆలోచించుకోడానికి కొద్ది సమయం ఇవ్వండి!"

"తప్పకుండా!"

శ్యాంబాబు మనసులో ఒకవైపు ఏదో తెలియని ఆనందం, మరో పక్క ఎన్నో సందేహాలు, ఒక మూల ఏదో భయం.

ఇంటికి చేరుకున్నాడు. మనసులో సంఘర్షణ. ఇన్ని రోజులుగా ప్రస్తావించకుండా ఇప్పుడు అడిగిందేమిటి లక్ష్మి? అందులో స్వార్థంలేదు కదా?

కొద్దిసేపు ఆలోచించాక తన మనసులో లేచిన ప్రశ్నలకి జవాబులు తట్టాయి.

లక్ష్మికి చాలా సర్వీస్ ఉంది. తన డబ్బుమీద ఆధారపడి లేదు. మంచిజీతమే వస్తుంది. బాధ్యతలు లేవు. తనకీ ఒకతోడు కావాలి. వేరే ఆడవాళ్ళ గురించి చెవులు కొరుక్కునే సహోద్యోగులు లక్ష్మి గురించి ఎప్పుడూ చెడుగా మాట్లాడుకోడం తను వినలేదు. ఒకవేళ మాట్లాడుకున్నా 'డోంట్ కేర్'.

అద్దం ముందుకి వెళ్ళాడు శ్యాంబాబు. తన ముఖంలో ఏదో కాంతి కనిపిస్తోంది. జుట్టు తెల్లగానే కనిపించినా ముఖంలో కొత్తకళ ఉట్టిపడుతోంది. తన శరీరం గాలిలో తేలిపోతున్నట్టుంది.

'ఓకే' చెప్పేద్దామని నిర్ణయించుకున్నాడు. లక్ష్మీ, తనూ ఒక్కటనిపించారు. ఒకరి కోసం ఒకరనిపించారు.

సహోద్యోగి రామారావు మంచి నిర్ణయం అని శ్యాంబాబుని అభినందించాడు.

ఆఫీస్‌లో అందరూ లక్ష్మిని అభినందించారు. శ్యాంబాబు మంచి ఛాయిస్ అన్నారు. వయోభేదం లెక్కలోకి రాదన్నారు. ఇద్దరి మనసులు కలవడమే ముఖ్యం అన్నారు. ఒకరికొకరు అపరిచితులు కాదు కూడా! బలాలూ, బలహీనతలూ తెలిసినవారు. క్లుప్తంగా చెప్పాలంటే వాళ్ళిద్దరినీ క్షణాల్లో దేవుడే కలిపాడని ఎవరికైనా అనిపిస్తుంది.

శ్యాంబాబు సెలూన్‌కి వెళ్లి ఉన్న కొంచెం జుట్టుని ట్రిమ్ చేయించాడు. మంగలి ప్రోద్బలంతో ఆ జుట్టుకి రంగు వేయించాడు. సాయంత్రం 'ట్రెండ్స్'కి వెళ్లి కొంచెం ఆధునికంగా కనపడే ప్యాంట్లు, షర్ట్‌లు నాలుగుజతలు తీసుకున్నాడు. ఇరవైవేల రూపాయల బిల్లుని డెబిట్ కార్డుతో చెల్లించి బయటపడ్డాడు. పెళ్ళిచేసుకుంటే భార్యని, రెడీమేడ్ కొడుకుని తరచూ

హోటల్స్‌కి తీసికెళ్ళాల్సొస్తుంది కదా అని ముందుగా ట్రై చేద్దామని ఒక మంచి రెస్టారెంట్‌కి వెళ్ళి, తనకు పరిచయం లేని తిండిని ఆర్డర్ చేసాడు. వచ్చిందాన్ని అయిష్టంగానే కొంచెం కష్టపడి తిన్నాడు. ఇంటికి చేరి లక్ష్మికి ఫోన్ చేసాడు, తన కొనుగోళ్ల గురించి గొప్పగా చెపుదామని అనుకున్నాడు. లక్ష్మి ఫోన్ కలవలేదు.

చాలాసార్లు లక్ష్మికి ఫోన్ చేసాడు శ్యాంబాబు. నెట్‌వర్క్ పరిధిలో లేదని రికార్డెడ్ మెసేజ్ వచ్చింది. ఎక్కడికి వెళ్లిందో అర్థం కాలేదు. ఆ రాత్రి నిద్ర పట్టలేదు. మధ్య రాత్రి తర్వాత ఫోన్ చేయడం భావ్యం కాదనుకున్నాడు. పక్కమీద అటూ, ఇటూ దొర్లడంతోనే రాత్రి గడిచిపోయింది.

సరైన నిద్రలేక కావచ్చు, శ్యాంబాబుకి తలనొప్పి, కొద్దిగా వాంతి వస్తున్నట్టు అనిపించింది. బ్రెడ్ ముక్కలు రెండు కాఫీలో నంచుకుని తిన్నాడు. పది కావస్తుండగా డాక్టర్ దగ్గిరకి వెళ్ళాడు. డాక్టర్ శ్యాంబాబు వివరాలు తెలుసుకుని బీపీ చూసాడు.

“శ్యాంబాబుగారు మీకు బీపీ ఇంతకు ముందే ఉన్నదా?” అడిగాడు డాక్టర్.

“లేదు సార్!”

“ఇప్పుడు బీపీ ఎక్కువగా ఉంది. ఏదైనా టెన్షన్ పడుతున్నారా?”

“టెన్షన్ లోపల ఉండి ఉంటుంది డాక్టర్ గారూ! రాత్రి నిద్ర పట్టలేదని చెప్పా కదా!”

“ఇప్పుడు మీరు సీనియర్ సిటిజెన్ అయ్యారు. టెన్సన్స్ ఏవీ పెట్టుకోకూడదు. ఇప్పుడు రెండు మెడిసిన్స్ రాస్తాను. ఒకటి రెండు రోజుల్లో యీసిజీ, టూడీ ఎకో, స్ట్రెస్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్ చేయించుకోండి. ఆ రిపోర్ట్స్ తీసుకుని కలవండి!”

అయిష్టంగానే తలూపి బయటపడ్డాడు శ్యాంబాబు.

అరవై దాటింది కాబట్టి ఇక హాస్పిటల్ ఫైల్స్ పట్టుకుని తిరగాల్సి వస్తుందేమోనని కొంచెం గాభరా పడ్డాడు. బీపీ పెరగడానికి కారణం బహుశా రాత్రి లక్ష్మి ఫోన్ ఎంతకీ కలవకపోవడం వల్లనే కావచ్చు. పెళ్ళిచేసుకుంటే, ఇలాంటివి రోజూ, ఏదో ఒకటి జరిగి టెన్షన్ పడాల్సి వస్తుందేమో? అందర్నీ టెన్షన్ పెట్టాల్సి వస్తుందేమో? బీపీ తగ్గుతుందో, లేదో? ఇప్పటివరకూ ఎలాంటి రోగాలూ లేకుండా ఉన్న తనకి యీ భవబంధాలు ఏం రోగాలు తెస్తాయో? సుఖంగా ఉన్న ప్రాణాన్ని ఉచ్చులోకి దించి తను ఇబ్బందులు పడుతూ, లక్ష్మిని ఇబ్బందులు పెడతాడేమో? ఈ వయసులో పెళ్ళి సమంజసమైన నిర్ణయమేనా? పెళ్ళిచేసుకున్నా, చేసుకోకపోయినా రోగాలు ఇకముందు పలకరించిపోతూనే ఉంటాయి. పెళ్ళిచేసుకున్నా ఒక తోడు ఉంటుంది!

తనకి తోడుకోసం నలభై ఏళ్ళ స్త్రీని ఇబ్బందుల్లోకి నెట్టేయడం సబబేనా?

ఆమెకి మాత్రం ఎవరున్నారు? ఆమెకి మాత్రం రోగాలు రావా?

ఆమెకి కొడుకు, కూతురు ఉన్నారు. వాళ్ళు ఆమెకి సేవ చేస్తారు కానీ తనకెందుకు చేస్తారు? అసలు యీ పెళ్ళి వాళ్లకి ఇష్టం కాకపోవచ్చు కూడా!

రకరకాల ఆలోచనలతో శ్యాంబాబు మరింత టెన్షన్‌కి గురయ్యాడు. ఇప్పుడు పెళ్ళి వద్దని తను చెప్తే బాగుండదు. తామిద్దరూ మానసికంగా రెడీ అయిపోయారు. మరెట్లా?

మందులు కొనుక్కుని, పక్కనే ఉన్న శివాలయానికి వెళ్లి, 'మహేశ్వరా! నా పెళ్ళి విషయంలో నువ్వే సరైన దారి చూపించు! నేను తీసుకున్న నిర్ణయం సరైంది కాదేమోనని అనుమానంగా ఉంది. ప్లీజ్ హెల్ప్ చెయ్యి...' అని శివుణ్ణి వేడుకున్నాడు.

ఆలయం బయటికొచ్చాక ఒక్కరాత్రిలో తనలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపడ్డాడు. రోగం మనిషిలో ఇంత మార్పు తెస్తుందా? అదీ 'అబౌట్ టర్న్!'

ఇంటికి చేరి తల పట్టుక్కూర్చున్నాడు శ్యాంబాబు.

లక్ష్మికి మళ్ళీ ఫోన్ చేయలేదు. కొత్తబట్టలు కొనుక్కున్న విషయం, ఈ బీపీ గురించి, డాక్టర్ రాసిన టెస్ట్స్ గురించి చెప్పాలా, లేదా? చెప్తే తన ఆలోచన కూడా మారిపోవచ్చు కదా!

ఈ పెళ్ళి చేసుకోకుండా ఉంటేనే మంచిదేమో, ఇద్దరికీ!

ఇంతలో ఫోన్ మోగింది... లక్ష్మినుంచే! ఆత్రంగా మాట్లాడాడు, "లక్ష్మీ! రాత్రి చాలాసార్లు ట్రై చేశా. అవుట్ అఫ్ కవరేజ్ ఏరియా అని వచ్చింది..."

"అంకుల్ నేను లక్ష్మి కొడుకుని... మమ్మీకి ఒంట్లో బాగాలేదు, రాత్రి హాస్పిటల్‌లో చేర్చాను. మీకు ఫోన్ చేయమంది."

"ఏమైంది?"

"కళ్ళు తిరిగి పడిపోయింది. హైబీపీట... టెస్టులు చేస్తున్నారు!"

"ఏ హాస్పిటల్?"

"శ్రీకర్ హాస్పిటల్"

"నేను ఇప్పుడే వస్తున్నాను"

శ్యాంబాబుకి మతిపోయినట్లైంది. 'ఇద్దరికీ బీపీనే... ఇది అంత మంచి శకునంలా లేదు' అనుకున్నాడు.

శ్యాంబాబు శ్రీకర్ హాస్పిటల్‌కి చేరుకున్నాడు. రూమ్‌లో బెడ్ మీద పడుకుని దీనంగా కనిపిస్తున్న లక్ష్మిని చూసాడు. దగ్గిరకి వెళ్ళాడు. లక్ష్మి కొడుకు కుర్చీని జరిపి కూర్చోమన్నాడు. అతనికి లక్ష్మి ఏదో సంజ్ఞ చేసింది. అతను బయటికి వెళ్ళిపోయాడు.

"ఎందుకిలా అయింది లక్ష్మీ?"

లక్ష్మి మాట్లాడలేదు. కళ్ళంట నీళ్లు జలజలా రాలుతున్నాయి.

"సరేలే... జాగ్రత్తగా ఉండు. రాత్రి చాలాసార్లు ట్రై చేసాను. కలవలేదు. ఏమైందో అని భయపడ్డాను... భయపడ్డట్టే జరిగింది!"

"నా క్లోజ్ ఫ్రెండ్ ఫోన్ చేసింది... తనకి మన పెళ్ళి విషయం చెప్పాను."

"ఏమన్నదీ?"

"చాలా మాట్లాడింది. మనమధ్య ఏజ్ గ్యాప్ చాలా ఎక్కువ కదా అంది. మీరు చాలా ఆరోగ్యంగా, చురుగ్గా ఉంటారని చెప్పాను. ఒకరికి ఒకరు తోడు మాత్రమే అన్నాను."

లక్ష్మి మాట్లాడడం ఆపింది. శ్యాంబాబుకి టెన్షన్!

"ఇంకా చాలా చెప్పింది... అవన్నీ మీకు చెప్తే బాధపడతారు. దాని మాటలు విన్నాక కాబోలు, బీపీ పెరిగింది. కళ్ళుతిరిగి కింద పడ్డాను. కొంచెంసేపు ఏమీ తెలియలేదు. ఒళ్ళంతా వణుకుతున్నదని మా అబ్బాయి చెప్పాడు. వాడే ఈ హాస్పిటల్‌కి తీసుకొచ్చి అడ్మిట్ చేసాడు. అది సరే... మీరు అన్నిసార్లు ఫోన్ ఎందుకు చేశారు?"

"కొత్త బట్టలు కొనుక్కున్నానని చెప్పడానికి?' అని చెప్పాలనుకుని, "ఊరికే చేసాను, కాసేపు మాట్లాడచ్చని..." అన్నాడు.

చాలాసేపు ఇద్దరి మధ్య మౌనం నిలిచింది. రూమ్ బయట నర్సుల అరుపులు, పేషెంట్స్ పిలుపులు వినిపిస్తున్నాయి. డాక్టర్ వచ్చి లక్ష్మికి బీపీ చూసాడు.

"బీపీ ఇంకా తగ్గలేదు. ఏం ఆలోచిస్తున్నారు? ఏమన్నా టెన్షన్స్ ఉన్నాయా?" అడిగాడు డాక్టర్. అడ్డంగా తలూపింది. "సరే, రెస్ట్ తీసుకోండి" అంటూ డాక్టర్ బయటికి నడిచాడు.

"కొద్దిలో పెరాలిసిస్ నుంచి తప్పించుకున్నానని నర్స్ చెప్పింది!"

"అంతగా కలవరపెడుతున్న విషయం ఏమిటి లక్ష్మీ?"

లక్ష్మి మళ్ళీ మౌనం వహించింది.

నిజానికి రాత్రి లక్ష్మి ఫ్రెండ్ భయపెట్టింది. 'భర్త ఎటో వెళ్ళిపోయినా, ఎక్కడో బతికే ఉంటాడని పుణ్యస్త్రీలా ఉంటున్నావు. ఇప్పుడీ ముసలాయన్ని చేసుకుంటే, ఆయనకేదైనా జరగరానిది జరిగితే అనవసరంగా వైధవ్యాన్ని కొని తెచ్చుకున్నట్టవుతుంది కదా!' అంది.

ఆ మాట లక్ష్మి గుండెకి సూటిగా గుచ్చుకుంది.

కొద్దిసేపటి తర్వాత లక్ష్మి నెమ్మదిగా అంది, "మన పెళ్ళి కొంతకాలం వాయిదా వేద్దాం శ్యాంబాబుగారూ! మరింత ఆలోచించుకునే సమయం దొరుకుతుంది."

శ్యాంబాబుకి మాట పెగల్లేదు. నిజానికి ఈ పెళ్ళి ప్రతిపాదన తనలో కూడా లేనిపోని భయాందోళనలు కలిగించింది. వాయిదానే... నిజానికి అది రద్దు కావచ్చు... మంచిదనిపించింది!

"సరే లక్ష్మీ, నువ్వు పూర్తిగా రెడీ అయినప్పుడే చూద్దాం. నీకు ఏ అవసరం పడ్డా నన్ను గుర్తు చేసుకో!" అంటూ లేచాడు శ్యాంబాబు. గుండె మీదనుంచి ఏదో బరువు దింపినట్టనిపించింది.

ఆ రోజు సాయంత్రం రిపోర్ట్స్ తీసుకుని డాక్టర్‌ని కలిసాడు.

"రిపోర్ట్స్ అన్నీ నార్మల్‌గానే ఉన్నాయి. అయితే నార్మల్ రేంజ్‌లో హైలో ఉన్నాయి... జాగ్రత్తగా ఉండండి"

“సరే డాక్టర్ గారూ” అంటూ లేచాడు శ్యాంబాబు.

“నేను పనిచేసే హాస్పిటల్‌లో హెచ్ ఆర్ సూపర్వైజర్ పోస్ట్ ఖాళీగా ఉంది... మీరు చెయ్యగలరా?”

ఆశ్చర్యమూ, ఆనందమూ శ్యాంబాబుని చుట్టుముట్టేశాయి.

“చాలా థాంక్స్ డాక్టర్‌గారూ! జీవితానికి మళ్ళీ తోడు కల్పించారు!” అంటూ ఆయనకి కరచాలనం చేసి, ఆ గది నుండి బయటకు వస్తూ... కుడికాలు ముందు వేసి, ఒక్కసారి ఆ హాస్పిటల్‌ని ఆనందంగా కలయచూశాడు!

# మహర్దశ

దినవహి సత్యవతి

✆ 9790752180

*మా పెళ్ళి జరగకపోవడాన్ని దైవనిర్ణయంగా భావించి, నేనూ, ఇంద్ర మంచి స్నేహితులుగా కొనసాగుతున్నాము. మీరది అర్థంచేసుకుంటే చాలు. సందర్భం వచ్చింది కనుక ఇంకో విషయం చెప్పనా... జీవితంలో, ప్రతి ఒక్కరికీ, ఏదో ఒకనాడు, చావు దశ, మీ పరిభాషలో చెప్పాలంటే 'మారకదశ' తప్పక వస్తుంది. కానీ, నాలాగా, కన్నవారికి సేవ చేసుకోగలిగే మహర్దశ ఎంతమందికి పడుతుంది చెప్పండి!"*

*నాన్న చేయి నా చేతుల్లోకి తీసుకుని కించిత్ గర్వంగా అన్నాను.*

అర్ధరాత్రి దాటింది. అత్యవసరమైన ఆఫీస్ పని ముగించి, ఇలా మంచం మీద వాలానో లేదో అలా గాఢనిద్రలోకి జారుకున్న నేను, ఫోన్ శబ్దానికి ఉలిక్కిపడి లేచి టైం చూసాను.

తెల్లవారుఝాము రెండున్నర!

'ఈ సమయంలో ఎవరో?' అనుకుని "హలో" అన్నాను.

"అక్కా! నాన్న ఆరోగ్యం సరిగ్గా లేదు. ఆస్పత్రికి తీసుకెళుతున్నాను" తమ్ముడు కమల్ మాటలకి నిద్ర మత్తు వదిలి, "నిన్నటిదాకా బాగానే ఉన్నారుగా.. అంతలో ఏమైంది?" ఆందోళనగా అడిగాను.

"కాసేపటి క్రితం ఉన్నట్లుండి గుండె పట్టుకుని నొప్పి అన్నారు"

"అయ్యో అదేమిటిరా? ఇదిగో వెంటనే బయలుదేరతాను"

"అక్కా!" ఏదో చెప్పడానికి తటపటాయిస్తున్నాడు కమల్.

"ఏమైందిరా?"

"దయచేసి నువ్వు రావద్దక్కా!"

"నువ్వేనా ఇలా అంటున్నది!" కమల్ మాటలకి విద్యుదాఘాతం తగిలినట్లైంది.

"కాదక్కా! నాన్న... నిన్ను రావద్దని చెప్పమన్నారు!"

“ఎందుకని? హూ... పోనీలే నాన్న వద్దన్నారని మానేయకుండా చెప్పినందుకు థ్యాంక్స్! ఏం చేయాలో నేను ఆలోచించుకుంటాను. కానీ నాన్నని చేర్పించే ఆస్పత్రి వివరాలియ్యి చాలు” ఫోన్ పెట్టేసి, గబగబా బ్యాగు సర్ది, ఏదైనా బస్సు లేదా రైలులో టిక్కెట్లు దొరుకుతాయేమోనని ప్రయత్నం మొదలుపెట్టాను.


అప్పుడే, చటుక్కున, “ధాత్రీ, కొన్నాళ్ళు మీ పుట్టింటికి దూరంగా ఉండు” అని, కొన్ని రోజుల క్రితం, నా మిత్రుడు, ఇంద్ర చెప్పడం గుర్తొచ్చింది. అతని జ్యోతిష్యశాస్త్ర పరిజ్ఞానం గురించి నాకు బాగా తెలుసు.

“మరేదైనా అత్యవసర పరిస్థితి వస్తేనో?” సందేహం వెలిబుచ్చాను.

“అప్పుడు చూద్దాంలే, కానీ ప్రస్తుతానికి చెప్పినట్లు చెయ్యి!” అన్నాడు.

‘అప్పటివరకూ అతని మాట నేను త్రోసిపుచ్చింది లేదు. కానీ ప్రస్తుత పరిస్థితి వేరు. నాన్న నన్ను రావద్దని చెప్పడానికి కారణమేదైనా, వెళ్ళడం నా కనీస బాధ్యత. తప్పదు... కానీ ఆ రోజు ఇంద్ర చెప్పినట్లే, ఇప్పుడు నాన్న కూడా, నన్ను రావద్దనడం కేవలం యాదృచ్ఛికమా లేక...’ పరిపరివిధాలా ఆలోచిస్తూ హైదరాబాద్ బస్సెక్కాను.

★★★



మా తాతగారు మోతుబరి రైతు. ఆయన సంతానంలో నాన్నే పెద్ద కావడంతో, తాతగారు, నాయనమ్మ, కాలం చేసాక, కుటుంబభారం ఆయనపై పడింది. బాధ్యతలు నెరవేర్చే క్రమంలో, ఖర్చుల నిమిత్తమై అమ్ముకుంటూ వెళ్ళడంతో, తాతగారి యాభై ఎకరాల మాగాణీ కరిగి ఎకరం మిగిలింది.

నాన్నకి జాతకాల పైన కొంత నమ్మకం ఉండేది. నమ్మినవారికి నమ్మినంత అనీ, ఆయన అనుకున్నవి చాలామటుకూ జరిగాయి, ఒక్క విషయం తప్ప... అది ఆయన పెళ్ళి. జాతకం ప్రకారం, ఆయనకి త్వరగా పెళ్ళౌతుందని ఉందట. కానీ కుటుంబ బాధ్యతలన్నీ తీరేటప్పటికి ముప్పయ్యేళ్ళు నిండాయి. దాంతో, ఆయనకి పిల్లనివ్వడానికి, ముఖ్యంగా ఆరోజుల్లో కట్టుబాట్లని బట్టి, ఎవ్వరూ సుముఖత చూపలేదట! ఆఖరికి, ఎదురు ఖర్చులిచ్చి, అమ్మని చేసుకున్నారట. అలా ఆ విషయంలో ఆయన అంచనా తప్పిందట!

అమ్మానాన్నలకి నేనూ, కమల్ పుట్టాము. నాకు పదేళ్ళప్పుడు, అమ్మమ్మకి ఆరోగ్యం బాగుండలేదని చూడ్డానికి వెళ్ళిన అమ్మ శవమై తిరిగి వచ్చింది. నాన్న దుఃఖానికి అంతులేదు.

అంతే అప్పటి నుంచీ, ఎక్కువగా కాకపోయినా, జాతకాల గురించి మాట్లాడడం తగ్గించారు నాన్న!

డిగ్రీ పూర్తవగానే నాకు పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అన్నీ బాగున్నా కానీ ఎందుకో నా పెళ్ళి ఆలస్యమౌతూ వెళ్ళింది.

ఆలోగా ఒకనాడు, కమల్, తానొక అమ్మాయిని ప్రేమించానని చెప్పాడు.

“ఆ అమ్మాయి నక్షత్రం, పుట్టిన తేదీ, సమయం, ఊరు కనుక్కో, ఆలోచిద్దాం” అన్నారు నాన్న.

“నాకలాంటి వాటిలో నమ్మకం లేదు” అన్నాడు కమల్.

“జాతకాలు కనీస స్థాయిలోనైనా కలవాలిరా. నా మాట విను!” తమ్ముడికి నచ్చజెప్పాలని చూసారు నాన్న.

“ఏదేమైనా నేనా అమ్మాయినే చేసుకుంటాను” కమల్ తెగేసి చెప్పడంతో నాన్న మౌనం వహించారు.

తమ్ముడి పెళ్ళై పదేళ్ళయ్యింది. వాడికి ఇద్దరు పిల్లలు. మరదలు కూడా సంస్కారవంతురాలు. నాన్నని ఎంతో గౌరవంగా చూసుకుంటుంది.

తమ్ముడి పెళ్ళయ్యాక నాకో సంబంధం వచ్చింది. జాతకాలూ బాగా కలిసాయనీ, ఆరునూరైనా మా పెళ్ళి తప్పక జరుగుతుందనీ అన్నారు నాన్న.

కానీ, చాలా విషయాలలో నాకూ, అతనికీ పొంతన కుదరక మా పెళ్ళి జరగలేదు. నాన్న క్రుంగిపోయారు. తనలో తనులా అయిపోయారు. నాకు ముప్పై ఐదేళ్ళ వయసు వచ్చినా, ఇంకా పెళ్ళి సంబంధాలు చూస్తున్న నాన్నతో, తమ్ముడితో, “ఇక మీ ప్రయత్నాలు మానుకోండి. మీరు చూసినా నేను చేసుకోను” కచ్చితంగా చెప్పేసాను.

నా దగ్గరికి వచ్చి ఉండమని ఎంత బ్రతిమిలాడినా, “అలవాటైన చోటు వదిలి రాలేనమ్మా! నువ్వే వీలైనప్పుడల్లా వచ్చి వెళ్ళు” అనేసారు నాన్న.

అలా తమ్ముడి దగ్గర హైదరాబాద్‌లో నాన్న, ఖమ్మంలో ప్రభుత్వోద్యోగిగా నేనూ, స్థిరపడ్డాము.

రోజుకొక్కసారైనా నాన్నతో వీడియో కాల్ చేసి మాట్లాడుతుంటాను.

'నిన్న మాట్లాడినప్పుడు బాగానే ఉన్నారు మరి. ఇంతలోనే ఏమిటో ఇలా...' ఆలోచనలలో ఉండగా 'ధఢేల్'మన్న శబ్దంతో బస్సు ఆగిపోయింది.

ప్రయాణికులందరి తలలూ ముందున్న సీటు కడ్డీలకి కొట్టుకున్నాయి. అదృష్టవశాత్తూ ఒళ్ళో పెట్టుకున్న బ్యాగుపై తలవాల్చి ఉండడంవల్ల, నేను ఇనపకడ్డీ దెబ్బ తప్పించుకోగలిగాను.

డ్రైవర్‌కి గుండెనొప్పిగా అనిపించి బస్సుని ఆపబోయే ప్రయత్నంలో డివైడర్‌ని గుద్దాడని తెలిసింది. వెంటనే ఆంబులెన్స్ పిలిపించి డ్రైవర్‌ని ఆస్పత్రికి తీసుకుని వెళ్ళారు.

'భగవంతుడా అతన్ని కాపాడు' మనసులోనే ప్రార్థించాను.

కాసేపట్లో అదే ట్రావెల్స్ కంపెనీది మరొక బస్సు వచ్చింది మా కోసం! బస్సు మారుతుంటే మోకాలు నెప్పి అనిపించింది. ఇనపకడ్డీ నుంచి తల తప్పించుకున్నా, కాలు ముందు సీటుకి గుద్దుకున్నందువల్ల దెబ్బ తగిలుంటుందని ఊహించాను. ప్రాణగండం తప్పినందుకు సంతోషించాను. నిర్ణీతసమయం కంటే గంట ఆలస్యంగా హైదరాబాద్ చేరాను.

బస్సు దిగి సరాసరి ఆస్పత్రికి వెళ్ళాను. వస్తానని అనుకోలేదేమో, నన్ను చూడగానే, ముందు కంగారుపడ్డా, తరవాత ఆ పరిస్థితిలో తనకో తోడు దొరికిందని తేలికపడ్డాడు కమల్.

"ఏమైందక్కా కుంటుతున్నావు?" నా నడకలో తేడా గమనించి అడిగాడు.

అప్పటి మా పరిస్థితిలో బస్సు ఉదంతం చెప్పి, తమ్ముడిని ఇంకా కంగారు పెట్టడమెందుకని, "బస్సులో కాళ్ళు వ్రేలాడేసి కూర్చున్నాను కదా, మోకాలు పట్టింది అంతే!" అన్నాను.

"నాన్న వద్దన్నా ఎందుకొచ్చావక్కా?" రవంత కోపంగా అడిగాడు.

"రాకుండా ఉండలేకపోయానురా"

"అదికాదక్కా..."

"అసలు నాన్న నన్నెందుకు రావద్దన్నారు? నీకేమైనా చెప్పారా?"

"ఆ..." నెమ్మదిగా గొణిగాడు.

"నాకెందుకు చెప్పలేదు?"

"అది నీకు చెప్పేది కాదన్నారు"

"ఏమిటో అంత దాచాల్సిన విషయం?"

"నాన్నకి గుండెపోటు వచ్చింది. గుండెలో బ్లాక్స్ ఉన్నాయి. బైపాస్ సర్జరీ చెయ్యాలి.. లోపల ఐ.సి. లో ఉన్నారు. ఓ గంటలో చేస్తారు!" భయపడుతూ అన్నాడు.

ఒక్కసారిగా విస్తుపోయాను. "అంత సీరియస్ విషయం నువ్వైనా చెప్పాలి కదరా" నిష్టూరంగా అన్నాను.

"అది సరే! అక్కా... ప్లీజ్ నువ్వెళ్ళిపో, నాన్నకి తెలిస్తే నన్ను కోప్పడతాడు"

"ఏంటిది కమల్? ఇలాంటప్పుడు మిమ్మల్ని విడిచి వెళ్ళమంటావా?"

"నా మాట వినక్కా" బ్రతిమలాడాడు.

"నీ భయానికి కారణం చెప్పు ముందు" గద్దించి అడిగాను.

"జాతకం ప్రకారం, నాన్నకీ నీకూ కూడా దశ బాగోలేదట. అందుకని ఇద్దరూ ఒక చోట ఉండకూడదన్నారు"

నాకూ దశ బాగోలేదన్న మాట వినగానే బస్సు ప్రమాదం గుర్తొచ్చింది.

"అయితే? అసలు దశ బాగోకపోవడానికీ, నేను రావడానికీ మధ్య సంబంధం ఏమిటిట?"

"అలా ఇద్దరి దశలు బాగోలేనప్పుడు, ఎవరి జాతకమైతే బలహీనంగా ఉంటుందో వాళ్ళకి ప్రాణగండం ఉంటుందట. ప్రస్తుతం ఆయన జాతకం, నీ జాతకంకంటే బలంగా ఉన్నదట. అందువలన నీకేదైనా కీడు జరుగుతుందేమోనని భయపడుతున్నారు"

"నేనిలాంటివన్నీ నమ్మను"

"నేనూ నమ్మను. కానీ ఆయనతో వాదనెందుకని ఊరుకున్నాను. పైగా నువ్వలా అంటే కనుక నీకింకో విషయం కూడా గుర్తు చెయ్యమన్నారు!"

"ఏంటది?" సందేహంగా చూసాను.

"ఒకసారి అమ్మమ్మకి సీరియస్‌గా ఉంటే చూద్దామని అమ్మ వెళ్ళింది గుర్తుందా?"

"అదెలా మర్చిపోగలను? అప్పుడు చనిపోతుందనుకున్న అమ్మమ్మ కోలుకుంది, ఆరోగ్యంగా ఉన్న అమ్మ మాత్రం పోయింది" అమ్మ గుర్తొచ్చి కళ్ళు చెమ్మగిల్లాయి.

"అప్పుడు నాన్నకది తెలుసట. కానీ కన్నతల్లి చావు బ్రతుకుల్లో ఉంటే అమ్మని వెళ్ళొద్దనడం ధర్మం కాదని మౌనంగా ఉండిపోయారట"

"నిజమే కదా మరి!"

"ఇప్పుడు మళ్ళీ ఆయన అలాంటి పరిస్థితిలోనే ఉన్నానన్నారు. అక్కకి జీవితమంతా ముందే ఉందనీ, కనుక ససేమిరా ఇక్కడికి రావద్దనీ చెప్పమన్నారు" కమల్ గొంతులో దుఃఖం.

“అది ఆయన నమ్మకం. దాన్ని నేను గౌరవిస్తాను. అదే సమయంలో నాన్న ఇలాంటి పరిస్థితులలో ఉన్నప్పుడు, దశ బాగోలేని కారణాన నాకేదో అవుతుందని భయపడి అక్కడ కూర్చోలేను. అన్నిటికీ ఆ భగవంతుడే ఉన్నాడు. ఇక్కడికి రావడం కేవలం నా నిర్ణయం” తమ్ముడికి ధైర్యం చెప్పి సాంత్వన పరిచాను.

“సరే నీ ఇష్టం. ఇప్పుడెలాగూ లోపలకి వెళ్లనివ్వరు. నువ్వు ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకో, ఇక్కడ నేనుంటాను.”

“ఆపరేషన్ మొదలవగానే ఫోన్ చెయ్యి” కొంత డబ్బు వాడికిచ్చి, ఇంటికి వెళ్ళి, మరదలిని, పిల్లల్ని పలకరించి, వేడివేడి కాఫీ త్రాగి, ఫ్రెష్ అయ్యాను.

ఇక్కడికి బయలుదేరే ముందు, పరిస్థితి వివరిస్తూ ఇంద్రకి మెసేజ్ పెట్టాను.

నా మెసేజ్ చూసాడేమో, ఫోన్ చేసి, “ధాత్రీ! అంకుల్ ఎలా ఉన్నారు?” ఆదుర్దాగా అడిగాడు.

నాన్నకి గుండెపోటు వచ్చిన విషయం, ఆయన నన్ను రావద్దనడం, బస్సు ప్రమాదం... అంతా చెప్పి, “నాన్నలాగే నువ్వూ భయపడుతున్నావా నాకేమైనా అవుతుందని, ఆ రోజు నువ్వలా అనడానికి అదే కారణమా?” అని అడిగాను.

కొంత నిశ్శబ్దం తరవాత, “అవును” నెమ్మదిగా అన్నాడు.

“నీ మాటనెప్పుడూ గౌరవిస్తాను. కానీ ఈ విషయంలో స్వార్థపరురాలిని కాలేను. నన్ను మన్నించు” అన్నాను.

“నువ్వేంటో నాకు తెలుసు. మనందరినీ కాపాడే భగవంతుని మీద నమ్మకం ఉంచు. నువ్వు జాగ్రత్త. వీలైనప్పుడు ఫోన్ చెయ్యి” ఇంద్ర ఫోన్ పెట్టేసిన చాలాసేపటివరకూ ఆలోచిస్తూ ఉండిపోయాను.

ఇంతలో “నాన్నని ఆపరేషన్ థియేటర్ లోకి తీసుకెళ్ళారు” కమల్ ఫోన్ చేసాడు.

ఆపరేషన్ దిగ్విజయంగా జరిగి, నాన్న ప్రాణగండం నుంచి బయటపడ్డారు. నాన్నని ఐ.సి.యు. లో ఉంచారు. ఆ మర్నాటికిగానీ మాకు నాన్నని కలుసుకునే అవకాశం రాలేదు.

“అక్కా, ముందుగా నువ్వెళ్ళి చూసిరా” అన్నాడు కమల్.

“వద్దు నువ్వే వెళ్ళు. నన్ను చూస్తే వద్దన్నా వచ్చానని కంగారుపడగలరు”

నాన్నని పలకరించి వచ్చి, “ఇక నువ్వెళ్ళు. నాన్నకి చెప్పానులే” అన్నాడు కమల్.

నేను లోనికి వెళ్ళేటప్పటికి, నాన్న సన్నగా గుర్రుపెడుతున్నారు. లేపడమెందుకని, చూసి వచ్చేసాను.

మర్నాడు చూడ్డానికి వెళ్ళినప్పుడు, ఏదో అనబోతే, “ఇప్పుడేమీ చెప్పద్దు. విశ్రాంతి తీసుకోండి.” అన్నాను.

సాలోచనగా చూసారు.

నాలుగు రోజుల తర్వాత నాన్నని స్పెషల్ రూమ్‌లోకి మార్చారు. కమల్ నాన్నకి భోజనం తేవడానికి ఇంటికి వెళ్ళాడు.

“ఇప్పుడెలా ఉంది?” నాన్న చెయ్యి నిమురుతూ అడిగాను.

నాన్న కళ్ళల్లోంచి జలజలా కన్నీళ్ళు రాలాయి. మౌనంగా, నా చేతిని ప్రేమగా నొక్కారు.

“నాకు తెలుసు మీరేమి ఆలోచిస్తున్నారో...” అన్నాను.

నాన్న ఏదో అనబోతుంటే, “మీరేమీ చెప్పొద్దు. నేను చెప్పేది వినండి చాలు. మీ నమ్మకాలు మీవి. నా విశ్వాసం నాది. ఈ వయసులో మీకు తోడు నిలవడం నా బాధ్యత! దశ బాగోలేదని భయపడి బాధ్యతను విస్మరించలేను!”

“అయితే జాతకాలలో చెప్పినది జరగదంటావా?” అన్నారు అమాయకంగా.

“అది నాకంటే మీకే బాగా తెలుసు. మీకు గుర్తుందా, ఒకసారి నాకు మంచి సంబంధం వచ్చింది. అతని పేరు ఇంద్ర. జాతకరీత్యా మాకిద్దరికీ బాగా కుదిరిందనీ, మా పెళ్ళి తప్పక జరుగుతుందనీ అనుకున్న మీరు, అలా జరక్కపోయేటప్పటికి బాధపడ్డారు!”

“అవును. ఇప్పటికీ బాధపడుతున్నాను” దిగులుగా అన్నారు.

“ఈ జాతకాలపై మీ నమ్మకం, నా విశ్వాసం... వీటన్నిటినీ మించినది ఒకటుంది. అదే దైవబలం! అది లేకుంటే ఏదీ జరగదు. ఇవాళ ఆ దైవబలమే మనల్ని కాపాడింది. బహుశః ఆ దైవబలం లేకనేనేమో ఇంద్రతో నా పెళ్ళి జరగలేదు! అయినా ఇప్పుడేమైందని? పెళ్ళే జీవితపరమార్థం కాదు కదా! మా పెళ్ళి జరగకపోవడాన్ని దైవనిర్ణయంగా భావించి, నేనూ, ఇంద్ర మంచి స్నేహితులుగా కొనసాగుతున్నాము. మీరది అర్థంచేసుకుంటే చాలు. సందర్భం వచ్చింది కనుక ఇంకో విషయం చెప్పనా... జీవితంలో, ప్రతి ఒక్కరికీ, ఏదో ఒకనాడు, చావు దశ, మీ పరిభాషలో చెప్పాలంటే ‘మారకదశ’ తప్పక వస్తుంది. కానీ, నాలాగా, కన్నవారికి సేవ చేసుకోగలిగే మహర్దశ ఎంతమందికి పడుతుంది చెప్పండి!” నాన్న చేయి నా చేతుల్లోకి తీసుకుని కించిత్ గర్వంగా అన్నాను.

నా చేతిని అలాగే పట్టుకుని, నిశ్చింతగా కళ్ళు మూసుకున్న నాన్న కనుకొలుకులనుంచి ఆనందబాష్పాలు జాలువారాయి.

# సమ్మతమే

తెలికచర్ల విజయలక్ష్మి
✆ 9301421243

***నిండా పదిహేనేళ్లు కూడా లేని నువ్వు పురిటి నొప్పులతో ప్రాణభయంతో ఏడుస్తుంటే నీకు ఆపరేషన్ చేయించి నిన్నూ, నీ కూతుర్ని బతికించాను. చంటిపిల్లను చేతిలో పట్టుకుని ఎక్కడకు వెళ్ళాలో తెలియక బిత్తర చూపులు చూస్తున్న నిన్ను చూసి, అలా వదిలెయ్యలేక ఇంటికి తీసుకువచ్చి తప్పు చేశాను. బురదలో మురిగిన నిన్ను అందలం ఎక్కించాలని అనుకున్నాను. నా మనవరాలు వయసుదానివి. కుక్కలు చింపిన విస్తరైన నీజీవితాన్ని సరిదిద్దుదామని అనుకోవటం నాతప్పు!***

"పేషంట్ మనుషులు ఎవరున్నారు ఇక్కడ?" అంటూ నర్స్ అడిగిన ప్రశ్నకు బిజిలీ, "నేనున్నాను సిస్టర్! ఇప్పుడతనికి ఎలా ఉందీ?" అంటూ ఆత్రుతగా ప్రశ్నించింది.

"మిమ్మల్ని డాక్టర్‌గారు రమ్మంటున్నారు!" అంటున్న నర్స్ వెనకాలే అడుగులు వేసుకుంటూ బెంగగా డాక్టర్‌గారి రూమ్‌కి చేరుకుంది బిజిలీ.

"పేషెంట్ తలకు తగిలిన గాయం వలన అధిక రక్తస్రావం అయింది. రక్తం ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాం!" అంటున్న డాక్టర్ మాటలకు భయపడుతూ... "ప్రాణభయమా డాక్టర్‌గారూ?" అంది బెంగగా బిజిలీ.

"ప్రాణభయం లేదు! మీరు వెంటనే తీసుకురావడం మంచిదైంది!" అంటున్న డాక్టర్ మాటలకు ఊపిరి తీసుకుంది.

అమెరికాలో ఉన్న రామనాథంగారి అబ్బాయి విజయ్‌కి ఫోన్ చేసి, "అన్నా! రాత్రి స్నానాల గది నుంచి దబ్బున పడిన శబ్దం వినిపిస్తే, వెంటనే వెళ్ళి చూసాను. బాబుగారు, అక్కడ పడి ఉన్నారు. తలకి బలంగా గాయమైంది. వెంటనే హాస్పటల్‌కి తీసుకువెళ్ళాను!" అంటూ విషయం అంతా చెప్పింది బిజిలీ.

"ఎలా ఉన్నారు నాన్న?" టెన్షన్ పడుతూ అడిగాడు విజయ్.

"ప్రాణభయం లేదన్నారు. వీలైతే మీరు రాగలరా?" అంది బిజిలీ.

"వస్తానమ్మా! తమ్ముడికి ఈ సంగతి చెప్తాను. నేను కూడా, నాన్నగార్ని చూసి రెండు సంవత్సరాలు దాటింది. ఆయన గురించి నాకూ బెంగగా ఉంటోంది. వారం రోజుల్లో బయలుదేరి వస్తాం. నాన్నగారిని జాగ్రత్తగా చూసుకో. నీ ఆరోగ్యం జాగ్రత్త!" అంటూ ఫోన్ పెట్టేసిన విజయ్, 'బిజిలీ తోడుగా ఉంది కాబట్టి సరిపోయింది. లేకుంటే... నాన్న, ఒక్కళ్ళే ఆ పరిస్థితిలో ఏమై ఉండేవారో' అనుకుంటూ ప్రయాణానికి సెలవు, టికెట్స్ చూసుకునే పనిలో పడ్డాడు.

బాబుగారితో ముడిపడిన తన జీవితాన్ని తల్చుకుంటూ...'అతనే నాకు అండగా లేకపోయి ఉంటే నా జీవితం ఏమై ఉండేదో? ఎక్కడో ఎంగిలాకులా పడి ఉండవలసిన నన్ను తెచ్చి, అందలం ఎక్కించిన బాబుగారికి నేను ఏమి చేసినా ఋణం తీరదు!' అనుకుంటూ పాదాలు ఒత్తుతున్న బిజిలీకి కన్నీళ్ళు ధారగా కారుతున్నాయి.

★★★



ట్రైన్‌లో పాటలు పాడుతూ, మెరుపుతీగలా డాన్సులు వేస్తూ అడుక్కునే అమ్మాయిని ఎవరో 'బిజిలీ' అంటూ పిలిచారు. అలా బిజిలీ అనే పేరు స్థిరపడిపోయింది ఆ చిన్నారికి!

చెకింగ్ స్టాఫ్ రామనాథం, ఎప్పుడు డ్యూటీలో ఉన్నా బిజిలీ ఎదురైనప్పుడు ఆ అమ్మాయి చేత పాటలు పాడించుకొని పది రూపాయలు ఇచ్చేవాడు.

"టీటీబాబు!" అంటూ పిలిచే బిజిలీకి, ఎదురైనప్పుడల్లా బ్రెడ్, బిస్కెట్లు కొని ఇస్తూ... "మీ గ్యాంగ్ అందరూ పంచుకుని తినండి!" అంటూ ఇచ్చేవాడు ఆయన.

బిజిలీ పెద్దది అవుతోంది. లేలేత బుగ్గల్లో మెరుపులు, వయసు తెచ్చే వన్నెలతో అందరి కళ్ళూ ఆ చిన్నారిపై ఉండేవి. తెలిసీ తెలియని వయసు ఎవరో ఎరవేసేరు. ఎరలో చిక్కుకుంది చేపపిల్లలా! ఎక్కడికో తీసుకువెళ్లారు. చిత్రక్షోభలే పెట్టేరు. రెండు సంవత్సరాలు గడిచేయి. తన శరీరంలో వస్తున్న మార్పులను గమనించింది. ఆకారం దాల్చుకోని రక్తం ముద్దపై మమకారం పెరిగింది ఆ చిన్నారికి. ఇక్కడే ఉంటే ఆ రక్తంముద్దకు ఊపిరే లేకుండా చేస్తారు. ప్రాణంతో భూమి మీదకు రానివ్వరు!' అనుకుని ఎలాగో అక్కడనించి తప్పించుకుంది. ఎక్కడెక్కడో తిరుగుతూ చివరకు చిన్ననాటి స్నేహితులందరూ ఉండే చోటికే చేరుకుంది. తోటి స్నేహితులు ఎవరూ కనిపించలేదు. కడుపులో బిడ్డ ఆకలితో తంతూ ఉంటే... తట్టుకోలేక స్టేషన్‌లో అడుక్కోవడానికి ప్రయత్నించేది. తననీ, ముందుకు తన్నుకు వచ్చిన తన పొట్టను చులకనగా చూస్తూ అందరూ వెళ్లిపోతుంటే 'ఈ ఆకలి బాధను

తట్టుకోలేకపోతున్నాను. రక్షించు తండ్రీ!' అంటూ ఆ భగవంతుడిని వేడుకుంటూ... అప్పుడే డ్యూటీ దిగి స్టేషన్ బయటకు వస్తున్న రామనాథాన్ని చూసి, "టీటీబాబూ!" అంటూ పిలిచింది బిజిలీ.

పరిచయమున్న స్వరంలా అనిపిస్తుంటే, వెనక్కి తిరిగి చూసి, చేయి చాచిన అమ్మాయిని తేరిపార చూసాడు.

బిజిలీ, కళ్ళెత్తి టిటి బాబువైపు చూడలేకపోయింది. ట్రైన్‌లో పిల్లలందరితో పాటూ పాటలు పాడుతూ అడుక్కోటానికి వచ్చే ఆమెని గుర్తు పట్టాడు టీటీబాబు. పలకరించబోయి, ముందుకు పొడుచుకు వచ్చిన ఆమె పొట్టను చూసి, వంద రూపాయలు ఆమె చేతికిచ్చి ఇంటిదారి పట్టాడు.

ఆ బాబు, ఇచ్చిన డబ్బును ఆప్యాయంగా చూస్తూ... 'ఎవరో మూటకట్టిన ఈ పాపానికి మీరు కడుపునిండా అన్నం పెడుతున్నారు బాబూ!' అనుకుంటూ పొట్ట తడుముకుంటూ కాంటీన్‌లో కూర్చుని కడుపునిండా భోజనం చేసింది బిజిలీ!

★★★

స్టేషన్ బయట పెద్ద చెట్టు కింద కూర్చున్న బిజిలీకి, కడుపులో సూదులు గుచ్చినట్టు నొప్పిగా ఉంది. నొప్పులబాధకు తోడు ఎండ ఎక్కువ అవడంతో గొంతుపిడచ కట్టుకుపోతోంది. ఆ బాధను తట్టుకోలేక ఎలా ఉంటుందో తెలియని అమ్మని తలుచుకుంటూ ఆ అనాథ 'అమ్మా!' అంటూ అరుస్తూ, ఏడుస్తోంది. దూరంగా అడుక్కోవటానికి కూర్చున్న ముసలమ్మను పిలుస్తూ, "నొప్పిగా ఉందే! భరించలేక పోతున్నాను" అంటూ ఏడ్చింది.

"ఒళ్ళు కొవ్వెక్కి, మగాడిపక్కన పడుకున్నప్పుడు బాధ తెలియలేదా?" అంటూ తిట్టిన ముసలామె వెళ్ళిపోయింది.

'ఎవరైనా దగ్గరకు వస్తే బాగుండును. ఈ బాధను తీరిస్తే బాగుండును!' అనుకుంటూ ఏడుస్తూ చుట్టుపక్కల చూసింది.

స్టాండ్‌లో స్కూటర్ పెడుతున్న టీటీ బాబుని దూరం నుంచి చూసింది బిజిలీ. మనసు పొరలలో చిన్న ఆశ కలుగుతుంటే, 'దయగల బాబు ఆదుకుంటే బాగుండును. ఏదైనా మంచి సూదిమందు ఇప్పిస్తే బాగుండును!' అనుకుంటూ అంత బాధలోనూ గొంతు ఎత్తి, "టీటీ బాబూ!" అంటూ అరిచింది.

బిజిలీ కేక విన్న రామనాథం, స్కూటర్ వదిలి ఆమె వద్దకు చేరుకున్నాడు. దయనీయ పరిస్థితిలో ఉన్న ఆ పిల్లను చూస్తుంటే... మనసు ద్రవించింది. బిజిలీకి దగ్గరగా వెళ్ళి, "హాస్పటల్ తీసుకువెళ్ళనా?" అని అడిగాడు.

"ఈ బాధ తట్టుకోలేకపోతున్నాను బాబూ!" అంటూ చెయ్యి పట్టుకుని ఏడుస్తున్న ఆ పిల్లకు ధైర్యం చెప్తూ, ఆటోని పిలిచి, చెయ్యి పట్టుకుని ఆటో ఎక్కిస్తుంటే, చెప్పులు కుట్టే అబ్బాయి వచ్చి, "మీకెందుకు బాబూ ఈ బాధలు? వీళ్ళకి ఇలాంటివి మామూలే!" అంటూ ఎగతాళిగా అంటున్న అతగాడి మాటలు పట్టించుకోకుండా బిజిలీని హాస్పటల్‌కి తీసుకువెళ్ళాడు.

బిజిలీని పరీక్షించిన డాక్టర్, "ఇంత చిన్నపిల్ల గర్భవతి ఏంటి? వీళ్ళ పేరెంట్స్ ఎక్కడ? ఆ అమ్మాయి ప్రాణానికి ప్రమాదం అని ఆలోచించలేదా?" అని కేకలేస్తుంటే, "ఆ అమ్మాయి ఒక అనాథ! ఎవరి పాపానికో చిన్న వయసులో గర్భవతై, చావుబతుకుల్లో విలపిస్తోంది. మీరు త్వరగా ఆమెకు వైద్యం చేసి బతికించండి. ఫీజ్ ఎంతవుతుందో అంతా నేను ఇస్తాను!" అంటున్న రామనాథం మాటలకు, వెంటనే సిజేరియన్ చేసి తల్లీ పిల్లను బతికించారు.

పది రోజుల తరువాత, తల్లీ పిల్లను తనతో పాటు ఇంటికి తీసుకువచ్చాడు రామనాథం. విశాలమైన ఇంట్లో అడుగు పెట్టటానికి భయపడింది బిజిలీ. ఇంట్లో పనమ్మాయి పొద్దున్నే వచ్చి పనులన్నీ చేసి, సాయంకాలం దాకా ఉండి వెళ్ళేది. ఒకరోజు మెల్లిగా అమ్మగారు కనిపించటం లేదేమని పనమ్మాయిని అడిగింది. "అమ్మగారు, ఈ మధ్యనే చనిపోయారు. పిల్లలిద్దరూ అమెరికాలో ఉంటున్నారు. బాబుగారు ఒక్కళ్ళే ఉంటున్నారు!" అని చెప్పింది పనమ్మాయి.

'అయ్యో! ఇంత మంచి బాబుగారు ఒంటరిగా అయిపోయారు!' అని బాధపడి, ఇంటిపని, వంటపని సాయం చేస్తూ. పాప మురిపాలతో పదిలంగా ఇంట్లో ఉన్న బిజిలీకి జీవితం హాయిగా అనిపిస్తోంది.

రామనాథం, ఇంట్లో ఉన్నంతసేపూ పేపర్ చదువుకుంటూ గంభీరంగా ఉండేవాడు. బాబుగారు, డ్యూటీకి వెళ్ళగానే, పనిమనిషి చెప్పే ఊసుపోని కబుర్లు వింటూ కూర్చునేది బిజిలీ. కబుర్లు చెప్తూ ఒకరోజు పనమ్మాయి, "నిన్ను బాబుగారు ఇక్కడ ఎందుకు ఉంచేరో తెలుసా?" అంది.

"నాకు తెలియదు, నీకు తెలిస్తే చెప్పు!" అంటూ అడిగింది బిజిలీ.

"బాబుగారి భార్య ఎలాగూ లేదు. మగాళ్లకు యాభై ఐదు ఏళ్ల వయసు పెద్ద వయసేమీ కాదు. నువ్వే అర్థం చేసుకుని అతనితో ప్రేమగా మసలుకున్నావంటే, నువ్వు ఇక్కడే శాశ్వతంగా సుఖంగా ఉండచ్చు!" అన్నమాట బిజిలీ బుర్రలో తిరుగుతోంది.

పిడికెడు ముద్దకు గతి లేక ఎంతమంది ముందు చెయ్యిచాచి అడుక్కోవలసి వచ్చేదో గుర్తువచ్చి భయం వేసింది. గడిచిన ఆ రోజుల కన్నా, బాబుగారికి ఇష్టమైనట్టు ఉండటమే మంచిది అనుకున్న బిజిలీ, గాఢనిద్రలో ఉన్న రామనాథం పక్కలో మెల్లిగా చేరింది. ఆడదాని స్పర్శకి తెలివి వచ్చింది రామనాథంకి. నిమిషంలో పరిస్థితి అర్థమై, చాచిపెట్టి లెంపకాయ కొట్టి, జుత్తు పట్టుకొని ఈడ్చి, పాపతో సహా బయటకు గెంటుతూ, "నువ్వు ఆడుతూ పాడుతూ ఉంటే ఆడపిల్లలు లేని నాకు, నీ మీద అభిమానం కలిగేది. నిండా పదిహేనేళ్లు కూడా లేని నువ్వు పురిటినొప్పులతో ప్రాణభయంతో ఏడుస్తుంటే నీకు ఆపరేషన్ చేయించి నిన్నూ, నీ కూతుర్ని బతికించాను. చంటిపిల్లను చేతిలో పట్టుకుని ఎక్కడకు వెళ్ళాలో తెలియక బిత్తరచూపులు చూస్తున్న నిన్ను చూసి, అలా వదిలెయ్యలేక ఇంటికి తీసుకువచ్చి తప్పు చేశాను. బురదలో మునిగిన నిన్ను అందలం ఎక్కించాలని అనుకున్నాను. నా మనవరాలి వయసుదానివి. కుక్కలు చింపిన విస్తరైన నీజీవితాన్ని సరిదిద్దుదామని అనుకోవటం నాతప్పు! ఛీ! ముందు ఇక్కడనుంచి వెళ్ళు!" అని, ఆమె ఏడుస్తూ బయటకు వెళ్ళిన తర్వాత తలుపులు మూసివేశాడు.

'అయ్యో, ఎంత పని జరిగింది? భగవంతుడిలాంటి బాబుగారిని తప్పుగా అర్థంచేసుకుని ఉన్న గూడు పోగొట్టుకున్నాను. ఈ పసిగుడ్డును పట్టుకొని ఎక్కడ తిరిగేది?' అనుకుంటూ రాత్రంతా అక్కడే అరుగు మీద కూర్చుని ఏడ్చింది బిజిలీ.

తెల్లవారుతోంది. పాప ఆకలికి గుక్కపట్టి ఏడుస్తోంది. పాపని అపురూపంగా చూసే రామనాథనికి ఆ ఏడుపు వినిపించి, మనసు కించిత్ బాధకు గురైంది. అయినా పట్టించుకోకుండా మంచం మీదనే ఉండిపోయాడు.

పనమ్మాయి వచ్చి, వాకిట్లో ఏడుస్తున్న బిజిలీని అడిగి విషయం తెలుసుకుంది. 'అయ్యో! నావలన ఎంత పొరపాటు జరిగింది? ఈపొరపాటును సరిదిద్దే పూచీ నాదే అనుకొని, "బాబుగారూ, మీరూ అందరి మగవాళ్ళలాగే అనుకున్నాను. తన స్థానం పదిలపరుచుకొమ్మని, నేనే బిజిలీకి ఆ పాపిష్టి సలహా ఇచ్చాను. నన్ను క్షమించండి! నేనే మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను. నేను చెప్పబట్టే బిజిలీ తప్పుగా ప్రవర్తించింది. వయసులో ఉన్న ఆడపిల్లను ఇంటికి తెస్తే ఎవరైనా

ఇలాగే తప్పుగా అర్థం చేసుకుంటారు. మీరు, అందరిలాంటి వారు కాదనే సంగతి మర్చిపోయాను బాబూ!" అంటూ రామనాథం కాళ్లపై పడి ప్రాధేయపడింది పనమ్మాయి.

"సరిసరి, బిజిలీని లోపలకి వచ్చి పిల్లకి పాలు కలిపి పట్టమని చెప్పు! ఏడ్చియేడ్చి పిల్లకి గొంతు ఎండుతుంది!" అంటున్న రామనాథం మాట వినగానే, పనమ్మాయి బిజిలీని పాపను లోపలకు తీసుకు వచ్చింది.

ఇంటికి టీచర్‌ని పిలిపించి, డిగ్రీదాకా చదివించేడు రామనాథం. ఒక తల్లిలా, కూతురులా వయసు పైబడుతున్న బాబుగారి అవసరాలు తీరుస్తూ, చదువు కొనసాగించింది బిజిలీ. అమ్మానాన్నలు ఎవరో తెలియకపోయినా ఉత్తమవిలువలు కలిగిన ఆదర్శమూర్తి నీడలో, కూతురితో పాటూ ప్రశాంతంగా బతుకుతూ, ఆ భగవంతుడికి ప్రతిరోజూ ధన్యవాదాలు చెప్పుకుంటుంది ఇరవై ఎనిమిది సంవత్సరాల బిజిలీ!

"మేడమ్, అతనికి తెలివి వచ్చింది. మిమ్మల్ని రమ్మంటున్నారు!" అంటున్న నర్స్ మాటలతో గతం తాలూకు ఆలోచనలు పక్కనపెట్టి... బాబుగారి దగ్గరకు చేరుకుంది. నీరసంగా తలపక్కకు పెట్టి నవ్వుతున్న అతన్ని చూసి... "బాబూ, మీకు ఏమీ కాదు. రేపు అన్నయ్యలు బయలుదేరి వస్తున్నారు!" అంది బిజిలీ.

"ఇలా కూర్చో, నీకు కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నాను!"

"చెప్పండి బాబుగారూ!" అంది బిజిలీ.

"నీ చదువు పూర్తయింది తల్లీ! నీ కాళ్ళ మీద నిలబడే శక్తి నీకు వచ్చింది! నా తరువాత కూడా నీ జీవితం స్థిరంగా ఉండాలని కోరుకుంటున్నాను!" అన్నాడు రామనాథం.

"నా జీవితాన్ని చక్కదిద్ది నన్ను మనిషిగా నిలబెట్టారు. మీరేం చేసినా నా మంచికే చేస్తారు బాబూ!" అంటూ తలదించుకుంది బిజిలీ.

"క్రితం సంవత్సరం మన ఇంటికి నా మేనల్లుడు వచ్చేడు గుర్తుందా?"

"గుర్తున్నారు బాబూ!" అంది బిజిలీ.

"నెలరోజుల క్రితం, పురిటిలోనే వాళ్ళ ఆవిడ చనిపోయింది. చంటిపిల్లతో ఇబ్బంది పడుతున్నాడు. నువ్వు నామాట కాదనవని నిన్ను పెళ్లి చేసుకొమ్మని, నీగురించి పూర్తిగా చెప్పాను. నీకు సమ్మతమైతే అతనికీ సంతోషమే అన్నాడు. మరి నీ ఇష్టం చెప్పు తల్లీ!" అడిగాడు రామనాథం.

"నా జీవితంలో పెళ్ళి అనే మాట హాస్యాస్పదమేమో బాబూ? నా పిల్లకు తండ్రి ఎవరో తెలియదు!" అంటూ దుఖాన్ని అపుకోలేకపోయింది బిజిలీ.

"నువ్వు ఒక ఇంటిదానివి అయితే నీ పిల్లకు తండ్రి, నీకు తోడు దొరుకుతుంది. నీ చేయి అందుకోవాలి అనుకున్నాడు ఉత్తముడు. నీ గతాన్ని గుర్తుచేయడు. ఇద్దరూ ఒకరికొకరు తోడు అవుతారు. నేను పెద్దవాడినైపోయాను. మంచివ్యక్తి చేతిలో నిన్ను పెడితే, నీ గురించి చింత ఉండదు!" అన్నాడు రామనాథం. సమ్మతమే అన్నట్టు బిజిలీ తల ఊపింది.

# చిలుక పలుకులు

కోనే నాగ వెంకట ఆంజనేయులు

✆ 9290660220

కథామంజరి బాలకథ

***"ఒరేయ్ రాజన్నా. ఈ చిలుక భలే ఉందిరా. పట్టుకుపోయి వేపుడు చేసుకుందాంరా" అన్నాడు ఒకడు. "వద్దులేరా రంగన్నా. అది మన పంటి కిందకు కూడా రాదు. ఈ దోచుకున్నవి చాల్లే" అన్నాడు రెండో దొంగ. తరువాత వాళ్ళు యిద్దరూ పెరటి గోడ దూకి పారిపోయారు.***

హేలాపురి సంతకు వెళ్లిన ముత్యాలు, అక్కడ ఓ చిలుకను చూసి ముచ్చట పడి, పది వరహాలకు దాన్ని బేరమాడి కొని తెచ్చుకుని, పంజరంలో ఉంచి ప్రేమగా పెంచుకోసాగేడు. నెమ్మదిగా దానికి మాటలు నేర్పించడంతో అది ఆ మాటలు విని తిరిగి ముద్దుగా పలకడం మొదలు పెట్టింది. అలా ఆ చిలుక తను విన్న మాటలను తిరిగి వల్లె వేస్తూ ఇంట్లో వాళ్లకూ, ఇంటికి వచ్చి వాళ్లకూ ఆనందం కలగజేయసాగింది.

ఓ సారి పండుగకు ఇంటికి తాళం వేసి ఇంటిల్లిపాదీ ముత్యాలు వాళ్ల అత్తవారింటికి బయలుదేరారు. వెళ్ళే ముందు, పంజరంలో చిలుకకు అవసరమైన గింజలూ, పళ్ళూ, మంచి నీళ్ళూ అందుబాటులో ఉంచాడు ముత్యాలు.

"రెండు రోజుల్లో తిరిగి వచ్చేస్తాం గానీ జాగ్రత్తగా ఉండు" అని చిలుకకు చెప్పి బయలుదేరి వెళ్ళిపోయారు అందరూ.

తాళం వేసి ఉన్న ఇంటిని చూసిన ఇద్దరు దొంగలు ఆ రాత్రి పెరటి తలుపులు తెరుచుకుని లోపలికి ప్రవేశించారు. పెట్టెలు గాలించి వాటిలో ఉన్న నగలూ, డబ్బు మూట కట్టుకుని వెళ్ళిపోతూ పంజరంలో ఉన్న చిలుకను చూశారా దొంగలు. "ఒరేయ్ రాజన్నా. ఈ చిలుక భలే ఉందిరా. పట్టుకుపోయి వేపుడు చేసుకుందాంరా" అన్నాడు ఒకడు.


"వద్దులేరా రంగన్నా. అది మన పంటి కిందకు కూడా రాదు. ఈ దోచుకున్నవి చాల్లే" అన్నాడు రెండో దొంగ. తరువాత వాళ్ళు ఇద్దరూ పెరటి గోడ దూకి పారిపోయారు.

మూడో రోజు ఉదయానికి ముత్యాలు కుటుంబంతో సహా ఇంటికి తిరిగి వచ్చాడు. తీరా చూస్తే ఇంట్లో దొంగలు పడి, పెట్టెల్లో దాచి ఉంచిన నగలు, డబ్బు దోచుకు పోయినట్టు గ్రహించారు. సొత్తు పోయిన బాధలో వాళ్ళు అందరూ బిగ్గరగా రోదించడం మొదలుపెట్టేరు. వాళ్ల రోదనలు విని చుట్టు పక్కల వాళ్ళు అక్కడ గుమిగూడి ఏమయిందని అడిగేరు.

తమ ఇంట్లో జరిగిన దొంగతనం గురించి చెప్పి బాధపడసాగేడు ముత్యాలు.

"అప్పుడు ఇంట్లో ఎవరూ లేరా?" అడిగేడు ఎదురింటాయన.

"మేము అందరం పండక్కి మా అత్తగారి ఊరు వెళ్లాం. మా పెంపుడు చిలక మాత్రమే ఉంది అప్పుడు ఇంట్లో" చెప్పేడు ముత్యాలు.



అదే సమయంలో ఆ చిలుక అక్కడ ఉన్న జనం వైపు చూసి 'రాజన్న, రంగన్న, రాజన్న, రంగన్న' అని పలకసాగింది.

ఆ చిలుక పలుకులు విని అక్కడ జనం మధ్యలో ఉండి ఇదంతా గమనిస్తున్న ఇద్దరు వ్యక్తులు మెల్లగా అక్కడి నుంచి వెళ్ళిపోవడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ళని చూసిన చిలుక 'రాజన్న, రంగన్న, రాజన్న, రంగన్న' అంటూ ఆపకుండా అరుస్తూనే ఉంది. దాంతో అక్కడ గుమిగూడి ఉన్న వాళ్ళకి ఆ ఇద్దరి మీద అనుమానం వచ్చింది. అందరూ కలిసి వాళ్ళిద్దరినీ బంధించి విచారిస్తే వాళ్ల పేర్లు రాజన్న, రంగన్న అని తేలింది. నలుగురు నాలుగు దెబ్బలు వేసే సరికి ముత్యాలు ఇంట్లో దొంగతనం చేసింది తామే అని ఒప్పుకొని ఆ నగలు, డబ్బు తీసుకు వచ్చి ముత్యాలుకి అప్పగించారు ఆ దొంగలు.

దొంగతనానికి వచ్చినప్పుడు వాళ్ళు ఒకరినొకరు పేరు పెట్టి పిలుచుకోవడం గమనించిన చిలుక వాళ్లను గుర్తు పట్టి ఆ పేర్లతోనే వాళ్లను పిలిచిందని గ్రహించాడు ముత్యాలు. మాటలు నేర్చిన చిలుక దొంగలను పట్టించిందని అందరూ దానిని గొప్పగా మెచ్చుకుని దొంగలను న్యాయస్థానానికి అప్పగించారు!

# జలనిధి

లక్ష్మీ గాయత్రి
✆ 6302555947

కథామంజరి బాలకథ

***మీ రాజు మంచివాడే గాని, ప్రకృతి సిద్ధమైన సహజ వనరుల్ని కాపాడుకోవడంలో అశ్రద్ధగా ఉన్నాడు. అందుకే మీకు కరువు వచ్చింది. ప్రస్తుతానికి ఆ నీరు దేశం నలుమూలలా చల్లండి. వెంటనే చెరువులూ నదులూ నిండుతాయి. వర్షాలు పడతాయి. అయితే ఇక మీదట మాత్రం మీరు చెరువుల్లో పూడిక తీస్తూ, బావులు తవ్విస్తూ, కాలుష్యం లేకుండా చూసుకుంటూ, మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి. అంతేగాని, మరోసారి ఇలా వస్తే, నిధి మాట అలా ఉంచి, అమ్మవారు కూడా కనబడదు నీకు. జాగ్రత్తగా వెళ్లు!"***

విదర్భదేశంలో ఒకసారి వరుసగా మూడేళ్ల పాటు చాలా పెద్ద ఎత్తున కరువు వచ్చింది. గిడ్డంగుల్లోని ఆహారధాన్యాలు పూర్తిగా ఖాళీ అయిపోయి, ఇరుగుపొరుగు దేశాల నుంచి తెప్పించడానికి అవసరమైన సొమ్ము ఖజానాలో లేక, ప్రజలు మలమల మాడిపోసాగారు.

ఇలా ఉండగా ఎవరో, "రాజధానికి ఉత్తరంగా ఉన్న కొండ మీద కాళీ ఆలయంలో ఉన్న నిధుల్ని ఎవరైనా కనిపెట్టగలిగితే బావుణ్ణు! మన దరిద్రం తీరిపోతుంది." అన్నారు.

ఆ మాట క్షణాల మీద రాజ్యమంతటా వ్యాపించింది. రాముడనే కుర్రవాడు ఆ మాట విని, ఆసక్తిగా వివరాలు సేకరించాడు. విదర్భకు ఉత్తరం వైపున్న యక్షిణీశైలం అనే కొండ మీద ఎప్పటిదో చాలా పురాతనమైన కాళీ ఆలయం ఒకటి ఉంది. యక్షులు ఆ ఆలయంలో అంతులేని నిధుల్ని దాచారని చెప్పుకుంటారు. అయితే ఏ కారణం చేతనో గాని ఆ కొండ మీదికి ఎవరూ వెళ్లరు.


అంతా విన్న రాముడు, దేశం కోసం నిధి సంపాదించాలని నిర్ణయించుకుని బయల్దేరాడు. వాడు కొండ మీదికి చేరేసరికి చీకటి పడింది. వెన్నెల వెలుగులో ఆలయానికి చేరుకున్న రాముడు, లోపల ఉన్న కాళీమాతకు భక్తిగా నమస్కారం చేశాడు.

తక్షణమే వెనుకనుంచి, "భక్తి అమ్మవారి మీదా... నిధి మీదా?" అన్న ప్రశ్న వినిపించింది.

రాముడు వెనుదిరిగి చూస్తే అక్కడ ఒక యక్షుడు కనిపించాడు. రాముడు అతనికి కూడా నమస్కారం చేస్తూ, "నిధి అవసరానికి! భక్తి ఎప్పుడూ దైవం మీదే!" అన్నాడు.

"శభాష్! నీ సాహసం, వినయం బాగున్నాయి. సరే చూద్దాం! నిధి సంపాదించాలంటే అమ్మవారి చేతి ఉంగరం కావాలి! ఊడబెరుక్కు రా మరి!" అన్నాడు.

"అవతలి వారు ఎవరైనా సరే అంత దురుసుగా ప్రవర్తించడం నాకు చేతకాదు. ఉంగరమే కావాలంటే తల్లిని ప్రార్థిస్తాను." అంటూ భక్తిగా కళ్లు మూసుకుని, చేతులు జోడించాడు రాముడు.



అంతలో యక్షుడే మళ్లీ, “నీ కోరిక న్యాయమైనదే గాని తీరా నిధి చేతికొచ్చాక నీలో స్వార్థం పుట్టదని నమ్మకమేమిటి. సంపద మహా చెడ్డది!” అన్నాడు

రాముడు చిన్నగా నవ్వి, “మీ మాట అక్షరాలా నిజమైనదే. పోనీ ఒక పని చెయ్యండి. నిధి నేరుగా మా రాజుగారి ఖజానాలో పడేలా చెయ్యండి. మీకు చేతగానిదేముంది!” అన్నాడు.

ఆ మాటకు యక్షుడు కూడా నవ్వి, “భళా! గొప్పవాడివిరా నువ్వు. సరే... ముందు ఉంగరం సంగతి చూడు!” అన్నాడు.

రాముడు మళ్లీ కళ్లుమూసుకుని, “అమ్మా, కాళీమాతా! మనిషి బతకడానికి ముఖ్యంగా కావలసినవి తిండీ, నీరూ! మా రాజ్యంలో పిల్లలూ, ముసలివాళ్లూ ఆకలిబాధతో విలవిల్లాడిపోతుంటే చూడలేక, నేనిలా వచ్చాను. మమ్మల్ని కరుణించి, మా దేశాన్ని సస్యశ్యామలం చెయ్యి!” అంటూ ప్రార్థించాడు.

మరుక్షణం కాళీమాత చేతి వేలికి ఉన్న బంగారు ఉంగరం ఎగిరొచ్చి రాముడి చేతిలో పడింది.

అది చూసి యక్షుడు నవ్వుతూ... “అమ్మను మెప్పించావు. బాగుంది. వెళ్లి ఆ ఉంగరాన్ని కోనేట్లో వెయ్యి” అన్నాడు.

రాముడు ఆ ప్రకారమే చేశాడు. ఉంగరం పడిన వెంటనే కోనేట్లోంచి ఒక గాజుసీసా బైటికి వచ్చింది. దాని నిండా నీళ్లున్నాయి. రాముడు ఆశ్చర్యంగా ఆ సీసాను యక్షుడికి చూపించాడు.

యక్షుడు నవ్వుతూ, "నిధికి బదులు నీరు వచ్చిందేమిటనా? మేం ఎవరికి ఏ నిధి అవసరమో అదే ఇస్తాం. అంతేగానీ రత్నాల పేరుతో రాళ్ళూ రప్పలూ కాదు. నీకు కావలసింది జలనిధి! గాజుసీసాను ఎంత పదిలంగా చూసుకుంటామో... భూమి మీది జలవనరుల్ని కూడా అంతే పదిలంగా చూసుకోకపోతే ఎవ్వరికైనా విపత్తు తప్పదు. మీ రాజు మంచివాడే గాని, ప్రకృతి సిద్ధమైన సహజవనరుల్ని కాపాడుకోవడంలో అశ్రద్ధగా ఉన్నాడు. అందుకే మీకు కరువు వచ్చింది. ప్రస్తుతానికి ఆ నీరు దేశం నలుమూలలా చల్లండి. వెంటనే చెరువులూ నదులూ నిండుతాయి. వర్షాలు పడతాయి. అయితే ఇక మీదట మాత్రం మీరు చెరువుల్లో పూడిక తీస్తూ, బావులు తవ్విస్తూ, కాలుష్యం లేకుండా చూసుకుంటూ, మిమ్మల్ని మీరే కాపాడుకోవాలి. అంతేగాని, మరోసారి ఇలా వస్తే, నిధి మాట అలా ఉంచి, అమ్మవారు కూడా కనబడదు నీకు. జాగ్రత్తగా వెళ్లు!" అంటూ మాయమైపోయాడు.

"రామూ... తెల్లారిపోయింది లే" అంటూ అమ్మ లేపుతూంటే మెలకువ వచ్చిన రాము, 'ఇదంతా కలా' అని ఆశ్చర్యపోయి "నిన్న మేష్టారు జలవనరుల్ని కాపాడుకోవలసిన ఆవశ్యకత గురించి చెప్పారు కదా... కలలో యక్షుడు కూడా జలనిధి జాగ్రత్త అనే చెప్పాడు!" అనుకుని నవ్వుకుంటూ లేచాడు!!

# నరక కూపం

సలీం


✆ 7588630243

**విశిష్ట అతిథి కథ**

> ***నువ్వు ఆఫీసులో ఫ్యాను కింద కూచుని చేసే ఉద్యోగం చేస్తున్నా, నేను నిన్నింతగా గౌరవించేదాన్ని కాదేమో నాన్నా! నువ్వు అమ్మ కోసం, నా కోసం, నా చదువు కోసం, డ్రైనేజీ మురికినంతా కౌగిలించుకుంటున్నావు చూడు... అందుకూ నువ్వంటే నాకిష్టం.. నువ్వంటే నాకు గౌరవం...***
> ***నువ్వు నా హీరోవి నాన్నా... నాకే కాదు... అమ్మకు కూడా!"***

చనిపోయాక నిజంగానే ఆ లోకంలో స్వర్గనరకాలు ఉంటాయో లేదో నాకు తెలియదు. కలికాలంలో పాపపుణ్యాల ఫలం ఈ లోకంలోనే అనుభవించక తప్పదని కదా చెప్తారు. నిజమేనేమో... ఇప్పుడు నా వయసు నలభై యేళ్ళు. ఇన్నేళ్ళ జీవితంలో స్వర్గం ఎలా ఉంటుందో ఎప్పుడూ అనుభవంలోకి రాలేదు. నరకం మాత్రం ప్రతిరోజూ చూస్తున్నాను. నోట్లోకి నాలుగు మెతుకులు వెళ్ళాలంటే నరకయాతన పడాల్సిందే... ఎందుకు దేవుడు నా నుదుట ఇంత హీనమైన బతుకుని రాశాడో... ఏం పాపం చేశానని... ఈ కులంలో పుట్టటం నా తప్పా? పేదరికంలో మగ్గడం నా తప్పా? ఇదంతా ఆ దేవుడేగా చేశాడు. తప్పు దేవుడిదైతే శిక్ష నాకెందుకు? అసలు దేవుడున్నాడా? ఉంటే ఇంత పక్షపాతం ఎందుకు? కొందరి మీద దయ... కొందరి మీద మాత్రం కసి... నా కులం మీద మరీను!

శవం నడుస్తున్నట్టు... నడుస్తూ ఆలోచిస్తున్నాను... మురిక్కాలువలో రాయి విసిరితే బద్ధకంగా కదిలే అలల్లా ఆలోచనలు! వూపిరి ఆగిపోయిన కట్టెలాంటి శరీరాన్ని బలవంతంగా ముందుకు నెడ్తూ.. అవును కదూ.. స్వచ్ఛమైన గాలి పీల్చుకుని ఎన్నేళ్ళయింది? ఇపుడు శ్వాస తీసుకోవాలన్నా భయమే... వూపిరితిత్తుల నిండా చుట్టచుట్టుకుని పడుకుని ఉన్న దుర్గంధం! నా పధ్నాలుగో ఏడప్పుడు కదూ మొదటిసారి చనిపోయింది. చనిపోయి, మలమూత్రాలతో నిండి ఉన్న దారిగుండా ప్రయాణిస్తూ, నరకపు ద్వారాలు తెరుచుకుని, ఎంత భీభత్సంగా ఉందో... చనిపోతే బావుండనిపించేంత భయంకరంగా! చనిపోయాకే కదా నరకాన్ని చేరుకున్నాను. మళ్ళా చనిపోవటం ఎలానో తెలీక ఎంత నరకయాతన పడ్తుంటానో నాకే తెలుసు... ఆ దేవుడికీ తెలుసేమో... తెల్సినా క్రూరంగా నవ్వుకుని ఉంటాడు. నేనీ భూమ్మీదే నరకం చూడాలని నా నుదుటన రాసిన మహానుభావుడాయనేగా మరి!



ఉదయం యాద్గిరి ఫోన్ చేశాడు. నల్లకుంట చౌరాస్తా దగ్గర డ్రైనేజీ పైపు లీకవుతోందట. నీళ్ళు బైటికి పొంగడం వల్ల దుర్గంధాన్ని తట్టుకోలేక, ఇప్పటికే ప్రజలు నానా ఇబ్బందులు పడ్తున్నారని, దాన్ని వెంటనే బాగు చేయాలని యాద్గిరి ఆర్డర్... నాకు కడుపులో దుఃఖమేదో సుళ్ళు తిరిగింది. ప్రజలు ఇబ్బంది పడ్తున్నారట... మరి నేనో... నేనా ప్రజల్లో ఒకడ్ని కాదా... మరి నేనెవర్ని? నా ఇబ్బంది గురించి యాద్గిరికి పట్టదా... ఈ ప్రభుత్వానికి పట్టదా... నాకు దుర్గంధం వేయదా?

పధ్నాలుగేళ్ళప్పుడు మొదటిసారి డ్రైనేజీలోకి దిగడానికి ఇబ్బంది పడ్తూ, ముక్కులు గట్టిగా మూసుకుంటే నారాయుడు నవ్వి ‘ఒరేయ్... ఇక నుంచీ దీన్నే సెంటు వాసననుకో...లేకపోతే బతకలేవు’ అన్నాడు. ఎక్కడి బతుకు నారాయుడూ... ఆ క్షణమేగా నేను మనిషిగా చచ్చిపోయి, బురదలో దొర్లే పందిలానో, డ్రైనేజీలో లుకలుకలాడుతూ బతికే బొద్దింకలానో రూపాంతరం చెందింది!

డ్రైనేజీ మూత అల్లంత దూరం ఉండగానే, పాతికేళ్ళుగా అలవాటైన కంపు ముక్కుపుటాల్ని సోకి తన మురికి చేతుల్తో నన్ను తన వైపుకి లాక్కుంది. దానికి ఆమడ దూరంలో నిలబడి ఒక చేత్తో ముక్కుని కర్చీఫ్‌తో మూసి, అసహనంగా నిలబడి ఉన్నాడు యాద్గిరి. అతనికి ఎడంగా సింగన్నగాడు నిలబడి ఉన్నాడు. నేను మరికొంత దగ్గరకు వెళ్ళటం ఆలస్యం పూరకుక్కలా మొరగడం మొదలెట్టాడు యాద్గిరి. “ఇంతాలస్యమైందేరా... నీకు ఫోన్ చేసి జల్దీ రమ్మని కదా చెప్పాను. ఎంత సేపు నీ కోసం ఎదురుచూడాలి?” అన్నాడు కళ్ళెర్ర చేస్తూ.

"నీకేం సారూ... బయ్యిమని బండేస్కుని వచ్చేత్తావు. నా కాల్లకు సక్రాలేమీ లేవుగా సారూ... నడ్సుకుంటానేగా రావాల" అన్నాను.

"సర్లె సర్లె... మొదట పన్లోకి దిగు. ఇప్పటికే నా మొగుడి నుంచి ముప్పయ్ సార్లు ఫోన్... జవాబు చెప్పలేక చస్తున్నా!" అన్నాడు.

సింగన్న పలకరింపుగా నవ్వి "అన్నా... బాగున్నావా?" అన్నాడు. పాతికేళ్ళకు మించని వయసు, సన్నటి మీసకట్టు, మనిషి పొట్టిగా, బక్కపల్చగా చువ్వలా ఉంటాడు. అందుకే వాడ్ని మేమందరం 'సిట్టెలుక' అని ముద్దుగా పిల్చుకుంటూ ఉంటాం. చిక్కగా ఉన్న డ్రైనేజీ మురికినీళ్ళలో సైతం బురదమట్టలా చులాగ్గా జారిపోగల మొనగాడు.

డ్రైనేజీ మూతకున్న ఇనుప కొక్కేనికి పొడవాటి చువ్వ కొసకున్న మెలికని దూర్చి, బలంకొద్దీ లాగాను. మూత అరంగుళం కూడా కదల్లేదు. నాకు సాయంగా సింగన్న కూడా చేయి వేశాడు. ఐనా కదల్లేదు. ఇద్దరం వొంగి చువ్వ మొదలు దగ్గర బలంగా పట్టుకుని మూతని తెరిచాం. అప్పటి వరకూ బైటికి పొంగుకొచ్చిన నీళ్ళ వల్ల పల్చగా గాల్లో తేలియాడుతున్న కంపు ఒక్కసారిగా గుప్పుమని మొహానికి తగిలింది. దుర్గంధం పదునైన కత్తిలా మారి కసుక్కున గొంతులో దిగబడినట్టు... కొన్ని క్షణాలు వూపిరాడలేదు. ఎంత అలవాటు పడినా దీని దాడిని తట్టుకోవాలంటే ప్రతిసారీ కొత్తగా సమాయత్తం కాక తప్పటం లేదు.

చొక్కా ప్యాంటు విప్పదీసి, మడత పెట్టి, రోడ్డుకి ఎడం వైపున పెట్టాను. గాలికి ఎగిరిపోకుండా రాయి ఏరుకొచ్చి వాటి మీద బరువు పెట్టాను. చెప్పులు కూడా పక్కనే వదిలేశాను. వంటి మీద నల్లటి నిక్కరు తప్ప మరే ఆచ్ఛాదనా లేదు. పనిలోకి దిగే ముందు ఎప్పటికి మల్లే యాద్గిరి వైపు వేడుకోలుగా చూస్తూ "మీ పెద్ద సార్లతో మాట్లాడు సారూ! కనీసం సేతులకి తొడుగులు, కాల్లకి బూట్లు ఇప్పించు సారూ, గాజుపెంకులూ, బ్లేడ్లు, ఇనుపతీగెలు గుచ్చుకుని వొల్లంతా ఎన్ని గాయాలైతయ్యో నీకు ఎరికే గదా!" అన్నాను.

"పన్లోకి దిగడానికి నీవి చానా డిమాండ్లున్నాయిరా! ఏదో పాతికేళ్ళ బట్టి ఈ పనిలో ఉన్నావన్న ఉద్దేశంతో పిలిచి పనిస్తున్నా! సీనియర్ని కదా అని నీల్గావనుకో, తోక కత్తిరించేస్తా! నీకు కష్టంగా ఉంటే చెప్పు... నీకిస్తున్న కూలీకి సగమిస్తే చాలు, పొలోమంటూ రావడానికి ఇంతమంది తయారుగా ఉన్నారు" అన్నాడు తన తల మీది జుట్టుని చూపిస్తూ!

"వద్దులే సారూ! కోపమొత్తే నన్ను కొట్టు... నా కడుపు మీద కొట్టొద్దు'' అన్నాను.

యాద్గిరి బెదిరింపు విని చాలా భయమేసింది. 'అమ్మో... అలవాటైన ఈ పని తప్ప నాకు మరో పని చాతకాదు. ఈ పనీ దొరక్కపోతే యింట్లో అందరం పస్తులు పడుకోవాలి. నా కూతురి చదువేం కావాలి? ఇప్పుడది డిగ్రీ ఆఖరేడాదిలో ఉంది. దాని లగ్గమెలా చేయాలి?' పని దొరకదేమోనన్న ఆలోచనకే వొళ్ళంతా చలి జ్వరం వచ్చినట్టు వణికింది.

అగ్గిపుల్ల గీసి డ్రైనేజీలో వేశాను. లోపలికెళ్ళటం ఆలస్యం భగ్గుమని చిన్న శబ్దంతో మండింది. డ్రైనేజీలోకి దిగే ముందు ఇలా చేయడంవల్ల లోపల ఉండే విషవాయువులు మండిపోతాయని, ఆ తర్వాతే పనిలోకి దిగాలని, నాకు పద్నాలుగేళ్ళ వయసులో, ఇప్పుడు నా వయసులో ఉండిన పోచయ్య నేర్పాడు. పొగ మొత్తం పోవడానికి కొంత సమయం పడ్తుంది కాబట్టి, యాద్గిరి వైపు తిరిగి "సారూ" అంటూ, మెడ ఎత్తి నీళ్ళు తాగుతున్నట్టు సైగ చేశాను. "ఏది మర్చినా ఇది మాత్రం మరవ్వని

నాకు తెలుసురా. అదుగో వాడి చేతికిచ్చి పెట్టాను. కానివ్వు. పని పూర్తి కాగానే నాకు ఫోన్ కొట్టండి” అంటూ స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయాడు.

నేనూ సింగన్న ఓ గోడ చాటుకెళ్ళి నిలబడ్డాం. సింగన్న తన ప్యాంటు జేబులోంచి మందుసీసా తీశాడు. దాని మూతమీద రెండుదెబ్బలు కొట్టి, మూత తీసి నా చేతికిచ్చాడు. అటూ ఇటూ చూసి, సీసా ఎత్తి గటగటా సగానికి పైగా తాగేశాను. సింగన్న మిగతాది తాగి, అగ్గిపుల్ల వెలిగించి ఖాళీసీసాలో వేశాడు. అది ఓ క్షణం భగ్గున మండి ఆరిపోయింది. ఇందాక డ్రైనేజీలో అగ్గిపుల్ల వెలిగించి వేసినపుడు భగ్గున మండినట్టు... దీంట్లో కూడా విషవాయువులు ఉంటాయేమో... విషం విషానికి విరుగుడేమో... ఇది పొట్టలో బడితే తప్ప డ్రైనేజీ రాక్షసి పెట్టే శారీరక మానసిక హింసని తట్టుకోవడం కష్టం!

నీళ్ళు కలుపుకోకుండా తాగడం వల్లనేమో గొంతు కూడా భగ్గున మండింది. గమ్మత్తయిన మత్తు నరాలనిండా ప్రవహిస్తూ... ఇపుడు వంటి మీద మలమూత్రాలు పాకుతున్నా మనసు పట్టించుకోదు. కుడిచేతికి నిక్కరు జేబులో ఉన్న నల్లటి కర్చీఫ్ గుడ్డ తీసి చుట్టుకున్నాను. మొదట కాళ్ళని లోపలికి జారవేసి అందులోకి దిగాను. గుండెల వరకు తాకుతూ మురికి... కుళ్ళిన కోడిగుడ్ల వాసనకన్నా భయంకరమైన వాసనేదో ముక్కు పుటాల్ని బద్దలు కొడ్తూ, ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తా చెదారం తీసి బకెట్లో వేస్తున్నాను. అది నిండగానే, సింగన్న దాన్ని ఎత్తుకెళ్ళి చెత్తకుండీ పక్కన వేసి వస్తున్నాడు. దాదాపు రెండు గంటలు పనిచేసినా అడ్డున్నదేదో పోయినట్టు లేదు.

ట్రాఫిక్ మొదలైంది. డ్రైనేజి దాటుకుంటూ వెళ్ళేవాళ్ళందరూ ముక్కులు మూసుకుని అసహ్యించుకుంటూ వెళ్తున్నారు. కొందరైతే నా గుండెల మీద నుంచి కదులాడుతున్న నల్లటి చిక్కటి తారులాంటి ద్రవపదార్థాన్ని చూసి, వికారంతో తల తిప్పుకుంటున్నారు. నాకు తెలుసు... నేనిపుడు మనిషిలా కన్పించనని... జుగుప్సాకరమైన బొద్దింకలానో, చచ్చిన ఎలుకలానో కన్పిస్తానని! ఈ పనిలో చేరిన కొత్తలో వాళ్ళ అసహ్యమైన చూపులు చాలా గాయాలు చేసేవి. నామీద నాకే అసహ్యం వేసేది. నాదీ ఓ బతుకేనా... కుక్క కన్నా, పంది కన్నా హీనమైన బతుకనిపించేది. ‘అయ్యలారా... అమ్మలారా... నేనిపుడు మునిగి ఉన్నది మీరు విసర్జించిన మలమూత్రాల్లోనే! మీది మీకే అసహ్యమైతే, మరి నాకెలా ఉంటుందో ఒక్క క్షణం ఆలోచించండి. అప్పుడసహ్యం కాదు, నా మీద జాలి వేస్తుంది’ అని పెద్దగా గొంతు పోయేలా అరవాలనిపించేది. ఇపుడలవాటైపోయింది. దేనికీ చలించని రాయిలా... కర్ర తీసుకుని అన్ని వైపులా పొడిచి చూశాను. ఎక్కడ ఏది అడ్డుకుంటుందో తెలియటం లేదు. మధ్యాహ్నం పన్నెండు కావస్తోంది.

“సింగా... నువ్వు పూనుకోవాల్సిందేరా” అన్నాను. అప్పటికే పది బక్కెట్లకు పైగా చెత్తాచెదారం తీసి వేయడం జరిగింది. నేను పైకొచ్చి గుడ్డతో వంటిమీదున్న మురికిని వీలైనంతగా తుడుచుకున్నాను. సింగన్న ఎలుకపిల్ల కలుగులోకి పుసుక్కున దూరినట్టు దూరిపోయాడు. అతనికి పొడవాటి తాడు అందించాను. దాన్ని నడుముకి కట్టుకుని లోపల అదృశ్యమైపోయాడు. తల మాత్రం మునక్కుండా జాగ్రత్తపడ్తూ, వాడు వీలైనంత లోపలికెళ్ళి ఎక్కడ అడ్డుందో కనుక్కుని, దాన్ని తొలగించి రావాలి. వెంటనే అయ్యే పని కాదు. తాడు మరో కొనని చేతిలో పట్టుకుని ఆలోచనల్లో మునిగిపోయాను.

వచ్చేవారం అమ్మాయిని చూసుకోడానికి మగపెళ్ళి వారు వస్తున్నారు. నా గుండెల్లో అలజడిగా ఉంది. నాకు పెళ్ళీడు వచ్చాక ఎవ్వరూ పిల్లనివ్వడానికి ముందుకు రాలేదన్న విషయం... ఇనుప ముల్లులా గుచ్చుకుంటూ ఉంది. రోజంతా దుర్గంధంలో పడి, శ్లేష్మంలో కొట్టుకునే ఈగలా వంటినిండా మురికిని మోసే వాడికి పిల్లనెవరిస్తారు? ఎన్ని సబ్బులు అరగదీసి వొళ్ళంతా కడుక్కున్నా, వదిలిపెట్టకుండా వెంటాడే భయంకరమైన వాసనని ఎవరు మాత్రం భరించగలరు?

'మనం సచ్చాకేరా... ఈ గబ్బు మనల్ని వదిలేది' అనేవాడు పోచయ్య. 'నేనూ పెళ్ళాం కోసం నానా తంటాలు పడ్డాను తెలుసా?' అని పసిపిల్లాడిలా నవ్వే పోచయ్య, చివరికి తన కూతుర్నే ఇచ్చి పెళ్ళి చేశాడు. ఇపుడు నేను డ్రైనేజీలు శుభ్రం చేసేవాడినని తెలిస్తే, ఆ పిల్లాడి తల్లిదండ్రులు ఈ సంబంధానికి ఒప్పుకుంటారా? మధ్యవర్తి మాత్రం పారిశుధ్య కార్మికుడినని చెప్పాడట. మమ్మల్ని కూడా అలానే చెప్పమన్నాడు.

ఆలోచనల్లోనే గంట సేపు గడిచిపోయింది. తాడు చాలా సేపటి నుండి కదలకుండా ఉందన్న విషయం చప్పున గుర్తొచ్చింది. తాడు మెల్లగా లాగి చూశాను. అటు నుంచి ఎటువంటి కదలికా రాలేదు. గట్టిగా లాగాను. ఏదో కదిలినట్టు అన్పించింది. ఒక్కసారిగా గుండె నిండా భయం ఆవరించింది. ఇంకొద్దిగా లాగాను. మరికొంత కదిలింది. చేతులు వణుకుతున్నాయి. మెలమెల్లగా తాడుని లాగాను. నడుం దగ్గర నుంచి పూర్తిగా ముందుకి వొంగిపోయి, తల నీళ్ళలో మునిగిపోయి, సింగన్న శవం కన్పించింది. పెద్దగా కేక పెట్టి తాడుని వదిలేశాను.

★★★

సింగన్న అర్ధాంతరపు చావు నన్ను బాగా కలచివేసింది. వాళ్ళ వూర్లో పొలం పనులకని వెళ్ళేవాడు. పంటలు పండక.. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న తరుణంలో, పొలం పనులు దొరక్క పట్నానికి వలస వచ్చాడు. పెళ్ళి చేసుకుని ఇద్దరు పిల్లల్ని కన్నాడు. భార్యాబిడ్డల కడుపు నింపడం కోసం, డ్రైనేజీ అనే కొండచిలువ నోట్లో తల పెట్టాడు.

'గట్టర్ లోకి దిగుతుంటే నా సమాధిలోకి ఎల్తున్నట్టే ఉంటుందిరా' అనేవాడు పోచయ్య. అలా మా పనోళ్ళలో ఎంత మంది చనిపోయారో... కాంట్రాక్టర్ విదిలించే రోజుకూలీకి ఆశపడి, తెరుచుకున్న మొసలి నోరులా భయంకరంగా కన్పించే డ్రైనేజీ గుంటలోకి, తల పెట్టి, వూపిరాడక కొంతమంది, విషవాయువులు పీల్చి కొంత మంది, రకరకాల చర్మ రోగాలతో, శ్వాసకోశ రోగాలతో కొంతమంది... డ్రైనేజీ మూతలు మృత్యుద్వారాల్లా కన్పిస్తుంటాయి. కానీ చావుతో ఈ చెలగాటం మాకు తప్పదు. సింగన్న కూడా ఏ విషవాయువులకో బలై ఉంటాడు. అంత లోపల కాటేయడానికి ఏమేమి దాగున్నాయో మాకెలా తెలుస్తుంది?

నేనూ ఓ రోజు ఇలానే చచ్చిపోతానేమో... అపుడు నా కుటుంబానికి దిక్కెవరు? మమ్మల్ని చావు కన్నా ఎక్కువగా భయపెట్టే విషయం ఇదే! సింగన్న చనిపోయాక అతని కుటుంబాన్ని ఎవ్వరూ పట్టించుకున్న పాపాన పోలేదు. కర్మకాండలకు అవసరమైన డబ్బిచ్చి యాద్గిరి చేతులు దులుపుకున్నాడు. సింగన్న భార్యాపిల్లల హృదయవిదారకమైన ఏడుపు ఇంకా నా గుండెల్లో మార్మోగుతూనే ఉంది.

నా అయ్య కూడా ఇదే పని చేసేవాడు. నలభై యేళ్ళు రాకముందే ఏదో జబ్బుతో దగ్గి దగ్గి, రక్తం కక్కుకుని చనిపోయాడు.

'నీ వయసు వాళ్ళని పనిలో పెట్టుకోకూడదురోయ్! అయినా నాది జాలి గుండె కాబట్టి పనిస్తున్నా... ఎవరైనా అడిగితే నీకు పద్దెనిమిదేళ్ళని చెప్పు' అన్నాడు నారాయుడు. మొదటిరోజు డ్రైనేజీలోకి దిగినప్పటి భయంకరమైన అనుభవాన్ని నేనెప్పటికీ మర్చిపోలేను. ఒంటి చుట్టూతా నల్లటి జంతువేదో అంటుకుపోయినట్టు... చల్లటి కాళ్ళతో తేళ్ళూ జెర్రులూ పాకుతున్నట్టు... కొన్ని వేల కీటకాలు ఒకేసారి శరీరం మీద దాడి చేసినట్టు... దానికి తోడు భరించలేని దుర్గంధం... ఎక్కడి నుంచి వచ్చాయో నీళ్ళపై నుంచి పాకుతూ వచ్చి మొహం మీదికి, తల మీదికి ఎగబాకాయి బొద్దింకలు... పెద్దగా కేకపెట్టి వాటిని

విదిలించుకున్నాను. నా వైపుకి మెల్లగా తేలుతూ వస్తోంది ఎవరిదో మలం.. అది నన్ను దాటి పోవటం ఆలస్యం భళ్ళున వాంతి చేసుకున్నాను. నా వాంతిలో నేను... నా చుట్టూతా ఈ నగర జనాభా విసర్జించిన మలమూత్రాలు! ఏడుపు తన్నుకు వచ్చింది... ఆ క్షణమే చచ్చిపోతే బావుండనిపించింది.

"నేను సెప్తే ఇన్నావా... ఈ మందు గొంతులో పడితే తప్ప తట్టుకోలేవురా అని సిలక్కి సెప్పినట్టు సెప్పానా లేదా... ఈ డ్రైనేజీ దెయ్యం పెట్టే హింసని బరించాలంటే ఇదొక్కటేరా మందు!" అన్నాడు పోచయ్య.

అతని చేతిలో ఉన్న సారాయి సీసాని లాక్కుని ఒక్క గుటకలో తాగేశాను. "ఇప్పుడు సూడ్రా... నువ్వు మొనగాడివైపోతావు సూడు" అన్నాడు పోచయ్య పెద్దగా నవ్వుతూ! చేత్తో చెత్తని తీసేస్తుంటే చేతిలోకి చచ్చిన లావుపాటి ఎలుక వచ్చింది. అది కుళ్ళిపోయి కంపుకొడుతూ!

ఆ రోజు యింటికెళ్ళాక కూడా కక్కుంటూనే ఉన్నాను. అన్నం సయించలేదు. ఏది చూసినా డ్రైనేజీలో చూసినవే గుర్తుకొస్తున్నాయి. ఎటు తిరిగినా ఆ దుర్గంధమే ముక్కుపుటాల్ని హింస పెడ్తోంది. "మనం ఈ నరకంలోనే బతకాలా? మన సావు కూడా ఇక్కడేనేమో... మనకిక జీవితంలో సొరగం ఎట్టా ఉంటుందో తెలీదేమో..." అంటూ నాతో పాటు పనిచేసే ఓబులేసుతో అని పెద్దగా ఏడ్చాను.

ఓబులేసుకి పాతికేళ్ళుంటాయి. మనిషి సన్నగా రివటలా ఉంటాడు. "పద ఈ రోజు నీకు సొరగం ఎక్కడ దొరుకుద్దో సూపిత్తాను" అని నన్నెక్కడికో లాక్కెళ్ళాడు. ఆ గుడిసెలో తడిక అడ్డుగా ఉంది. "నీకు కొత్త కదా... మొదట నువ్వెళ్ళు" అన్నాడు. తడికకి అటు వైపున మంచం... దాని మీద అక్కడక్కడా చిరిగిన మాసిపోయిన పల్చటి దుప్పటి... దాని మీద నవ్వుతూ చూస్తున్న ఆడది! ఆమె శరీరం నిండా దుర్గంధమే... కుళ్ళిపోయిన కోడిగుడ్ల వాసన... పారిపోయి వచ్చేశాను.

పెళ్ళయ్యాక కూడా నా భార్య దగ్గర అదే వాసన... నరకలోకపు కుళ్ళిన వాసన! "అది నీ పెళ్ళాం నుంచి వస్తుందనుకుంటున్నావా? పిచ్చోడా... అది నీలోంచే వస్తోంది... నాలోంచి కూడా" అంటూ నవ్వాడు ఓబులేసు. నాకప్పుడో నిజం తెలిసింది. నా శరీరంలోంచే వస్తోందా వాసన... నా శ్వాసలోంచి వస్తోంది. నా అణువణువులో నిండిపోయి ఉబికుబికి వస్తోంది. దాన్నుంచి పారిపోదామని ఎంత ప్రయత్నించినా వదలని దుర్గంధం! అన్నం చేత్తో తినడం ఎప్పుడో మానేశాను. కళ్ళతో చూడకుండా చెంచాతో తినడమే... నా భార్య కలిపిచ్చేది. కొన్నిసార్లు తన చేతుల్తో తినిపించేది.

మరునాడు ఆదివారం! మగపెళ్ళివారు వచ్చేరోజు! "మీ ఇద్దరికీ గురుతుందిగా. నేను డ్రెయినేజీ పనోణ్ణని సెప్పొద్దు. రోడ్లు వూడ్చే పని సేత్తానని సెప్పండి" అన్నాను.

నా భార్య సరేనంటూ తల వూపింది. కాని నా కూతురు కస్సుమంటూ లేచింది. "ఎందుకబద్ధం చెప్పాలి? ఇందులో దాచాల్సిన అవసరం ఏముంది నాన్నా... నువ్వేమీ నేరం చేయటం లేదే. పెళ్ళాం బిడ్డల్ని పోషించడం కోసం నీకు చాతనైన పని నువ్వు చేస్తున్నావు. అంతే" అంది.

"లేదమ్మా. నీకు తెలీదు! నేను సేసేది శానా నీచమైన పని. అందరూ అసయ్యించుకునే పని. అది తెలిత్తే పురుగుని సూసినట్టు సూత్తారమ్మా. నీకు పెళ్ళి కాదు. అందుకే సెప్పొద్దు" అన్నాను.

"నువ్వు చేసేది నీచమైన పని కాదు. వేలమంది విసర్జించిన కల్మషాలు బైటికి పొంగుకొచ్చి, ఇబ్బంది పెట్టకుండా అందర్నీ కాపాడే పని! డాక్టర్లు మనకు రోగాలొచ్చాక, వాటిని మందుల్తో తగ్గించి రక్షిస్తారు. వాళ్ళని దేవుడితో సమానమని పొగుడ్తారు. మీరు చేస్తున్న పని అంతకంటే గొప్పది నాన్నా! అసలు రోగాలే రాకుండా ప్రజల్ని దుర్వాసనల నుంచి, తద్వారా ప్రబలే అనారోగ్యాల నుంచి రక్షించే పని! మీ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి, ప్రజల ఆరోగ్యాల్ని కాపాడుతున్న త్యాగవర్తులు మీరు!'' అంది నాకు సమీపంగా జరిగి, నా భుజం మీద చేయి వేస్తూ!

"ఏమో తల్లి! నువ్వు పెద్ద సదువులు సదువుకున్నావు. అయన్నీ నాకు తెలీదు. నాకు తెలిసింది ఒక్కటే. నేను డ్రైనేజిలో దిగి పని సేస్తున్న పెతిసారీ నన్ను సూసేవాల్ల కల్లల్లో అసియ్యాన్నే సూశాను. మూత తెరవంగానే డ్రైనేజీలోంచి బైటి కొచ్చే బొద్దింకలాంటి పురుగుల్ని సూసినట్టు!"

"నాన్నా... నేను చెప్పేది జాగ్రత్తగా విను. ఆ పెళ్ళివాళ్ళకు నిజాలే చెబ్దాం! నిన్నూ, నువ్వు చేస్తున్న పనిని ఇష్టపడని వ్యక్తి నాకు భర్తగా వద్దు! అందరూ అలాంటివాళ్ళే అయితే నాకసలు పెళ్ళే వద్దు. నువ్వు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను నువ్వు తక్కువ చేసుకోవద్దు. నువ్వు ఆఫీసులో ఫ్యాను కింద కూచుని చేసే ఉద్యోగం చేస్తున్నా, నేను నిన్నింతగా గౌరవించేదాన్ని కాదేమో నాన్నా! నువ్వు అమ్మ కోసం, నా కోసం, నా చదువు కోసం, డ్రైనేజీ మురికినంతా కౌగిలించుకుంటున్నావు చూడు... అందుకూ నువ్వంటే నాకిష్టం.. నువ్వంటే నాకు గౌరవం... నువ్వు నా హీరోవి నాన్నా... నాకే కాదు... అమ్మకు కూడా!"

నా కూతురి కళ్ళు నా మీది ప్రేమతో జ్యోతుల్లా వెలగడాన్ని గమనించాను. నా భార్య వైపు చూశాను. కళ్ళనిండా నీళ్ళు నింపుకుని, "ఔనయ్యా... నువ్వంటే నాకు శానా ఇట్టం... పేమ!" అంది గొణుక్కుంటున్నట్టు.. నాకు దగ్గరగా జరిగి, నన్ను చుట్టుకుని, బొటబొటా కన్నీరు కార్చింది. ఆ క్షణంలో తన శరీరం నుండి వస్తున్న చెమట వాసన మల్లెపూల సుగంధంలా!

ఒక్కసారిగా నాకు జ్ఞానోదయమైంది. కళ్ళముందు స్వర్గమేదో ప్రత్యక్షమైంది. ఇన్నాళ్ళూ నేను ఎదుర్కొంటున్న నరకం గురించే ఆలోచిస్తూ, నా యింట్లో ఉన్న స్వర్గాన్ని గమనించుకోలేదు. ఈ లోకమంతా నన్ను పురుగులా చూసినా, ఇద్దరు మాత్రం నన్ను మనిషిగా చూస్తున్నారన్న భావన... ఎంత అద్భుతంగా ఉందో! వీళ్ళ ప్రేమకు పాత్రుడిని కావడం కన్నా మరో స్వర్గం ఏముంటుంది? ఈ స్వర్గం కోసం ఎన్ని నరకాలెదురైనా సంతోషంగా భరిస్తాను. సంతోషంతో పొంగిపోతూ గుండెనిండా వూపిరి పీల్చుకున్నాను. ఆశ్చర్యం... ఏ దుర్వాసనా లేని స్వచ్ఛమైన గాలి వూపిరితిత్తుల్ని ప్రేమగా తడిమింది!

*(నవ్య వారపత్రిక, 17 ఆగస్ట్ 2016 నుండి పునర్ముద్రణ)*

# గోమున్నసాంయ్

## కీ. శే. వాకాటి పాండురంగారావు

**కథామార్గదర్శి కథ**

***"ఏవిట్రా కోనేటం, ఇలా కొట్టుకొచ్చేశావేం... ఆ... ఊ... కబుర్లేమిటి? విశేషాలేవిటి? మీ ఆవిడ పురుడోసుకునీసిందా? మీ తమ్ముడెక్కడో జాయినయ్యాట్టగా? ఇల్లుగలావిడ మీ వాటా మీద కొత్త పెంకుల్ని కప్పిందా? అసలు కప్పదా? కార్యాలయంలో ఎడ్ క్లర్కే వంటాడు!" అని రపరప ప్రశ్నలడిగేసి జవాబులు కూడా వినకుండా, వంటింటికేసి తిరిగి "సరోజా!" అని పిలిచాడు శేషగిరి.***

***తలుపువారకొచ్చి నిల్చుందావిడ.***

"ఏయ్ పిల్లా! నీ పేరేమీ బాగోలేదు..."

ఒక్కక్షణం కుంపటి విసరడం మాని ఇటు తిరిగింది సరోజ. ఆ తిరగడంలో భుజం మీదుగా ముందుకొచ్చి పడింది ఆమె జడ.

"ఓహోహో" అనుకున్నాడు శేషగిరి ఆ జడ విన్యాసాన్ని వీక్షించినవాడై!

"ఏమిటి?"

"ఏమీలేదు గానీ... ఇందాకా నేను వేయించిన ప్రకటన వినలేదూ?" భ్రుకుటి ముడిచింది సరోజ.

"అదేనోయ్... నీ పేరు నాకు నచ్చలేదు..." ఓ క్షణం ఆగి, "బొత్తిగా నచ్చలేదు...." అని ఒత్తి పలికాడు శేషగిరి.

వచ్చిన నవ్వును దాచుకొంది సరోజ.

"మరి నియంతలా అణిచేస్తావేం ఆ నవ్వును!"

"కారణం ఉందిలెండి, నేనించక్కా నవ్వుతానని మీరన్నారుగా?"



"నేనేమిటి... మీ బావగారు కూడా 'మా మరదలు నవ్వితే జలతరంగం మీద శంకరాభరణంలా వుంటుందోయ్' అని మెచ్చేసుకున్నారు."

"మరే... అంచేత అంతోటి ఆభరణాల నవ్వులు ఉత్తినే పంచి పెట్టబడవు!"

"మరి?"

"సాయంకాలం సినిమాకు తీసుకెళ్ళాలి..."

"అలాగేనోయ్ అనూరాధా!"

"అనూరాధెవరు?"

"అదే నేనిందాక చెప్పబోయేసరికి నవ్వులూ ఖరీదులు అని బయలుదేరి నా ఏకాగ్రతనంతా నాశనం చేశావు."

"సెలవివ్వండి..."

"నీ పేరు మార్చాలి..."

"ఏం?"

"నాకు నచ్చలేదు!"

"ఎందుకనో?"

"బాగులేదు కనుక!"

"వనజ అంటే బావుంటుందా మీకు?" అని అతడి మొహంలోకి తొంగి చూసింది సరోజ.

"సందు దొరికితే చాలు మా ఆఫీసు టైపిస్టునలా నమిలేస్తావెందుకు?"

"పోనీ మిస్. మెంజీస్ అని పెట్టుకోనా?"

"ఛీ... మరీ భూతదయ లేకుండా పోతోంది నీకు! ఆ అమ్మాయి ఎప్పుడో పెళ్ళి కాక ముందర నాకు ఉత్తరాలు రాసింది కదా అని..."

"ఊ... రాస్తుంది... రాస్తుంది. ఉత్తరాలకేనా, ఇంకేమన్నా రాసిందా?" పరుషంగా వత్తింది సరోజ స్వరం.

"ఉదాహరణకు?"

"ఏం... సెంటు రాయకూడదూ?"

నవ్వాడు శేషగిరి "కాబట్టి సుందరమ్మా... నీ ప్రస్తుతపు పేరు తీసేసి అనూరాధ అని పెట్టుకో..."

"పెట్టుకుంటే నన్నేమని పిలుస్తారటా?"

"ముద్దుగా రాధా అనో, ముచ్చటగా అనూ అనో పిలుచుకుంటా."

"ఈ పేర్ల వెనుక మధురస్మృతులేమయినా వున్నాయేవిటి?" అల్లరి జల్లులు కురిసే కళ్ళతో అడిగిందామె.

"పాహి పాహి... రాముడి తర్వాత రాముడంతటి ఏకపత్నీ వ్రతుడిని, నన్ను పట్టుకుని ఇలా అన్నావంటే నీకు శాపం తగులుతుంది, జాగ్రత్త!"

"ఒంటిమీద జందెప్పోగయినా లేదు గాని శాపంట శాపం!" అని కుంపటివైపు తిరిగింది సరోజ.

"మరీ క్యూబాలా మాట్లాడక, నీ మొగుడనేవాడు చెప్పిన మాట వినడం నేర్చుకో" అని సలహా ఇచ్చాడు శేషగిరి.

"తమరు చైనాలా మొండికెత్తక, వెళ్ళి కూచుని పేపరు చదువుకోండి ఆ తర్వాత కాంగోలో ఏమయిందో వ్యాసం రాసి చూపించండి!" అంది సరోజ కుంపట్లో నిప్పులు సరిచేస్తూ.

సరోజకు కోపం వస్తుంది. రావాలి. తాను పోగొట్టాలి... అదీ శేషగిరి వ్యూహం!

"ఏయ్ రాధా!"

"ఏమిటండీ మీ బాధా?"

"ఒక్క బాధ కాదే రాధా! ఇదియొక బాధా తోరణాల గాథ..." అని శేషగిరి దీనంగా ఉపన్యాస ధోరణిలోకి దిగేసరికి, గిన్నె దించి కుంపటిని మూలకు లాగేసి, ఇటు తిరిగి పద్మాసనం వేసుకుని, అరచేతి మీద మొహం ఆనించి, శౌనకాది మహామునుల్లా కూర్చుంది సరోజ.

శుక మహర్షిలా మొదలెట్టాడు వాళ్ళాయన.

"మొట్టమొదటిసారి ఎగ్జిబిషన్లో నువ్వు మెరుపులా కన్పడ్డప్పుడు నువ్వు జ్యోత్స్నవని నమ్మాను. బీచి రోడ్లో దీపస్తంభం పక్కన నా కోసం నిలుచున్నప్పుడు, నీ పేరు లత అయితే ఎంత బాగుండునో అనుకున్నాను. మన పెళ్ళి పత్రికలో నీ పేరు చూడగానే కల్యాణి అనాలనిపించింది. ఆరోజు రాత్రి మనింట్లో కట్టేసిన దూడకు నువ్వు సపర్యలు చేస్తుంటే, నిన్ను కరుణా అని పిలుద్దామని తోచింది..."

"ఊ..." అంది, జోత్స్న, లతా, కల్యాణీ. కరుణ మెరుస్తున్న కళ్లతో!

"ఎందుకో నిన్న రాత్రి... నువ్వు ఎవరో కాదు, నా రాధవే అనిపించింది. పొద్దున్నే నీతో ఆ మాట చెప్పాలనుకుని..."

"అనూరాధా అని పిలిచారు... అంతేనా?"

"పోనీ వీటన్నిటిలో ఏదయినా ఒక్క పేరునెన్నుకోరాదూ?" అని సూచించాడు భర్త.

"నాకేదీ నచ్చలేదు"

"అయితే నీకు నచ్చిన పేర్లు చెప్పు. వాటిలో నాకు ఇష్టమయిన దానిని చెబుతాను!" అని రాజీ పడ్డాడు శేషగిరి.

అరనిముషం ఆలోచించింది సరోజ.

"వాసవదత్త ఎలా వుందీ?" అని అడిగింది.

"వసపోసిన గిత్తలావుంది–"

"వాణీయో?"

"బాణీ బావులేదు"

"విషమంగా ఉంది"

"మంగళ?"

"మరీ రేజర్ గుర్తుకొచ్చేలా వుంది"

క్షణం ఆగి పలికింది సరోజ. "పోనివ్వండి... ఇంకో రకం పేర్లు చెబుతాను. వాటిలో మీకు నచ్చింది తప్పక వుండి తీరుతుంది!"

"నీ ప్రయత్నాలకు నా సహకారం ఎప్పుడూ వుంటుంది!" అన్నాడా ఆదర్శ పురుషుడు.

"వెంకట సుబ్బమ్మ" అని పలికి పరీక్షగా శేషగిరిని చూసింది సరోజ. అతడు కళ్ళు మూసుకున్నాడు.

"లక్ష్మీ నరుసు" ఇది విని చేతులతో చెవులు మూసుకున్నాడు శేషగిరి.

అతడి చేతిని బలవంతాన లాగి పారేసి చెవిలో చెప్పింది సరోజ "అలిమేలు మంగ"

"ఆపు ఆపు! సరోజే బాగుంది, ఎంతో బాగుంది –" అని కళ్ళు చెవులు తెరిచాడు శేషగిరి.

శేషగిరినేడిపిస్తే తన చెవులు పిండుతాడు. అది సాకుగా అతడి ముక్కు పట్టి లాగొచ్చు... అదీ సరోజ పథకం!

"ఎబ్బే సరోజ మరీ పాతకాలం పేరండీ... కొత్తదేదయినా పెట్టుకోవాలని నాకూ వుంది."

"చాల్లేవమ్మాయ్... చాలు! ఏదో నేరక ఇందులోకి దిగాను... ఇంకా లెంపలు వాయించడమెందుకు?"

చిరునవ్వుల మువ్వలు గలగలలాడాయి.

"హుం.. రోజు రోజుకు రెచ్చిపోతున్నావు... నీ భర్త అనగా నీ దేవుడు, ఇలా పరాజితుడై పశ్చాత్తాపం వగైరా పడిపోతుంటే సిగ్గూ, భక్తీ లేకుండా నవ్వుతావా?"

"అది కాదండీ! ఆదివారం పొద్దున్నే నా పేరు మీద పడ్డారు కదా, తమ అభిధానాన్ని గురించి ఆలోచించారూ?"

ఆశ్చర్యంతో నిండాయి అబ్బాయి నయనాలు.

చిలిపిగా చెదిరాయి అమ్మాయి పెదవులు.

"ఏమండోయ్... కాస్త అవధరించండి! 'శేష' అంటే 'మిగిలిపోయినది' అని అర్థమండి. గిరి అంటే కొండ.. అని తాత్పర్యమండి! తమ నామానికి మిగిలిపోయిన కొండ అని టీక వస్తుందండి" నవ్వణచుకోలేని సరోజ చెక్కిళ్ళలో కుంకుమ వర్షించింది.

"మిగిలిపోయిన కొండ కాకపోతే కుండ అనుకో... నాకేం నీ మొగుడి పేరేగా!"

"మిగిలిపోయిన కుండ! మిగిలి..పోయిన..కుండ" అని రెండుసార్లు అనుకుని, "బాగుందిస్మండీ, కొండ కన్నా ఇదే నయం!" అంది సరోజ అల్లరి మీద అమాయకత్వం పూసి.

"అంతగా నవ్వేయకోయ్... ఆమాత్రం విద్య నాకూ వచ్చు, కావాలంటే చెబుతా విను! రోజా అంటే గులాబీ పువ్వు. తెలిసిందా... 'స' అంటే 'తో' అని అర్థం!"

"ఏదీ, మన–చేతన్ —చే– తోడన్– తో– యేనా?"

"ఆ... అదేగాని, నువ్వు చిన్నయసూరిలా అడ్డం రాకు! ఏం... ఆ రెండర్థాలూ కలిపి నీ పేరుకు నిలువునా భాష్యం చెబుతే, గులాబీతో వుండునది అనగా ముల్లు అని తేలుతుంది!" అని విజయగర్వంతో చూసిన శేషగిరి మరుక్షణం కెవ్వుమన్నాడు.

"ఏయ్, నన్నలా గిల్లావెందుకూ?"

"ముల్లుని కదూ?" అన్న సరోజ వీపు మీద ఒక్కటి వడ్డించి "కొండని కదూ అంచేత!" అని సంజాయిషీ ఇచ్చాడు శేషగిరి.

"ఇంతకూ ఈ పూట మన భోజనం ఎవరింట్లోనో?" అంది సరోజ వీపు రుద్దుకుంటూ!

"కావాలంటే హోటలుకెళ్దాం. సాయంకాలం సినిమా అన్నావుగా, అలాగే అదీ కానిద్దాం!"

ఎందుకో ఎత్తు మారుతూందని తెలుసుకుంది తల వూపింది సరోజ.

"ఆ ముదురు పచ్చచీర మీదకు, నల్ల జరీ బార్డర్ చోళీ ఇవ్వాళే కొనుక్కుందాం... ఏం?"

"థాంక్స్!" అని అతడి కళ్ళల్లోకి చూసింది సరోజ.

ఆమె చూపుని తప్పించుకుంటూ శేషగిరి ఏదో నసిగినట్లనిపించింది.

"గొణక్కపోతే అదేదో వినపడేలా చెప్పరాదూ?"

"అబ్బే ఏముందీ... ఏమీలేదు గాని, సరోజా నీకింత చక్కగా కాఫీ తయారుచెయ్యడం ఎవరు నేర్పారా అని నాకెంతో ఆశ్చర్యం వేస్తూంటుంది!"

"ఓహో, ఇదన్నమాట కథ!" నవ్వుల పున్నమి ముందరి దశమిరేఖ మెరిసింది.

"నిజంగానే సరోజా! ఎందరెందరో తయారు చేసిన కాఫీలు తాగాను కానీ, నీలా అద్భుతంగా చేయగల్గిన వారింకొక్కరు కన్పించలేదు నాకు!"

"కవిగారి అభిప్రాయం కనుక్కున్నాను, కానీ బొత్తిగా లాభం లేదు మహాశయా! ఎన్ని డొంక తిరుగుళ్ళ వెంబడి వచ్చినా, మీకు రెండోసారి కాఫీ ఇవ్వబడదు. ఇహ దయ చెయ్యండి!"

"అబ్బే... రెండో సారి కాఫీ కావాలని నేనెప్పుడన్నాను. ఏదో సెలవు రోజు కదా, కాస్త తీరిక వుంది కదా, కాఫీ నువ్వెంచక్కా చేస్తావో చెబుతాం కదా! ఎటూ దాన్ని గురించి చెబుతున్నప్పుడు, దాంతస్పదియ్య, ఉదాహరణకయినా ఓ అర గ్లాసెడు

చేతిలో వుండడం బావుంటుంది కదా, అని సూచించబోయాను గానీ…"

"సూచనలు, యోచనలూ ఈ పూట ఫలించవు" అని స్పష్టంగా చెప్పింది సరోజ.

"ఏం?"

"ఏవేమిటి ఏం?.. నెల రోజుల కింద మీరేం చెప్పారో గుర్తులేదూ? టీ తాగి తాగి కృష్ణమీనన్ ఆపళంగా కింద పడిపోయాడని చెప్పలేదూ? కాఫీ తాగి తాగి మీ హెడ్‌క్లర్కు అల్సర్‌తో పోయాడని వివరించలేదూ?"

"ఆ రోజేదో ఊసుపోక కబుర్లు చెబుతే… అలా కన్నాంబలా మీదికొస్తావేం? "

"చక్కగా గంట కింద గ్లాసెడు కాఫీ తాగి మళ్ళీ తయారయ్యారేం?"

"ఏం… ఎందుకవనూ, ఎందుకవనూ అంట? ఇది నా ఇల్లు! ఇది నా హక్కు! ఇది నా స్వరాజ్యం…" అంటూ పేట్రేగిపోయాడు శేషగిరి.

"అయితే?"

"అయితే? నాకు కాస్త… కుంచెం… చాల తక్కువ ఉహూ కొద్దిగా కాఫీ కావాలి!"

"ఓహో!"

"ఓహో ఏవిటి సోహో? మాటలు చాలించి యాక్షన్… అనగా చర్య తీసుకొమ్మ్మ, లెమ్మ్మ!"

"ఊ… ఇంకా?"

"ఫ్రా… సరోజినీ బెఫెల్ ఇస్ట్ బెఫెల్"

"ఏ–వి–టి?"

"బె ఫెల్ ఇస్ట్ బె ఫెల్… "

"ఆజ్ఞంటే ఆజ్ఞే" అని ఈ జర్మను వాక్య తాత్పర్యం… 'ఫ్రా' అంటే శ్రీమతి అని అర్థం–" అని హిట్లర్ బట్లర్‌లో చిరునవ్వేశాడు శేషగిరి.

సరోజ లేచింది.

మన జర్మన్ దెబ్బకీవిడ అదిరిపోయింది! కాఫీపొడుఁ డబ్బాదులను అలమారలోంచి తీసేందుకు, లేచింది అని భ్రమపడ్డాడు నాయకుడు.

ఆమె అలమారకు తాళం వేసింది. శేషగిరి భస్మం అయిపోయాడు!

తాళాల గుత్తిని చీరెకొొంగుకు ముడేసింది. కొంగుతీసి నడుములో చెక్కుకుంది. ఎడమచేతిని నడుము కానించింది. నిల్చునే

చేయి జాపింది “బెఫెల్ ఈస్, నాట్ బెఫెల్ ఇహ లేవండి”

“నీ జర్మనింగ్లీషు మిశ్రమం నీ కాఫీలా లేదు” అని ఆమె చేతినందుకుని లేచాడు శేషగిరి.

ఇంతలో వీధివైపు నుండి ఎవరో బావురుమని అరుస్తున్నట్లు వినిపించగా అటు చెవి పెట్టాడు శేషగిరి! క్షణానికి రెండుసార్లు చొప్పున తన్నెవరో పిలుస్తున్నట్లు గ్రహించినవాడయి, వాయువేగంతో వెళ్ళి తలుపులు తీశాడు.

“ఓహో కోనేటిరావా! రావోయ్ కోనేరూ, రా!”

“ఏరా అబ్బీ ఇంకాస్సేపుంటే తలుపులు తీయించడానికి పోలీసుల్ని పిలిపించేవాడిని” అని జోకు పారేసి, నవ్వేసి, కుర్చీనలంకరించేశాడు కోనేటిరావు.

“ఏవిట్రా కోనేటం, ఇలా కొట్టుకొచ్చేశావేం... ఆ... ఊ... కబుర్లేమిటి? విశేషాలేవిటి? మీ ఆవిడ పురుడోసుకునీసిందా? మీ తమ్ముడెక్కడో జాయినయ్యాట్టగా? ఇల్లుగలావిడ మీ వాటా మీద కొత్త పెంకుల్నికప్పిందా? అసలు కప్పదా? కార్యాలయంలో ఎడ్ క్లర్కేవంటాడు!” అని రపతప ప్రశ్నలడిగేసి జవాబులు కూడా వినకుండా, వంటింటికేసి తిరిగి “సరోజా!” అని పిలిచాడు శేషగిరి.

తలుపువారకొచ్చి నిల్చుందావిడ.

“సరోజా, ‘మా కోరావు, కోరావు’ అని చెబుతుంటానే... ఆ కోనేరే వీడు!” అని కౌటిల్యుడిలా నవ్వి, “కాస్త మా ఇద్దరికీ కాఫీ పట్టుకొస్తావూ?” అని ముగించాడు.

గిరుక్కున తిరిగిన సరోజ వీపు చూస్తున్న శేషగిరికి... “అబ్బే ఇప్పుడు కాఫీ ఎందుకురా!” అన్న కోనేటి కంఠం విన్పించింది.

“కాఫీ ఎందుకేవిటి నీ మొహం... అది మన హక్కు” అన్నాడు శేషగిరి.

అర్థమయినట్లు నవ్వేసిన కోరావు “అదికాదోయ్.. ఇది కడుపా, కోనేరా? ఎన్నిసార్లు తాగడం” అని నవ్వి, ఇందాక శేషగిరి ఏకరువు పెట్టిన ప్రశ్నల లిస్టుకు వరుసగా సమాధానాలు వల్లిస్తున్నాడు–

సరోజ వెండిపళ్ళెంలో రెండు కప్పులుంచి తెచ్చింది. తలవంచుకుని కోనేటి పక్కనో కప్పుంచింది. ఘుప్పమంది కాఫీ కమ్మదనం!

“మా ఆవిడ చేతి కాఫీ ఏ–వన్‌గా వుంటుందిరా కోనేరూ” అంటూ సరోజ కళ్ళల్లోకి చూశాడు శేషగిరి.

ఆపాటి కావిడ అతడి పక్కన రెండో కప్పు ఉంచి, లోపలికి వెళ్ళిపోవడం జరిగింది.

“మరే... కాఫీ అచ్చం కొబ్బరినీళ్ళల్లా వున్నాయి శేషం! ఎంత అదృష్టవంతుడివో!”

గర్వంగా నవ్వుతూ తన కప్పులోకి చూసిన శేషగిరి చెంప ఫెళ్ళుమన్నట్లనిపించింది. లోపలెక్కడో సరోజ ఘల్లుమన్నట్లు కూడా అనిపించింది.

అతడి కప్పులో చిక్కటి పాలు తెల్లగా నవ్వాయి. కాఫీని చప్పరిస్తూ సమాధానాలు సాగించింది కోనేటిలోని కంఠం.

శేషగిరి బుర్ర తళుక్కు మంది.

"సరోజా!"

వచ్చింది.

"మా కాఫీలో మరీ ఇంత ఎక్కువ పంచదార వేశావేం... ఒ గ్లాసుతో డికాక్షన్ తెచ్చి పెడతావూ?" అతి వినయంతో అడిగాడు శేషగిరి.

"అబ్బే... నా దానిలో పంచదార సరిపోయిందే" అన్న కోనేటిస్వరం మహాయుద్ధంలో వున్న చెలికాడి చెవికందలేదు.

సరోజ వచ్చింది! ఠంగున పెట్టింది డికాక్షన్ గ్లాసును తక్షణం వెళ్ళిపోయింది.

ఆ డికాక్షన్ పాలతో కలిపి ఆరగిస్తూ "ఊ... నే చెప్పాను కదుటోయ్... కాఫీ తయారు చెయ్యడం అన్నది ఒక పెద్ద మహాగొప్ప కళ!" అన్నాడు శేషగిరి.

అవునన్నాడు కోనీరు. అదన్నాడు ఇదన్నాడు... ఎన్నో అని ఆఖరికి బయటికి ప్రవహించేశాడు

లోపలికి నడిచాడు శేషగిరి.

వంటిల్లు మూసివుంది.

ఆ పక్క గదిలో సోఫాలో కూర్చునుంది సరోజ. ఆమె మొహానికడ్డంగా దినపత్రిక వుంది.

పత్రికను లాగి పారేశాడు శేషగిరి. ఆమె కళ్ళు మూసుకుంది. నేల మీద ఆమె కాళ్ళ దగ్గర కూర్చున్నాడు.

"సరోజా!"

ఆమె కళ్ళు మూసుకునే వున్నాయి.

ఆమె తెల్లచీర నల్లంచును సరిచేస్తూ అన్నాడు "సరోజినీ! గోమొన్న సాయ్!!"

ఆమె కళ్లుతెరిచింది. నోరు తెరవకనే ప్రశ్నించింది.

శేషగిరి చెప్పాడు. "జపాను భాషలో గోమొన్న సాయ్ అంటే నన్ను క్షమించు అని అర్థం!"

ఆమె కళ్ళు నమ్మనన్నాయి.

"అవునోయ్!"

ఇంక, వాళ్ళిద్దరి మధ్య తానెందుకని దూరం సిగ్గుపడిపోయింది!

*(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, జూన్ 1961 నుంచి పునర్ముద్రణ)*

# తెలుగు భాషా సౌందర్యము





విభిన్న భాషాసంస్కృతులకు ఆటపట్టు మన దేశం. భాష .. మానవ జీవన మనుగడకు ఆయువుపట్టు! మాతృభాష జీవన మార్గదర్శి. ఎవరి మాతృభాష వారికి ప్రీతి. మన తెలుగు మనకి అత్యంత ప్రియమైనది. 'దేశ భాషలందు తెలుగు లెస్స...' అన్న కృష్ణదేవరాయలు దగ్గర్నుంచి, 'సుందర తెలుంగు' అన్న తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి వరకు, ప్రాచీనకవుల నుంచి నేటి ఆధునిక కవుల వరకు తెలుగుభాష సౌందర్యాన్ని ఎన్నో రీతుల వర్ణిస్తూనే వచ్చారు. తెలుగు భాషను అజంతా భాషగా పేర్కొన్నారు. అంటే తెలుగులో ప్రతి పదం ఒక అచ్చుతో ముగుస్తుంది.

దేశంలోని మరే ఇతర భాషలలో లేని కొన్ని ప్రక్రియలు మన తెలుగు భాషలో ఉండటం అమోఘం. ఆ ప్రక్రియలో మొదటిదిగా పద్యాన్ని చెప్పుకోవచ్చు. పద్యం కేవలం మన సొత్తు. మన భాష సౌందర్యాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ఎంత బాగా చెప్పారో చూడండి.

*మల్లెల వాసనల్ మరుల నాకేల? నా తెలుగు పద్యములందు తరలివచ్చు*
*చెరుకురసమ్ముల చింత నాకేల? నా తెలుగు జానపదపు తీర్థమదియె;*
*పుట్ట తేనియ రుచి పట్ట నాకేల? నా తెలుగు కావ్యములె ఆ తేనెధార*
*పంచదారల రుచి పదమ్ము నాకేల? నా తెలుగు సాహిత్యమ్ము తీపి పొలము;*
*తీపి తిన్నచో మొగమెత్తి తెల్లమొగము వేయగాని, నా తెలుగు వివేక రుచుల*
*తీపులు బతుకుతీపికి తేజమిడును, తెలుగు గుండెలోన వెలుగు దివ్యదీపము;*

ఇలా మన భాషలో ఉన్న ప్రక్రియలన్నిటికీ ప్రత్యేకతలు ఉన్నాయి. మరో ప్రక్రియ గురించి వచ్చే నెల చెప్పుకుందాం!

